veluturu telugu daily

వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి నల్గొండ
శనివారం 3.10.2026
సంపుటి : 9
సంచిక : 111
www. veluturu.com

హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 02: శుక్రవారం రోజున శంషాబాద్ విమానాశ్రయంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ప్రయాణ విరామం నిమిత్తం విచ్చేసిన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షులు బి. మహేష్ కుమార్ గార్లతో కలిసి ఘన స్వాగతం పలికిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్ రావు

డిసెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా

సెంట్రల్ కిచెన్ల ప్రారంభం

- ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్
- హరేకృష్ణ ఫౌండేషన్‌తో జున్నా సోలార్ సిస్టమ్స్, చైన్ ల్యాబ్స్
- సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో ఒప్పందం
- దీనిలో భారంగా రూ. 9 కోట్ల విరాళం అందజేత

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 02: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో నిర్మిస్తున్న సెంట్రలైజ్డ్ కిచెన్లను డిసెంబరు 9న ప్రారంభించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. నవంబర్ 30 నాటికి కిచెన్ల నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ కోసం హరేకృష్ణ ఫౌండేషన్‌తో జున్నా సోలార్ సిస్టమ్స్, చైన్ ల్యాబ్స్ ఇండియా సంస్థలు సీఎం సమక్షంలో ఒప్పందం చేసుకున్నాయి.

కమ్యూనిటీ కిచెన్ల ఏర్పాటుకు సంస్థల సాయం

నాగర్‌కర్నూల్, వికారాబాద్‌లో కమ్యూనిటీ కిచెన్ల ఏర్పాటుకు ఈ సంస్థలు సహకారం అందించను న్నాయి. జున్నా సోలార్ సిస్టమ్స్ సంస్థ నాగర్‌కర్నూల్‌లో కిచెన్ కోసం రూ. 5.17 కోట్ల చెక్కు ఇచ్చింది. వికారాబాద్‌లో సెంట్రలైజ్డ్ కిచెన్ కోసం చైన్ ల్యాబ్స్ రూ. 4 కోట్ల చెక్కును అందించింది. జున్నార్ సోలార్ సిస్టమ్స్ సీఎండీ శేఖర్‌రెడ్డి, సీఈవో అనిల్‌బాబు, చైన్ ల్యాబ్స్ ప్రతినిధి సమంత డే, వైస్ ప్రెసిడెంట్ బుగత సంతోష్‌కుమార్‌ను సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు.

క్యాలరీలను లెక్కించడానికి యాప్ వినియోగించాలి

సెంట్రలైజ్డ్ కిచెన్లన్నింటినీ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేయనున్నట్లు ముఖ్య మంత్రి రేవంత్రెడ్డి తెలిపారు. ఆహార నాణ్యత విషయంలో జాగ్రత్తలు పాటించాలని అధికారులకు సూచించారు. విద్యార్థులకు అందించే ఆహార పదార్థాల క్యాలరీలను లెక్కించడానికి యాప్‌లను ఉపయోగించుకోవాలని సీఎం సూచించారు. ప్రాంతాల వారీగా అక్కడి అలవాట్లకు అనుగుణంగా బ్రేక్‌ఫాస్ట్ తయారు చేయాలన్నారు. బ్రేక్‌ఫాస్ట్ వల్ల విద్యార్థులు సమయానికి పాఠశాలకు చేరుకుంటారని సీఎం తెలిపారు. విద్యార్థులు కిచెన్లను సందర్శించేలా చర్యలు తీసుకోవాలని, ఇది శాశ్వతంగా కొనసాగే కార్యక్రమం అయినందువల్ల అధికారులు అత్యంత జాగ్రత్త వహించాలని సీఎం రేవంత్రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల ట్రాక్ రికార్డును నమోదు చేయాలని సీఎం రేవంత్ అధికారులకు సూచించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, హరే కృష్ణ ప్రతినిధి సత్యగౌర చంద్ర దాస్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పెండింగ్‌పై కదలిక

- పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై అధికారుల దృష్టి
- రాష్ట్రవ్యాప్తంగా వేలాది దరఖాస్తుదారుల ఎదురుచూపులు
- జిల్లాల్లో ఫైళ్ల పరిశీలన వేగవంతం

హైదరాబాద్, వెలుతురు, అక్టోబర్ 02 తెలంగాణలో పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసాగా అమలవుతున్న కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల పెండింగ్ దరఖాస్తులపై తాజాగా కదలిక మొదలైంది. దరఖాస్తుల పరిశీలన, మంజూరు ప్రక్రియలో జాప్యంపై గత కొంతకాలంగా లబ్ధిదారుల నుంచి ఫిర్యాదులు వస్తుండగా.. జిల్లాల స్థాయిలో అధికారులు పెండింగ్ ఫైళ్లను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నారు.2026 జనవరిలో వెలువడిన వివరాల ప్రకారం.. రాష్ట్రంలో సుమారు 49 వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు నివేదికలు పేర్కొన్నాయి.

2

జంతర్ మంతర్‌లో ఉద్రిక్తత

- వందలాది మంది అరెస్ట్ సీఈసీ జ్ఞానేశ్ కుమార్
- రాజీనామాకు విద్యార్థి సంఘాల డిమాండ్
- ఏఐఎస్‌ఏ జాతీయ అధ్యక్షురాలు నేహా బోరా సహా పలువురు అదుపులోకి

న్యూఢిల్లీ, వెలుతురు అక్టోబర్ 2 : ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో అవకతవకలు జరిగాయంటూ ఆరోపిస్తూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థి సంఘాలు చేపట్టిన నిరసన ఉద్రిక్తంగా మారింది. ఏఐఎస్ఏ, ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ తదితర సంఘాలకు చెందిన కార్యకర్తలు ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు

2

గాంధీ మార్గమే

దేశానికి శ్రీరామరక్ష

- టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్
- మహాత్ముని త్యాగాలను స్మరించుకున్న కాంగ్రెస్ నేతలు
- ఎల్.బి స్టేడియంలో ఘనంగా గాంధీ 157వ జయంతి వేడుకలు

2

పోలీసింగ్ వ్యవస్థలో

కీలక మార్పులు

- జీవో 84తో పోలీస్ పరిధుల పునర్వ్యవస్థీకరణ
- 76 ప్రాంతాల్లో జోన్లు, డివిజన్ల మార్పులు
- ఆర్జీఐఏ పీఎస్ పేరు ఇక శంషాబాద్ పీఎస్
- ట్రాఫిక్, ఉమెన్ సేఫ్టీ, సైబర్ వింగ్‌లకూ కొత్త పరిధులు

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 02 : జీహెచ్ఎంసీ పునర్వ్యవస్థీకరణ నేపథ్యంలో పోలీసింగ్ వ్యవస్థలో రాష్ట్ర ప్రభుత్వం కీలక మార్పులు చేపట్టింది. హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి, ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్‌ల పరిధులలో జోన్లు,డివిజన్లు, లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్లు, మహిళా పోలీస్ స్టేషన్లు, ట్రాఫిక్ విభాగాల పరిధులను ప్రభుత్వం పునర్వ్యవస్థీకరించింది. 2025 డిసెంబర్‌లో నోటిఫై చేసిన పునర్వ్యవస్థీకరణలోని కొన్నింటిని సవరిస్తూ... హోం శాఖ సెప్టెంబర్ 30న మూడు ఉత్తర్వులను జారీ చేసింది. మెరుగైన పోలీసింగ్ సామర్థ్యం, పర్యవేక్షణ, శాంతిభద్రతల నిర్వహణ దృష్ట్యా ఈ చర్య చేపట్టినట్టుగా ప్రభుత్వం పేర్కొంది. ఈ ఉత్తర్వులలో ఏ ప్రాంతాలు ఏ జోన్, డివిజన్, పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వస్తాయో స్పష్టతనిచ్చింది. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని రాజీవ్ గాంధీ

2

గాంధీజీ అహింసా మార్గం, శాస్త్రిజీ దేశభక్తి

నేటికీ స్ఫూర్తిదాయకం

ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్ వెలుతురు అక్టోబర్ 02: జాతిపిత మహాత్మా గాంధీజీ జయంతి, మాజీ ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా ఆదిలాబాద్ గాంధీ చౌక్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ పాల్గొని మహనీయులకు ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ కూడా పాల్గొన్నారు. ఈ

2

గాంధీ ఆశయాలకు

కాంగ్రెస్ విరుద్ధం

- గాంధీ నిత్యం రామనామం జపించారు కాంగ్రెస్‌ది కుటుంబ వారసత్వ రాజకీయమని విమర్శ
- ఖైరతాబాద్‌లో బీజేపీని గెలిపించాలని బండి సంజయ్ పిలుపు

జమ్మికుంట, అక్టోబర్ 2, వెలుతురు : మహాత్మాగాంధీ జీవితాంతం హిందూ సనాతన ధర్మాన్ని ఆచరిస్తూ సత్యం, ధర్మం, న్యాయం కోసం నిలిచారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా జమ్మికుంటలో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గాంధీజీ

2

తెలంగాణ ప్రజా రవాణాలో

డిజిటల్ విప్లవం

- ఆర్టీసీ--మెట్రో ఉమ్మడి పాస్, 'మీ టికెట్' యాప్ ప్రారంభం
- 12 ఏళ్ల తర్వాత ఆటో చార్జీల సవరణ
- డిజిటల్ వారపు బస్ పాస్ అందుబాటులోకి

2

'మీ టికెట్' మొబైల్ యాప్, డిజిటల్ వారపు బస్ పాస్‌లను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శుక్రవారం హైదరాబాద్

హైదరాబాద్, వెలుతురు : తెలంగాణ ప్రజా రవాణా వ్యవస్థను ఆధునికీకరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. ఆర్టీసీ--మెట్రో ఉమ్మడి పాస్,

కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పెండింగ్‌పై కదలిక

మొదటి పేజీ తరువాయి...మొత్తం 1.2 లక్షల దరఖాస్తుల్లో 80,500 దరఖాస్తులు ఎమ్మార్వో కార్యాలయాల వద్ద ఉండగా, క్షేత్రస్థాయి పరిశీలన పూర్తయిన 39,500 దరఖాస్తుల్లో 29 వేల దరఖాస్తులు ఆర్డీవోల వద్ద పెండింగ్‌లో ఉన్నట్లు అప్పట్లో వెల్లడైంది. ఆర్డీవో స్థాయిలో పరిశీలన పూర్తయిన 10,500 దరఖాస్తుల్లోనూ సగం వరకు చెక్కులు మంజూరు కాలేదని నివేదిక పేర్కొంది.

హైకోర్టు పరిణామంతో మళ్లీ చెల్లింపులకు మార్గం

ఆగస్టు 2026లో తెలంగాణ హైకోర్టు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు సంబంధించిన ఎనిమిది ప్రభుత్వ ఉత్తర్వుల అమలుపై మధ్యంతర స్టే విధించడంతో కొంతకాలం చెల్లింపులపై అనిశ్చితి ఏర్పడింది. అయితే సెప్టెంబర్ 2న హైకోర్టు డివిజన్ బెంచ్ ఆ స్టేను నిలిపివేయడంతో అర్హులైన లబ్ధిదారులకు ఆర్థిక సాయం పంపిణీకి మార్గం సుగమమైంది. దీంతో పెండింగ్‌లో ఉన్న అర్హులైన దరఖాస్తుల పరిశీలన, మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాల్సిన అవసరం మరింత పెరిగింది.

జిల్లాల్లో పెండింగ్ ఫైళ్లపై ప్రత్యేక దృష్టి

తాజాగా రంగారెడ్డి జిల్లా కొందుర్గ్ మండల తహసీల్దార్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ కే. చంద్రారెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ సహా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్నింటినీ నిబంధనల ప్రకారం పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమీక్షించిన అంశాలకు సంబంధించిన పెండింగ్ కేసులను 10 రోజుల్లో పరిష్కరించి, చర్యలపై నివేదిక సమర్పించాలని అధికారులకు గడువు విధించారు. నిజామాబాద్ జిల్లాలోనూ తాజాగా మంజూరుకు సిద్ధంగా ఉన్న 255 కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ ఫైళ్లపై పరిశీలన, సంతకాల ప్రక్రియ జరిగినట్లు నివేదికలు వెల్లడించాయి. పెండింగ్‌లో ఫైళ్లను ఉంచకుండా త్వరితగతిన ప్రభుత్వానికి పంపాలని అధికారులకు సూచనలు చేసినట్లు సమాచారం.

రూ.1,00,116 ఆర్థిక సాయం

ప్రస్తుతం పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు రూ. 1,00,116 ఆర్థిక సహాయం అందుతోంది. 2014లో రూ.51 వేలతో ప్రారంభమైన సాయం 2017లో రూ.75,116కు, 2018లో రూ.1,00,116కు పెరిగింది. 2026 అక్టోబర్ నాటికి కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు 12 సంవత్సరాలు పూర్తి చేసుకోగా, ఇప్పటివరకు 16,78,347 మంది లబ్ధిదారులకు రూ.16,375.87 కోట్ల మేర ప్రభుత్వం ఖర్చు చేసినట్లు తాజా నివేదికలు పేర్కొంటున్నాయి.

బడ్జెట్ ఉన్నా.. ఖర్చులో తగ్గుదల

2026 మేలో వచ్చిన నివేదిక ప్రకారం, మైనారిటీ సంక్షేమ శాఖకు 2025-26లో రూ.650 కోట్ల బడ్జెట్ కేటాయించినప్పటికీ రూ.278.40 కోట్లు మాత్రమే ఖర్చయ్యాయి. ఎస్సీ అభివృద్ధి శాఖలో రూ.600 కోట్ల కేటాయింపులకు రూ.200 కోట్లు, గిరిజన సంక్షేమ శాఖలో రూ.260 కోట్లకు రూ.143.17 కోట్లు ఖర్చయినట్లు పేర్కొంది. దరఖాస్తుల పరిశీలన, నిధుల కేటాయింపులో జాప్యం కారణంగా పేద కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆ నివేదిక పేర్కొంది.

16.78 లక్షల కుటుంబాలకు చేరిన పథకం

కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు 2014 అక్టోబర్ 2న ప్రారంభమయ్యాయి. పెళ్లి చేసుకునే యువతికి 18 ఏళ్లు పూర్తయి ఉండాలనే నిబంధనతో పాటు ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ కుటుంబాలతో ప్రారంభమైన పథకాలు తర్వాత బీసీ, ఈబీసీ వర్గాలకూ విస్తరించాయి. 12 ఏళ్లలో 16.78 లక్షలకు పైగా కుటుంబాలకు సాయం అందినట్లు తాజా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇక పెండింగ్‌లో ఉన్న అర్హులైన దరఖాస్తులను ఎంత వేగంగా పరిష్కరిస్తారు? పెళ్లి పూర్తయి నెలలు గడిచినా సాయం కోసం ఎదురుచూస్తున్న కుటుంబాలకు ఎప్పుడు డబ్బులు అందుతాయి? అనేది ఇప్పుడు కీలకంగా మారింది. జిల్లాల వారీగా పెండింగ్ ఫైళ్లను గుర్తించి గడువులోగా పరిష్కరిస్తే లబ్ధిదారులకు ఉపశమనం లభించే అవకాశం ఉంది.

కల్యాణ లక్ష్మితో
బాల్య వివాహాలకు అడ్డుకట్ట

మొదటి పేజీ తరువాయి... పుట్టిన ఆడబిడ్డలకు బంగారు ఉంగరం అందించే పథకాన్ని ప్రారంభించిందని హరీశ్‌రావు పేర్కొన్నారు. తెలంగాణలో మాత్రం తులం బంగారం హామీ అమలుకు సంబంధించి పరిస్థితి దిక్కుతోచని స్థితిలో ఉందని విమర్శించారు. కల్యాణ లక్ష్మి--షాదీ ముబారక్‌ను నిర్వీర్యం చేసే ప్రయత్నాలను నిలిపివేయాలని, ఏడాది కాలంగా పెండింగ్‌లో ఉన్న సుమారు రెండు లక్షల దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. అభయహస్తం మేనిఫెస్టోలో ఇచ్చిన రూ.లక్షతో పాటు తులం బంగారం హామీని అమలు చేయాలని కోరారు. ఈ పథకాన్ని రాజకీయ కక్షలకు బలిచేయకుండా పేదింటి ఆడబిడ్డలకు అండగా కొనసాగించాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేశారు.

గాంధీ మార్గమే దేశానికి శ్రీరామరక్ష

మొదటి పేజీ తరువాయి... హైదరాబాద్, అక్టోబర్ 2: మహాత్మా గాంధీ జయంతి యావత్ ప్రపంచానికి పండుగని, శాంతిని కోరుకునే ప్రతి ఒక్కరికీ ఇది స్ఫూర్తిదాయకమైన రోజని టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. హైదరాబాద్‌లోని ఎల్.బి. స్టేడియంలో నిర్వహించిన గాంధీ 157వ జయంతి వేడుకల్లో ఆయన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతలు జ్యోతి ప్రజ్వలన చేసి గాంధీ జయంతి వేడుకలను ప్రారంభించారు. అనంతరం మహాత్మా గాంధీ చిత్రపటానికి నివాళులర్పించి, దేశ స్వాతంత్ర్యం కోసం ఆయన చేసిన త్యాగాలను, సత్యం, అహింస, శాంతి, సామాజిక సమానత్వం వంటి ఆశయాలను స్మరించుకున్నారు. మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. గాంధీజీ చూపిన మార్గం దేశానికి శ్రీరామరక్ష వంటిదని, ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టడం ద్వారా ప్రజాస్వామ్య విలువలను మరింత బలోపేతం చేయవచ్చని అన్నారు. గాంధీ మార్గాన్ని అనుసరించినప్పుడే ప్రజాస్వామ్యం మరింత పటిష్టంగా, ప్రజాకేంద్రంగా కొనసాగుతుందని పేర్కొన్నారు. గాంధీజీ స్ఫూర్తితో సమాజ సేవలో నిస్వార్థంగా పనిచేస్తున్న ప్రతి ఒక్కరికీ ఆయన మనస్ఫూర్తిగా అభినందనలు తెలిపారు. సత్యం, అహింస, శాంతి, సహనం వంటి గాంధేయ విలువలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అంతకుముందు ఎల్.బి. స్టేడియం ఆవరణలో ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను నేతలు సందర్శించారు. స్టాల్స్ నిర్వాహకులతో ముచ్చటించి, అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమాలు, ప్రదర్శనల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, వివేక్ వెంకట్ స్వామి, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతు రావు, ఫయీమ్ ఖురేషీ, అంజన్ కుమార్ యాదవ్, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గాంధీ ఆశయాలకు కాంగ్రెస్ విరుద్ధం

మొదటి పేజీ తరువాయి... నిత్యం రామనామం జపించారని, రాముడిని సత్యం, ధర్మం, న్యాయానికి ప్రతిరూపంగా భావించారని తెలిపారు. గాంధీ కలలుగన్న రామరాజ్యంలో పేద, ధనిక తేడా లేకుండా చివరి వ్యక్తికీ సంక్షేమ ఫలాలు అందాలని ఆకాంక్షించారని పేర్కొన్నారు.

మోదీ, బీజేపీనే గాంధీ ఆశయాలను అమలు చేస్తున్నాయని వ్యాఖ్య

గాంధీ కుటుంబ వారసత్వ రాజకీయాలకు వ్యతిరేకమని, ప్రస్తుత కాంగ్రెస్ కుటుంబ వారసత్వ రాజకీయాలకు పాల్పడు తోందని బండి సంజయ్ విమర్శించారు. గాంధీ ఆశయాల పేరుతో రాజకీయ ప్రయోజనాలు పొందుతున్నారని కాంగ్రె స్‌పై ఆరోపణలు చేశారు. స్వచ్ఛ భారత్, పేదలకు సంక్షేమ పథకాలు, సనాతన ధర్మ పరిరక్షణ వంటి అంశాల్లో ప్రధాని మోదీ, బీజేపీ గాంధీ ఆలోచనలను ఆచరిస్తున్నాయని ఆయన అన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై విమర్శలు

కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రజలకు స్ఫూర్తినిచ్చే విధంగా పనిచేయడం లేదని విమర్శించారు. తెలంగాణలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం వస్తేనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. ఖైరతాబాద్ ఉపఎన్నికకు కాంగ్రెస్‌దే కారణమని ఆరోపిస్తూ, అక్కడ బీజేపీని గెలిపించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి పోటీ చేసినా ప్రజలు బీజేపీ వైపే నిలవాలని కోరారు.

కల్యాణ లక్ష్మితో బాల్య వివాహాలకు అడ్డుకట్ట

- సుమారు రెండు లక్షల దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు

హైదరాబాద్, వెలుతురు, అక్టోబర్ 02: కల్యాణ లక్ష్మి--షాదీ ముబారక్ పథకం లక్షలాది ఆడబిడ్డల జీవితాల్లో వెలుగులు నింపడంతో పాటు బాల్య వివాహాలను అడ్డుకోవడంలో కీలక పాత్ర పోషించిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు అన్నారు. పేద కుటుంబాల్లో ఆడబిడ్డల వివాహ భారాన్ని తగ్గిస్తూ సామాజిక సంస్కరణకు ఈ పథకం నాంది పలికిందని పేర్కొన్నారు. ఒక తండ్రి తన కుమార్తె వివాహం కోసం దాచుకున్న డబ్బు, బంగారం అగ్నిప్రమా దంలో కాలిపోయిన ఘటనతో కేసీఆర్ ఈ పథకానికి రూపకల్పన చేశారని హరీశ్‌రావు తెలిపారు. 2002 మార్చిలో ములుగు మండలం గుత్తూరు తండాలో జరిగిన అగ్నిప్రమాదంలో బానోతు కీమానాయక్ కుటుంబం ఎదుర్కొన్న పరిస్థితిని చూసి కేసీఆర్ స్పందించారని చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం ఆ బాలిక వివాహాన్ని జరిపించి ఆర్థిక సాయం అందించారని, అనంతరం ఈ ఆలోచన కార్యా చరణ రూపం దాల్చి కల్యాణ లక్ష్మి--షాదీ ముబారక్ పథకంగా మారిందని వివరించారు. 2014 అక్టోబర్ 2న రూ.51 వేల ఆర్థిక సాయంతో పథకాన్ని ప్రారంభించారని, 2017లో రూ.75, 116కు, 2018లో రూ.1,00,116కు పెంచారని హరీశ్‌రావు తెలిపారు. తొమ్మిదిన్నరేళ్ల బీఆర్ఎస్ పాలనలో 13,15,297 మంది ఆడబిడ్డలకు రూ.11,560 కోట్లకు పైగా ఆర్థిక సాయం అందించినట్లు పేర్కొన్నారు. కల్యాణ లక్ష్మి ఒక సంక్షేమ పథకం మాత్రమే కాకుండా బాల్య వివాహాల నిర్మూలనకు, పేద కుటుంబాలకు అండగా నిలిచే సామాజిక కార్యక్రమంగా మారిందని హరీశ్‌రావు అన్నారు.

పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించాలి

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కల్యాణ లక్ష్మి--షాదీ ముబారక్ పథకం పట్ల నిర్లక్ష్యం నెలకొందని హరీశ్‌రావు ఆరోపించారు.

గాంధీజీ అహింసా మార్గం, శాస్త్రిజీ ...

మొదటి పేజీ తరువాయి...సందర్భంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ.. మహాత్మా గాంధీజీ సత్యం, అహింస, శాంతియుత పోరాటం ద్వారా దేశ ప్రజలను ఏకం చేసి స్వాతంత్ర్య ఉద్యమానికి నాయకత్వం వహించారని అన్నారు. హింసకు తావులేకుండా ప్రజల స్వేచ్ఛ కోసం ఆయన సాగించిన పోరాటం నేటి తరానికి కూడా అనుసరణీయమని పేర్కొన్నారు. అదేవి ధంగా లాల్ బహదూర్ శాస్త్రి సరళత, నిజాయితీ, క్రమశిక్షణకు ప్రతీకగా నిలిచారని ఎమ్మెల్యే అన్నారు. దేశానికి క్లిష్ట పరిస్థితుల్లో ప్రధానమంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ ప్రజల్లో దేశభక్తి, ఐక్యతా భావాన్ని పెంపొందించారని పేర్కొన్నారు. "జై జవాన్, జై కిసాన్" అనే నినాదంతో దేశ రక్షణలో సైనికుల పాత్రను, దేశ ఆహార భద్రతలో రైతుల ప్రాధాన్యతను శాస్త్రిజీ చాటి చెప్పారని అన్నారు. గాంధీజీ చూపిన అహింసా మార్గం, శాస్త్రిజీ చూపిన దేశభక్తి, నిజాయితీ, సేవా భావం నేటి సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. వారి ఆశయాలను ఆచర ణలో పెట్టడమే వారికి అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నా రు. ఈ కార్యక్రమం లో ప్రజాప్రతినిధులు, అధికా రులు, నాయకులు, లాలా మున్నా. అశోక్. జోగు రవి. సంతోష్. సతీష్. ముకుంద. గంట జీవన్. శ్రీకాంత్ . హనుమల్లు కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజా రవాణాలో
డిజిటల్ విప్లవం

మొదటి పేజీ తరువాయి... ప్రజాభవన్‌లో ప్రారంభించారు. రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రులు వివేక్ వెంకటస్వామి, మహమ్మద్ అజారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఒకే పాస్‌తో ఆర్టీసీ--మెట్రో

ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని టీజీఎస్ఆర్టీసీ నగర బస్సులు (పుష్పక్ మినహా), మెట్రో రైళ్లలో ప్రయాణించేందుకు ఉమ్మడి పాస్‌ను అందుబాటులోకి తెచ్చారు. రోజువారీ పాస్ ధర రూ.400 (మెట్రో రూ.300, ఆర్టీసీ రూ.100), నెలవారీ పాస్ రూ.8,500 (మెట్రో రూ.7,000, ఆర్టీసీ రూ.1,500). కార్డు కోసం తొలిసారి రూ.100 డిపాజిట్ చెల్లించాలి. కార్డు తిరిగి ఇస్తే ఆ మొత్తాన్ని వెనక్కి చెల్లిస్తారు. ఈ పాస్‌తో ప్రయాణికులకు మొదటి దశ, చివరి దశ రవాణా అనుసంధానం సులభతరం కానుంది.

'మీ టికెట్'తో డిజిటల్ టికెట్

మొబైల్ యాప్ ద్వారా బస్ టికెట్లు, రోజువారీ, వారపు, నెలవారీ పాస్‌లు కొనుగోలు చేసుకోవచ్చు. ఎక్కేస్థలం, చేరాల్సిన గమ్యస్థానం ఎంపిక చేసి ఆన్‌లైన్ చెల్లింపుతో చలనశీల సంకేత గుర్తు కలిగిన డిజిటల్ టికెట్ పొందవచ్చు. రూ.600తో డిజిటల్ వారపు బస్‌పాస్‌ను కూడా అందుబాటులోకి తెచ్చారు.

మంత్రులతో ఉమ్మడి పాస్ ప్రయాణం

ప్రజలకు అవగాహన కల్పించేందుకు భట్టి విక్రమార్క మంత్రుల కోసం ఒకరోజు ఉమ్మడి పాస్‌లు కొనుగోలు చేశారు. శనివారం ఉదయం 10 గంటలకు బేగంపేట మెట్రో స్టేషన్ నుంచి మెట్రోలో, అనంతరం ఆర్టీసీ బస్సులో మంత్రులు ప్రయాణించనున్నారు.

12 ఏళ్ల తర్వాత ఆటో చార్జీల సవరణ

2014లో నిర్ణయించిన చార్జీలను ప్రభుత్వం సవరించింది. మొదటి 1.6 కిలోమీటర్లకు రూ.30, ఆ తర్వాత ప్రతి కిలోమీటర్‌కు రూ.14, నిరీక్షణకు నిమిషానికి 75 పైసలు, రాత్రి 11 నుంచి ఉదయం 5 గంటల వరకు సాధారణ చార్జీకి ఒకటిన్నర రెట్లు వసూలు చేయనున్నారు. ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

నగరంలో రోడ్లు, వంతెనలు, పైవంతెనలు, భూగర్భ మార్గాలు, తాగునీటి వసతుల కోసం రూ.52 వేల కోట్ల పనులు కొనసాగుతున్నాయని భట్టి విక్రమార్క తెలిపారు. మెట్రోను 122 కిలోమీటర్ల మేర విస్తరించేందుకు రూ.38 వేల కోట్లతో రెండో దశ చేపట్టనున్నట్లు చెప్పారు. ఔటర్ రింగ్ రోడ్డు--ప్రాంతీయ రింగ్ రోడ్డు అనుసంధానానికి 21 రేడియల్ రోడ్లను అభివృద్ధి చేస్తున్నామన్నారు. డీజిల్ బస్సుల స్థానంలో విద్యుత్ బస్సులను ప్రవేశపెడుతున్నామని, ఇప్పటికే 550 అందుబాటులోకి వచ్చాయని, మరో 2,200 తీసుకురానున్నట్లు భట్టి తెలిపారు. విద్యుత్ ఆటోలకు మార్పిడి కోసం రూ.200 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ప్రజా రవాణాను సాంకేతికతతో అనుసంధానం చేసి భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తామని మంత్రులు తెలిపారు.

పోలీసింగ్ వ్యవస్థలో
కీలక మార్పులు

మొదటి పేజీ తరువాయి...అంతర్జాతీయ విమానాశ్రయ డివిజన్‌ను శంషాబాద్ డివిజన్‌గా, చికడపల్లి డివిజన్‌ను కాచిగూడ డివిజన్‌గా, సంతోష్ నగర్ డివిజన్‌ను ఛత్రినాక డివిజన్‌గా మార్పులు చేశారు. ఆర్‌జీఐఏ పోలీస్ స్టేషన్‌ను శంషాబాద్ పోలీస్ స్టేషన్‌గా పేరు మార్చారు. రాజేంద్రనగర్, పహాడీషరీఫ్, మీర్‌పేట పోలీసు స్టేషన్‌లను హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోకి తెచ్చారు. సికింద్రాబాద్ జోన్, మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొన్ని ప్రాంతాలను మహంకాళి పోలీస్ స్టేషన్ పరిధిలోకి మార్చారు. ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్ మొత్తాన్ని ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోకి మార్చారు. హైదరాబాద్ సిటీ ట్రాఫిక్ పోలీస్ విభాగంలోనూ పలు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధులను పునర్వ్యవస్థీకరించారు. వివిధ లా అండ్ ఆర్డర్ పోలీసు స్టేషన్‌లను అనుగుణంగా ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌ల పరిధులను సవరించారు.

ఆయుధ వ్యాపారితో మల్లేశ్‌కు సంబంధాలు

- -ఆయుధాల చోరీ కేసులో సంచలన మలుపులు
- -మద్రాస్ రెజిమెంట్ ఆయుధాల చోరీ కేసు వ్యవహారం కోల్కతాకు..
- -చోరీ చేసిన గన్నును అవల్దెయ్యుకు అమ్మేందుకు మల్లేశ్ యత్నం

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 02 : బొల్లారంలోని మద్రాస్ రెజిమెంట్ ఆర్మీ ఆయుధాల చోరీ కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. 10 రోజుల కస్టడీలో మల్లేశ్ నుంచి పోలీసులు కీలక వివరాలు వెల్లడించారు. తాను ఆర్మీలో చేరినప్పటి నుంచి ఆయుధాలు, మందుగుండు సామాగ్రిపై శిక్షణ పొందిన మల్లేశ్ పనిచేసిన చోటా ఆయుధాగారాల బాధ్యతలు నిర్వహించినట్లు పోలీసులు గుర్తించారు. ఆర్థిక ఇబ్బందులు, సర్వీస్‌కు సంబంధించిన అసంతృప్తితోనే చోరీకి పథకం వేసినట్లు విచారణలో వెల్లడైనట్లు సమాచారం. సహచరుల సహకారంతో రెక్కీ, సీసీ కెమెరాల నిర్వీర్యం, జవాన్లను డైవర్ట్ చేయడం ఆపై ఆయుధాలను తరలించడం వరకు పక్కా స్కెచ్ వేసినట్లు పోలీసులు చెబుతున్నారు. ఇక చోరీ చేసిన ఆయుధాలను కోల్‌కతాకు చెందిన బీర్బల్ షా ద్వారా ఆయుధ డీలర్ అవల్‌దెయ్ అలియాస్ ఓబీకి విక్రయించేందుకు ప్రయత్నించినట్లు తేలింది. ఈ అక్రమ ఆయుధాల నెట్‌వర్క్‌కు సంబంధించి బంగ్లాదేశ్ నుంచి వచ్చే వ్యక్తులు, రోహింగ్యాలతో సంబంధాలున్నాయా అనే కోణంలోనూ దర్యాప్తు సాగుతోంది.

మూడేళ్లు సర్వీస్కు అవకాశం

2009లో భారత ఆర్మీలో చేరిన సమయంలోనే ఆయుధాలు, మందుగుండు సామాగ్రిపై శిక్షణ పొందినట్లు పోలీసులు చెబుతున్నారు. ఏ కంటోన్మెంట్‌లో విధులు నిర్వహించినా ఆయుధాగారం బాధ్యతలు చూసినట్లు సమాచారం. విధుల్లో నిర్లక్ష్యం కారణంగా పలుమార్లు ఉన్నతాధికారుల నుంచి క్రమశిక్షణ చర్యలు ఎదుర్కొన్నట్లు విచారణలో వెల్లడైంది. 16 ఏళ్ల ఆర్మీ సర్వీస్ పూర్తైన తర్వాత మరో మూడేళ్ల సర్వీస్‌కు అవకాశం ఉన్నప్పటికీ పొడిగించకపోవడంతో మల్లేశ్లో అసంతృప్తి పెరిగినట్లు పోలీసులు చెబుతున్నారు. 2022లో కలకత్తా బ్యారక్‌పూర్ కంటోన్మెంట్‌లో విధులు నిర్వహిస్తున్న సమయంలో ఓ ఉన్నతాధికారితో దురుసుగా వ్యవహరించినట్లు కూడా విచారణలో తేలినట్లు సమాచారం. అదే సమయంలో యూనిట్ సమీపంలో చెరుకు రసం దుకాణదారుడు బీర్బల్ షాతో మల్లేశ్కు పరిచయం ఏర్పడింది. బీర్బల్ షా దేశంలో అక్రమంగా తుపాకులు సేకరించి విక్రయించే అవల్‌దెయ్యును మల్లేశుకు పరిచయం చేశాడు. ఓబీ స్మగ్లరా కాదా అని తెలుసుకునేందుకు రూ.10 వేలకు ఓ తుపాకీ కొనుగోలు చేసిన మల్లేశ్, దానితో అమాయకులను బెదిరించి దారి దోపిడీ చేయాలని ప్రయత్నించినట్లు సమాచారం. కోల్‌కతాలో అది సాధ్యం కాకపోవడంతో దానిని ఉపయోగించకుండా స్వగ్రామంలో దాచినట్లు పోలీసులు వెల్లడించారు.

ఆర్థిక ఒత్తిడి పెరగడంతో ఆయుధాల చోరీకి ప్లాన్

కొంతకాలం సస్పెన్షన్‌లో ఉన్న మల్లేశ్ 2023లో మళ్లీ బ్యారక్‌పూర్‌లో విధుల్లో చేరాడు. ఆ తర్వాత 2025 జూన్‌లో బొల్లారంలోని మద్రాస్ రెజిమెంట్‌కు బదిలీ అయ్యాడు. భార్య, పిల్లలతో కలిసి యాప్రాల్‌లో అద్దె ఇంట్లో నివసించాడు. ఇదే సమయంలో నాగర్‌కర్నూల్ టౌన్ శ్రీపురం వద్ద 2022లో తనకు ఉన్న ఖాళీ స్థలంలో ఇంటి నిర్మాణం ప్రారంభించాడు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ వస్తాయన్న ఆలోచనతో అప్పులు చేసి ఇంటి నిర్మాణం చేపట్టినట్లు సమాచారం. ఆ తర్వాత నాగర్‌కర్నూల్ ప్రాంతంలో సుమారు రూ.8 లక్షల విలువైన ప్లాట్ కొనుగోలు చేశాడు. ఇంటి నిర్మాణం, ప్లాట్ కొనుగోలు వల్ల ఆర్థిక ఒత్తిడి పెరగడంతో దాని నుంచి బయటపడేందుకు ఆర్మీ ఆయుధాల చోరీకి పథకం వేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

2025లో ప్లాన్ చేసి, 2026లో అమలు

తన చిన్ననాటి స్నేహితులైన నిరంజన్, మల్లికార్జున్‌తో కలిసి మొదట్లో చోరీకి ప్లాన్ చేశాడు. బ్యాంకులు, బంగారు దుకాణాల్లో దొంగతనాలకు సంబంధించిన వెబ్‌సిరీస్‌లు, వీడియోలు చూసి వాటిని స్నేహితులకు పంపినట్లు విచారణలో వెల్లడైంది. ఆ ప్రేరణతో ఆర్మీ ఆయుధాలు దొంగిలించాలనే ఆలోచనకు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. 2025లోనే ప్లాన్ చేసినా నిరంజన్, మల్లికార్జున్ అంగీకరించకపోవడంతో వ్యూహం మార్చుకున్నాడు. 2026 జులైలో మద్రాస్ రెజిమెంట్ 20వ బెటాలియన్‌లో పలుమార్లు రెక్కీ నిర్వహించి అక్కడ పనిచేస్తున్న శేషులు, తన బ్యాచ్‌మేట్ ప్రవీణ్ సహకారం తీసుకున్నాడు.

చోరీ రోజున కెమెరాలపై ఫోమ్ చల్లిన మల్లేశ్

హెడ్‌క్వార్టర్ కోట్‌లో భద్రపరిచిన ఆయుధాలు, మందుగుండు సామాగ్రిని చోరీ చేసేందుకు మల్లేశ్ తరచూ శేషులను సంప్రదించేవాడు. అక్కడే పని చేస్తున్న వినోద్‌ను కూడా చోరీకి సహకరించాలని కోరారు. ఇందుకు ఫుట్‌బాల్ గ్రౌండ్ వద్ద శేషు ద్వారా వినోద్‌కు రూ.లక్ష ఇచ్చినట్లు విచారణలో వెల్లడైంది. దీంతో వినోద్ చోరీకి అంగీకరించినట్లు సమాచారం. ప్రణాళిక ప్రకారం చోరీకి వారం రోజుల ముందే సీసీ కెమెరాలను పనిచేయకుండా చేశాడు. చోరీ జరిగిన రోజు కెమెరాలపై మల్లేశ్ ఫోమ్ చల్లాడు. తనకు సహకరించేందుకు ప్రవీణ్, శేషులు విద్యుత్ దీపాలను ఆపేశారు.

జంతర్ మంతర్‌లో ఉద్రిక్తత

మొదటి పేజీ తరువాయి...

నిరసనకారులను అదుపులోకి తీసుకున్నారు.

నేహా బోరా అదుపులోకి..

ఏఐఎస్ఏ జాతీయ అధ్యక్షురాలు నేహా బోరా కూడా నిరసనలో పాల్గొన్నారు. పోలీసులు ఆమెను అదుపులోకి తీసు కుని పోలీసు బస్సులో తరలించారు. ఆమెతో పాటు ఆప్ ఢిల్లీ అధ్యక్షుడు సౌరభ్ భరద్వాజ్, సామాజిక కార్యకర్త యోగేంద్ర యాదవ్ తదితరులను కూడా పోలీసులు అదుపులోకి తీసుకు న్నట్లు సమాచారం.

ఎస్ఐఆర్‌పై అభ్యంతరాలు..

ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై పారదర్శకత, ఓటు హక్కుకు సంబంధించిన అంశాల్లో ప్రశ్నలు ఉన్నాయని నిరసనకారులు పేర్కొన్నారు. ఈ అంశాలపై ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలని, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు.

భారీగా పోలీసు బందోబస్తు

నిరసన నేపథ్యంలో న్యూఢిల్లీలో పోలీసు లు ఆంక్షలు విధించారు. జంతర్ మం తర్ పరిసరాల్లో భారీగా బలగాలను మోహరించారు. పలువురు నిరసనకా రులను పోలీసు బస్సుల్లో తరలించారు.

ఐదేళ్లు ఉద్యోగం చేస్తే 3 ఫైవ్‌స్టార్ హోటళ్ళు వస్తాయా?

- 100 ఎకరాల్లో ఫాంహౌస్‌లు ఎలా వచ్చాయి కేటీఆర్..?
- కరువు వచ్చిందని ప్రజలు బాధ పడుతుంటే.. బిఆర్ఎస్, బీజేపీ నాయకుల రాక్షసానందం
- రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆగ్రహం
- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం ఖాయం

నల్లగొండ, వెలుతురు, అక్టోబర్ 02 : గత బిఆర్ఎస్ ప్రభుత్వం 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తున్నామని ప్రజలను తీవ్రంగా మోసగించిందని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శించారు. శుక్రవారం నల్లగొండ పర్యటనలో భాగంగా పలువురు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులతో ఇందిరాభవన్ వద్ద ఆయన మాట్లాడారు. బిఆర్ఎస్,బీజేపీ వ్యవహరిస్తున్న వైఖరి పట్ల తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రపంచవ్యాప్తంగా ఎల్ నినో ప్రభావంతో తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని,రాష్ట్రంలో బోరు బావులపై ఆధారపడి వ్యవసాయం పెరగడంతో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిందని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ దాదాపు 20,000 మెగావాట్లకు చేరిందన్నారు. కరువు వచ్చిందని ప్రజలు బాధ పడుతుంటే బిఆర్ఎస్, బీజేపీ పార్టీ నాయకులు రాక్షసానందం పొందుతున్నారని మంత్రి ధ్వజమెత్తారు. గత ప్రభుత్వం హయంలో ఆనాడు తానే స్వయంగా సబ్ స్టేషన్‌కు వెళ్ళి లాగ్‌బుక్ పరిశీలించి బిఆర్ఎస్ 24 గంటల కరెంటు ఇస్తున్నామని చేసిన నకిలీ ప్రచారాన్ని బట్టబయలు చేశానని గుర్తుచేశారు. మేము గత ప్రభుత్వంలాగ 'దళిత ముఖ్యమంత్రి', '24 గంటల విద్యుత్' అంటూ అబద్ధపు హామీలు ఇవ్వడం లేదని,వాస్తవాలను ప్రజల ముందుంచుతున్నామని స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నిలిచిపోయిన యాదాద్రి పవర్ ప్లాంట్‌ను పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చామన్నారు. రాష్ట్రంలోని అన్ని వనరులను సద్వినియోగం చేసుకుంటూ, కోల్ ఇండియా సహకారంతో భవిష్యత్తులో ఎంతటి కరువు వచ్చినా 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించడమే రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు. గత ప్రభుత్వ హయంలో నైనీ కోల్ మైన్ స్కామ్‌లో జరిగిన భారీ కుంభకోణాన్ని ప్రధాని నరేంద్ర మోదీ దృష్టికి తీసుకెళ్ళి విచారణ జరిపించాలని కోరినట్లు మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు.

కేటీఆర్ కు మంత్రి కోమటి రెడ్డి కౌంటర్

అమెరికాలో ఐదేళ్ళు ఉద్యోగం చేస్తే 3 ఫైవ్‌స్టార్ హోటళ్ళు,100 ఎకరాల్లో ఫాంహౌస్‌లు ఎలా వస్తాయని కేటీఆర్‌ను ప్రశ్నించారు. ఇప్పటికైనా స్టార్ హోటల్, ఫాం హౌస్ కల్చర్ పక్కన పెట్టి తమ అక్రమ ఆస్తులను అమ్మి ఆ డబ్బు పంచి,ప్రజలకు సేవ చేస్తూ సామాన్యులుగా ప్రజల్లోకి రావాలని హితవు పలికారు.

నల్లగొండ నియోజకవర్గానికి అదనంగా 5000 ఇందిరమ్మ ఇండ్లు

తెలంగాణ కోసం తాను ఆమరణ నిరాహార దీక్ష చేసి,మంత్రి పదవికి రాజీనామా చేస్తే, ఆనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి తనపై వివక్ష చూపారని,నల్లగొండ నియోజకవర్గం అభివృద్ధి చెందితే క్రెడిట్ నాకు వస్తుందని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నా నియోజకవర్గానికి నిధులు కేటాయించకుండా కక్ష సాధించారని విమర్శించారు. నేడు రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అర్హులైన వారికి రేషన్ కార్డులు,సన్నబియ్యం,ఇందిరమ్మ ఇండ్లు కేటాయిస్తూ పేదలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని తెలిపారు. నల్లగొండ నియోజకవర్గానికి అదనంగా 5,000 ఇందిరమ్మ ఇండ్లను కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరానని తెలిపారు. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులు స్వయంగా వచ్చి ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల సంతోషాన్ని చూడాలని సవాల్ విసిరారు.

రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాల్లో ఘన విజయం ఖాయం

రాబోయే రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలతో పాటు,ఖైరతాబాద్ ఉపఎన్నిక వచ్చినా కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. త్వరలోనే స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. బిఆర్ఎస్,బీజేపీ కల్లిబొల్లి మాటలు ఎన్ని చెప్పినా ప్రజలు నమ్మరని, మళ్లీ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు.

బీజేపీ గూటికి సీరియల్ ఆర్టిస్టులు

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 2 : నగరంలోని బీజేపీ కార్యాలయంలో పలువురు సీరియల్ ఆర్టిస్టులు కాషాయం తీర్థం పుచ్చుకున్నారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు.. టీవీ ఆర్టిస్ట్ వేములపల్లి స్వర్ణలత సహా పలువురు సీరియల్ ఆర్టిస్టులను పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మీడియాతో మాట్లాడుతూ.. 'కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు అక్రమ సంపాదనల విషయంలో ఒకదానిపై ఒకటి ఆరోపణలు చేసుకుంటున్నాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు సంపాదించుకోవడం కాదు.. అసలు ప్రజలేం సంపాదించు కున్నారో ఎప్పుడైనా చెప్పారా.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వంద రోజుల్లో బీఆర్ఎస్ అవినీతి చిట్టా బయట పెడతామని హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చి వెయ్యి రోజు లైనా.. ఒక్కరినైనా జైలుకు పంపలేదు. అవినీతికి పాల్పడడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఒకదానితో మరొకటి పోటీ పడుతున్నాయి. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన ప్రీమియం కట్టకుండా రాష్ట్ర ప్రభుత్వం రైతులను మోసం చేస్తోంది. తమ సమస్యను పరిష్కరించాలని గాంధీ భవన్ వద్ద ధర్నా చేస్తున్న టీచర్లను అరెస్ట్ చేసింది. ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉంటే విద్యార్థులు, ఉపాధ్యాయులు, రైతులను పట్టించుకోవాలి. బీఆర్ఎస్, కాంగ్రెస్ తీరుతో ప్రజలు విసిగిపోయారు. రాష్ట్రం లో బీజేపీ ప్రత్యామ్నాయ పార్టీగా అవతరిస్తోంది' అని అన్నారు.

దళిత మహిళపై దాడి

- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు
- సంఘాల డబ్బుల వ్యవహారంపై వివాదం
- బహిరంగంగా దుర్భాషలు, దాడి చేసినట్లు ఫిర్యాదు
- చింతపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు

నల్లగొండ, వెలుతురు అక్టోబర్ 02 : దళిత మహిళపై దాడి ఘటన చింతపల్లి మండలంలో కలకలం రేపుతోంది. సంఘాలకు సంబంధించిన డబ్బుల వ్యవహారంలో తనపై వచ్చిన ఆరోపణలను ప్రశ్నించినందుకు పీకే మల్లేపల్లి గ్రామానికి చెందిన వీవోఏ గనిపల్లి మాధవిపై దుర్భాషలాడుతూ దాడికి పాల్పడినట్లు ఫిర్యాదు అందింది. ఈ ఘటనపై చింతపల్లి పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంతో పాటు భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం పీకే మల్లేపల్లి గ్రామపంచాయతీలో వీవోఏగా విధులు నిర్వహిస్తున్న గనిపల్లి మాధవిపై సంఘాలకు సంబంధించిన డబ్బుల విషయంలో కొందరు వ్యక్తులు ఆరోపణలు చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో గ్రామపంచాయతీ వద్ద తనపై ఆరోపణలు చేసిన వారిని మాధవి ప్రశ్నిస్తుండగా, గ్రామానికి చెందిన కుప్పల అమర్‌నాథ్ అనే వ్యక్తి తన పట్ల అవమానకరంగా ప్రవర్తిస్తూ దుర్భాషలాడి దాడికి పాల్పడినట్లు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న వివరాల ద్వారా తెలుస్తోంది.

ఎఫ్ఐఆర్‌లో పలు సెక్షన్లు నమోదు

బాధితురాలి ఫిర్యాదుపై చింతపల్లి పోలీస్‌స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 172/2026గా కేసు నమోదు చేశారు. భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్లు 74, 115(2), 352తో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ నిరోధక చట్టం, 2015లోని సెక్షన్లు 3(1)(ఆ), 3(1)(ం), 3(2)(ఝ)లను ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. అక్టోబర్ 2, 2026న మధ్యాహ్నం ఘటన జరిగినట్లు, సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు అందినట్లు ఎఫ్ఐఆర్ వివరాలు సూచిస్తున్నాయి.

మహిళల గౌరవానికి భంగం కలిగిస్తే చర్యలు తప్పవా?

గ్రామంలో ఏదైనా ఆర్థిక వ్యవహారంపై ఆరోపణలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి చట్టబద్ధంగా పరిష్కరించుకోవాల్సి ఉంటుంది. అంతేకానీ, బహిరంగంగా దుర్భాషలాడటం, దాడికి పాల్పడినట్లు ఆరోపణలు రావడం ఆందోళన కలిగిస్తోంది. ఈ ఘటనపై పోలీసులు సమగ్ర విచారణ జరిపి, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

రేవంత్ రెడ్డిది అబద్ధాల పాలన

- కక్షసాధింపే ధ్యేయంగా పోలీస్ రాజ్యాన్ని నడుపుతోంది
- 35 నెలలు గడుస్తున్నా ఆరు గ్యారెంటీలు, 420 హామీలెమయ్యాయి?
- కాంగ్రెస్ నిరంకుశ విధానాలపై మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ధ్వజం

కరీంనగర్, వెలుతురు, అక్టోబర్ 02 : రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించి, బీఆర్ఎస్ నాయకులపై కక్ష సాధింపే ధ్యేయంగా పోలీస్ రాజ్యాన్ని నడుపుతోందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని శుభ మంగళి బ్యాంకెట్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవంత్ రెడ్డి సిరిసిల్ల పర్యటనను సిరిసిల్ల ప్రాంత ప్రజలు, బీఆర్ఎస్ కార్యకర్తలపై జరిగిన దాడిగా అభివర్ణించారు. బీఆర్ఎస్ కార్యకర్తలను ఉదయాన్నే అరెస్టు చేయడాన్ని తప్పుపట్టారు. కేవలం కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులపై కక్ష సాధింపు చర్యలు, ఆరోపణలు చేయడానికే సీఎం ప్రాధాన్యత ఇస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 35 నెలలు గడుస్తున్నా ఆరు గ్యారెంటీలు, 420 హామీలను నెరవేర్చలేదని, అభివృద్ధిని పక్కన పెట్టిందని ఆరోపించారు. రైతులకు సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని, యూరియా కొరత ఉందని, వడ్ల కొనుగోళ్లు సక్రమంగా జరగడం లేదని అన్నారు. రైతుబంధు, రుణమాఫీ వంటి పథకాలు సరిగా అమలు కావడం లేదన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో బతుకమ్మ చీరల ఆర్డర్లు, 40 శాతం సబ్సిడీ, నేతన్నకు భరోసా, బీమా పథకాల ద్వారా చేనేత రంగాన్ని ఆదుకున్నారని గుర్తుచేశారు.

చేనేత, గల్ఫ్ కార్మికులను విస్మరించారు

గత ప్రభుత్వంలో సిరిసిల్లను జిల్లాగా మార్చి కలెక్టరేట్, విద్యా సంస్థలు, మౌలిక వసతులతో అభివృద్ధి చేశామని కొప్పుల ఈశ్వర్ అన్నారు. గత కాంగ్రెస్ పాలనలో నేత కార్మికుల ఆత్మహత్యలతో సిరిసిల్ల 'ఉరిసిల్ల'గా మారిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వం బతుకమ్మ చీరలు, రాజీవ్ ఆరోగ్యశ్రీ, విద్యార్థుల యూనిఫాం ఆర్డర్లను సిరిసిల్ల పవర్‌లూమ్ కార్మికులకే ఇచ్చి వేల కోట్ల రూపాయల ఉపాధి కల్పించిందన్నారు. నూలుపై 40 శాతం సబ్సిడీ, 'చేనేత మిత్ర', 'నేతన్నకు చేయూత' వంటి పథకాలతో సిరిసిల్లను అభివృద్ధి పథంలో నిలిపిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలో బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వకుండా, పాత బకాయిలు చెల్లించకుండా నేత కార్మికులను మళ్లీ రోడ్డున పడేసిందని ఆరోపించారు. ఎన్నికల ముందు గల్ఫ్ సంక్షేమ బోర్డు, విదేశాల్లో ఉన్న కార్మికులకు తక్షణ సహాయం, పునరావాసం అంటూ హామీలు ఇచ్చిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చాక బడ్జెట్‌లో రూపాయి కూడా కేటాయించకుండా గల్ఫ్ కార్మికులను మోసం చేసిందని విమర్శించారు. రూ.5 లక్షల ప్రమాద బీమా ప్రకటనలకే పరిమితమైందన్నారు. అభివృద్ధి, సంక్షేమం గురించి మాట్లాడటానికి ఏమీ లేక రేవంత్ రెడ్డి వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని మండిపడ్డారు. కేటీఆర్ ఉన్నత చదువులు చదివి అమెరికాలో ప్రతిష్టాత్మక కంపెనీల్లో ఉద్యోగం చేసి స్వశక్తితో ఎదిగారని, దానిని అవమానించడం కాంగ్రెస్ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. 'ఓటుకు నోటు' కేసులో రూ.50 లక్షలతో కెమెరా ముందర దొరికిపోయిన చరిత్ర ఉన్న రేవంత్ రెడ్డికి నిజాయితీ గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. అసెంబ్లీలో ప్రతిపాదించిన 8 వేల ఎకరాల ఆక్రమణల భూములపై శ్వేతపత్రం గానీ, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు గానీ విడుదల చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. హైడ్రా, ప్రాజెక్టుల రీ-డిజైన్ల పేరుతో ఎంత దోచుకున్నారో, ఢిల్లీకి ఎన్ని వేల కోట్లు పంపారో ముందుగా శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

దళిత, సిరిసిల్ల అభివృద్ధిపై ప్రశ్నలు

దేశంలోనే ఎక్కడా లేని విధంగా దళితుల ఆత్మగౌరవాన్ని పెంచేందుకు కేసీఆర్ 'దళితబంధు' తెచ్చి ప్రతి దళిత కుటుంబానికి రూ.10 లక్షలు అందించారని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పథకాన్ని నిలిపివేసి దళితులకు ద్రోహం చేసిందన్నారు. కాంగ్రెస్ ఇస్తామన్న రూ.12 లక్షల 'అంబేద్కర్ అభయ హస్తం' ఏమైందో దళిత మంత్రులు, ఎమ్మెల్యేలు రేవంత్ రెడ్డిని నిలదీయాలని కోరారు. ఇందిరా గాంధీ పేరు మీద ఇప్పటికీ పథకాలను ప్రచారం చేసుకుంటున్నారని, ఎస్సీ వర్గాలకు ఇందిరమ్మ రాజ్యంలో ఏం జరుగుతోందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వేములవాడ రాజన్న ఆలయాభివృద్ధికి వీటీడీఏ ఏర్పాటు చేసి వందల కోట్లు కేటాయించడంతో పాటు, దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న మిడ్ మానేరు ప్రాజెక్టును పూర్తి చేసి ఆర్అండ్ఆర్ కాలనీల ద్వారా నిర్వాసితులకు న్యాయం చేసింది కేసీఆర్ ప్రభుత్వమేనన్నారు. కాంగ్రెస్ ఈ రెండున్నరేళ్లలో సిరిసిల్లకు, తెలంగాణకు తెచ్చిన ఒక్క ప్రాజెక్టు లేదా పరిశ్రమ ఉందా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభ ముగిసిన రెండు రోజులకే రాజన్న సిరిసిల్ల జిల్లాలో 1861 నాటి బ్రిటిష్ కాలపు పోలీస్ యాక్ట్ సెక్షన్ 30 అమలులోకి తేవడం నిరంకుశత్వానికి, ప్రజలపై పగ సాధింపు చర్యకు నిదర్శనమని విమర్శించారు. సిరిసిల్ల ప్రజలు కేటీఆర్‌ను వరుసగా ఆరు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నుకుంటే ఆయనను 'వలసవాది' అనడం ప్రజల ప్రజాస్వామ్య తీర్పును అవమానించడమేనన్నారు. అబద్ధాలు చెప్పటంలో రేవంత్ రెడ్డిని మించిన సీఎం లేరని, ప్రజలే ఆయనకు 'అబద్ధాల ముఖ్యమంత్రి' అని పేరు పెట్టారని కొప్పుల ఈశ్వర్ వ్యాఖ్యానించారు. ఇచ్చిన హామీలు నెరవేర్చలేక కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులపై వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని అన్నారు. తెలంగాణ ఉద్యమమే లేకుంటే రేవంత్ రెడ్డి అడ్రస్ ఎక్కడ ఉండేదని ప్రశ్నిస్తూ, ఇప్పటికైనా ప్రజావ్యతిరేక విధానాలు మానుకుని హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే, జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు విద్యాసాగర్ రావు, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్ రావు, మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్, మాజీ జెడ్పీటీసీ తన్నీరు శరత్ రావు, జగిత్యాల జిల్లా మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్ రావు, 45వ డివిజన్ కార్పొరేటర్ గుగ్గిళ్ల జయశ్రీ శ్రీనివాస్, అలుగునూరు కార్పొరేటర్ మల్లేశం, మాజీ కార్పొరేటర్ ఉమాపతి, నేతి రవివర్మ, కర్ర సూర్యశేఖర్, నంది మేడారం పీఏసీఎస్ చైర్మన్ ముత్యాల బలరాం రెడ్డి, వెల్గటూర్ మండల మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఏలేటి కృష్ణారెడ్డి రెడ్డి, ఇరుగురాల ఆనందం, రాజు అంజనేయులు, కనకయ్య పాల్గొన్నారు.

భారతరత్న లాల్ బహాదూర్ శాస్త్రికి ఘన నివాళులు

- లాల్ బహాదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా విజయ్ ఘాట్‌లో ఘన నివాళులు
- పి. ప్రసన్నకుమార్ శర్మ ప్రధాన కార్యదర్శి తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ, పీసీసీ అధ్యక్షుల కార్యాలయానికి అనుబంధం

ఢిల్లీ, వెలుతురు అక్టోబర్ 2, 2026: "జై జవాన్ -- జై కిసాన్" అనే మహోన్నత నినాదంతో దేశ ప్రజల్లో దేశభక్తి, సైనికుల పట్ల గౌరవం, రైతుల పట్ల బాధ్యతా భావాన్ని మరింత బలపరిచిన మాజీ ప్రధానమంత్రి, భారతరత్న లాల్ బహాదూర్ శాస్త్రి గారి జయంతి సందర్భంగా ఢిల్లీలోని విజయ్ ఘాట్‌లో ఆయన సమాధిని సందర్శించి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. ప్రతిపక్ష నేత, ప్రజానాయకుడు రాహుల్ గాంధీ గారు మరియు అనిల్ శాస్త్రి గారితో కలిసి లాల్ బహాదూర్ శాస్త్రి గారికి పుష్పాంజలి ఘటించి, దేశానికి ఆయన అందించిన అమూల్యమైన సేవలను స్మరించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పి. ప్రసన్నకుమార్ శర్మ మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యానంతర కాలంలో అత్యంత సరళమైన, నిజాయితీగల, నిబద్ధత కలిగిన నాయకుల్లో లాల్ బహాదూర్ శాస్త్రి ఒకరని పేర్కొన్నారు. లాల్ బహాదూర్ శాస్త్రి గారు సాధారణ కుటుంబం నుంచి ఎదిగి, దేశ ప్రధానమంత్రి స్థాయికి చేరుకున్నప్పటికీ తన జీవితాంతం నిరాడంబరత, క్రమశిక్షణ, నిజాయితీ, దేశసేవకు ప్రతీకగా నిలిచారని అన్నారు. అధికారాన్ని వ్యక్తిగత ప్రయోజనాలకు కాకుండా ప్రజాసేవకు వినియోగించిన ఆయన జీవితం నేటి తరానికి కూడా ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.

"జై జవాన్ -- జై కిసాన్" దేశానికి దిశానిర్దేశం చేసిన నినాదం

దేశం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న సమయంలో లాల్ బహాదూర్ శాస్త్రి గారు ఇచ్చిన "జై జవాన్ -- జై కిసాన్" నినాదం భారతదేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని ప్రసన్నకుమార్ శర్మ అన్నారు. దేశ సరిహద్దులను కాపాడుతున్న సైనికుడు, దేశ ప్రజలకు అన్నం అందిస్తున్న రైతు -- ఇద్దరూ దేశ నిర్మాణంలో సమానంగా కీలక పాత్ర పోషిస్తున్నారని ఆ నినాదం ద్వారా శాస్త్రి గారు దేశానికి స్పష్టమైన సందేశాన్ని ఇచ్చారని తెలిపారు. రైతుల ఉత్పత్తిని పెంచడం, దేశ ఆహార భద్రతను బలోపేతం చేయడం, వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇవ్వడం వంటి అంశాలకు ఆయన ప్రధానమంత్రి పదవీకాలంలో ప్రత్యేక ప్రాధాన్యత లభించిందని అన్నారు. భారతదేశం ఆహార దిగుమతులపై ఆధారపడే పరిస్థితి నుంచి స్వయం సమృద్ధి దిశగా పయనించడానికి ఆయన కాలంలో ప్రారంభమైన విధానాలు, ప్రయత్నాలు ముఖ్యమైన పునాదిగా నిలిచాయని పేర్కొన్నారు.

దేశ రక్షణకు, సైనికుల ఆత్మవిశ్వాసానికి ప్రాధాన్యత 1965లో భారత్--పాకిస్తాన్ యుద్ధ సమయంలో లాల్ బహాదూర్ శాస్త్రి గారు దేశ సైనికులకు ధైర్యాన్ని అందిస్తూ, జాతీయ ఐక్యతను బలోపేతం చేశారని ప్రసన్నకుమార్ శర్మ అన్నారు. దేశ సార్వభౌమత్వం, భద్రత విషయంలో ఎటువంటి రాజీ లేకుండా సైనికుల వెంటే దేశ ప్రజలంతా నిలవాలని ఆయన ఇచ్చిన పిలుపు దేశంలో స్ఫూర్తిని నింపిందని తెలిపారు. అదే సమయంలో దేశ ఆర్థిక పరిస్థితులు, ఆహార కొరత వంటి సమస్యలను ఎదుర్కొంటూ ప్రజలను కూడా బాధ్యతగా వ్యవహరించాలని శాస్త్రి గారు కోరారని గుర్తుచేశారు. దేశం కోసం వ్యక్తిగత త్యాగానికి సిద్ధంగా ఉండాలనే భావనను ఆయన ప్రజల్లో బలంగా నాటారని అన్నారు.

నిరాడంబరత - నిజాయితీ ప్రజాసేవకు ప్రతీక

లాల్ బహాదూర్ శాస్త్రి గారి వ్యక్తిత్వంలో అత్యంత విశిష్టమైన అంశం ఆయన నిరాడంబర జీవన విధానమని ప్రసన్నకుమార్ శర్మ పేర్కొన్నారు. ప్రధానమంత్రి వంటి అత్యున్నత పదవిలో ఉన్నప్పటికీ సాధారణ జీవనశైలిని కొనసాగిస్తూ, ప్రజా జీవితంలో నైతిక విలువలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని అన్నారు. తన కుటుంబ సభ్యుల కంటే దేశ ప్రయోజనాలను ముందుగా ఉంచిన నాయకుడిగా శాస్త్రి గారి జీవితం ప్రజాసేవలో ఉన్న ప్రతి ఒక్కరికీ ఆదర్శమని తెలిపారు. రైల్వే మంత్రిగా పనిచేసిన సమయంలో జరిగిన రైలు ప్రమాదానికి నైతిక బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా చేసిన సంఘటన ఆయన రాజకీయ జీవితంలో ఉన్న బాధ్యతాయుతమైన నాయకత్వానికి ఒక గొప్ప ఉదాహరణగా నిలిచిందని పేర్కొన్నారు.

శాస్త్రి గారి స్ఫూర్తి నేటి తరానికి అవసరం

నేటి భారతదేశంలో ప్రజా జీవితంలో ఉన్న నాయకులు శ్రీ లాల్ బహాదూర్ శాస్త్రి గారి సరళత, నిజాయితీ, బాధ్యత, దేశభక్తి, ప్రజల పట్ల అంకితభావం వంటి విలువలను స్ఫూర్తిగా తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రసన్నకుమార్ శర్మ అన్నారు. రైతు సంక్షేమం, సైనికుల గౌరవం, పేదల అభ్యున్నతి, సామాజిక న్యాయం, జాతీయ సమైక్యత వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారానే శాస్త్రి గారి ఆశయాలకు నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని అన్నారు. లాల్ బహాదూర్ శాస్త్రి గారి జీవితం దేశం కోసం పనిచేసే ప్రతి పౌరుడికి ఒక మార్గదర్శకమని, ఆయన అందించిన "జై జవాన్ -- జై కిసాన్" సందేశం భారతదేశ అభివృద్ధి ప్రయాణంలో ఎప్పటికీ స్ఫూర్తినిస్తూనే ఉంటుందని ప్రసన్నకుమార్ శర్మ పేర్కొన్నారు. ఈ సందర్భంగా లాల్ బహాదూర్ శాస్త్రి గారి దేశసేవను స్మరించుకుంటూ, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

పీఆర్సీ ప్రకటించండి..

అదే నిజమైన దసరా కానుక

- ఉద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి
- ఉద్యోగుల హామీలపై ప్రభుత్వాన్ని నిలదీసిన శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, అక్టోబర్ 2, వెలుతురు : ఉద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను మూడేళ్లు గడిచినా నెరవేర్చడం లేదని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగ సంఘాలు అల్టిమేటం ఇవ్వడంతో రెండు డీఏలు ఇస్తామని ప్రకటించారని, ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను ఇవ్వడం దసరా కానుక ఎలా అవుతుందని ప్రశ్నించారు. పీఆర్సీ గడువును ఇంకా ఎన్నిసార్లు పొడిగిస్తారని నిలదీశారు. ఉద్యోగులు దాచుకున్న సొమ్మును తిరిగి ఇవ్వడం ప్రభుత్వానికి భారం ఎలా అవుతుందని ప్రశ్నించారు. ఉద్యోగుల హెల్త్‌కార్డులు సక్రమంగా అమలు కావడం లేదని, వెల్‌నెస్ సెంటర్లలో పట్టించుకునే వారు లేరన్నారు. పోలీసులకు గతంలో ఉన్న ఆరోగ్య భద్రతను తొలగించారని ఆరోపించారు. పని చేయించుకోవడంతో పాటు పోలీసులు, వారి కుటుంబాల భద్రతపై డీజీపీ దృష్టి పెట్టాలన్నారు. క్రమశిక్షణ పేరుతో ఉద్యోగాల నుంచి తొలగిస్తామంటే ఊరుకునేది లేదన్నారు. ఒప్పంద ఉద్యోగులకు కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామన్న హామీపై కేబినెట్‌లో కనీసం చర్చ కూడా జరగలేదన్నారు. కాంట్రాక్టు ఉద్యోగుల ఏజెన్సీల నుంచి రూ.1,100 కోట్లు తీసుకున్నట్లు కమిటీ నిర్ధారిస్తే కేసులు, రికవరీ ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. ఫార్ములా-ఈ కోసం రూ.45 కోట్లు చెల్లించారంటూ కేటీఆర్‌పై కేసు పెట్టారని, రూ.1,100 కోట్ల వ్యవహారంలో చర్యలు ఎందుకు లేవని ప్రశ్నించారు. ఏ మంత్రి తిన్నారు, ఎవరు అడ్డుకున్నారో బయటపెట్టాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానం అమలుపై ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నిస్తూ.. పీఆర్సీ ప్రకటించడమే ఉద్యోగులకు నిజమైన దసరా కానుక అన్నారు. జర్నలిస్టుల హెల్త్‌కార్డులపై ప్రభుత్వం దృష్టి సారించడం లేదని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కేసీఆర్ హయాంలో జర్నలిస్టులకు హెల్త్‌కార్డులతో పాటు పలు సౌకర్యాలు కల్పించామని, తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టుల పాత్ర మరువలేనిదన్నారు. జర్నలిస్టులకు వెంటనే హెల్త్‌కార్డులు అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సుమిత్రానంద్, క్యాదాస్ కళ్యాణ్‌కుమార్ పాల్గొన్నారు.

కాలుష్యానికి కారణమెవరు!?

ఢిల్లీ పేరు చెప్పగానే నేటి కాలంలో టక్కున గుర్తుకు వచ్చేది కాలుష్యం. కొన్ని ఏళ్లుగా ఢిల్లీని శాసిస్తున్నది ఈ కాలుష్య మహమ్మారి. రాత్రి పగలు అనే తేడా లేకుండా ఎప్పుడు చుసిన కాలుచయం విరజిమ్మతూనే ఉంది. మరి ఈ కాలుష్యం ఇంతలా పెరిగిపోవడానికి కారణమెవరు?. ఎందుకు ఇంతలా రోజురోజుకి పెరుగుతుంది? అంటే దీనికి ఎక్కడా సమాధానం లేకుండా పోయింది. చేతులుకాలాక ఆకులు పట్టుకున్నట్లు.. ఇప్పుడు చర్యలు చేపడితే ఎం లాభం? నిజంగా దీనికి నిజమైన సమాధానం చెప్పలేక అధికారులు చేతులెత్తేస్తున్నారు. ప్రతి ఏటా ఢిల్లీ ప్రభుత్వం కాలుష్యాన్ని నియంత్రించే చర్యలు కొన్ని ప్రకటిస్తుంది. శీతాకాలంలో పాలకులకు ఇది ఒక క్రమం తప్పలేని ఎజెండా. సోమవారం కూడా మళ్ళీ అదే జరిగింది. పలురకాల నిర్మాణాలమీద నిషేధం విధించారు, కార్యాలయ వేళల్లో మార్పుచేర్పులు ప్రకటించారు, ఆఫీసులకు వచ్చిపనిచేసే సిబ్బందిలో సగంమందిని ఇంటినుంచి పనిచేయాలంటున్నారు, నగరం బయట రిజిస్టరయిన వాహనాల నగర ప్రవేశాన్ని అడ్డుకుంటున్నారు, పార్కింగ్ చార్జీలు కూడా పెంచారు.

ఈ జాబితాలో ఏవి ఎప్పటినుంచి అమల్లోకి రాబోతున్నాయన్నది అటుంచితే, శీతాకాలం ప్రవేశం వరకూ ఇష్టారాజ్యంగా సాగినవన్నీ, ఇప్పుడు అత్యంత ప్రమాదకరమైనవిగా తోచడం, పరిణమించడం విశేషం. ఇప్పటిచలి తాత్కాలికమేనని, అల్పపీడన ప్రభావం తగ్గితే పరిస్థితిలో కాస్తంత మార్పు రావచ్చని అంటున్నప్పటికీ, కాస్తంత అటూఇటూగా ఈ సంక్షోభం ఏటా ఎదుర్కోక తప్పనిదే. నిర్మాణాలు, కూల్చివేతలమీద పూర్తిస్థాయి నిషేధాన్ని అటుంచితే, ఇప్పటికే అమలులో ఉన్న 'నో ఫ్యూయల్--నో పీయూసీ' విధానాన్ని మరింత కఠినంగా అమలు చేస్తారట. ఆటోమేటిక్ నంబర్‌ప్లేట్ రికగ్నేషన్ కెమెరాలు ఉన్న ఐదువందల పెట్రోల్ బంకుల్లో పాతవాహనాలమీద విరుచుకుపడతారట. రెండున్నర లక్షలవాహనాలకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయబోతున్నట్టు, ఉన్న ఐదువేల ఎలక్ట్రిక్ బస్సులకు మరో నూటయాభై బస్సులను చేర్చి ప్రజారవాణాను మెరుగుపరచనున్నట్టు ప్రభుత్వం చెబుతోంది. పార్కింగ్ ఫీజులను భారీగా పెంచితే, ప్రజలు విధిగా ప్రజారవాణావైపు పరుగులు తీస్తారని అది బలంగా నమ్ముతున్నట్టు కనిపిస్తోంది. ప్రజలు నిజంగానే పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు మీదే ఆధారపడితే, ఢిల్లీలో ఉన్న ఆ వ్యవస్థ ఏమాత్రం సరిపోదు. పద్నాలుగువేల బస్సులు అవసరమైన చోట సగం మాత్రమే ఉన్నాయి, నగరంలోని మొత్తం ప్రయాణికుల్లో ఐదుశాతం జనాభాను మాత్రమే మెట్రో తీసుకుపోతోంది. ఇక, వెచ్చదనంకోసం ప్రజలు చెత్తనీ, బొగ్గుకట్టెలూ కాల్చకుండా నిరోధించడానికి తాత్కాలికంగా విద్యుత్ హీటింగ్ స్పాట్‌లు ఏర్పాటు చేస్తే ప్రజలంతా అక్కడికే వెళ్ళి చలికాచుకుంటారని కూడా ప్రభుత్వం నమ్మకం. కాలుష్యకాలం కమ్ముకొచ్చినప్పుడు, బాణాసంచా వినియోగం కూడా ఒక పెద్దసమస్యగా, వివాదంగా మారడం ఏటా ఉన్నదే. టపాసుల వాడకంమీద ఆంక్షలు విధించాలంటూ దాఖలైన పిటిషన్‌మీద సుప్రీంకోర్టు బుధవారం తన అభిప్రాయాన్ని ప్రకటిస్తూ, పూర్తి నిషేధానికి తాను అనుకూలం కాదని, అలాగని, రోజంతా కాల్చడానికి ఒప్పుకోనని వ్యాఖ్యానించింది. కొన్నిరకాల టపాసుల తయారీకి కూడా ఇకపై వీలు కలగబోతోంది. దీపావళినాడు బాణాసంచా కాల్చే విషయంలో సుప్రీంకోర్టు వైఖరిలో ఇటీవల పెనుమార్పు వచ్చిన విషయం తెలిసిందే. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఏలుబడిలో ఉన్నంతకాలం ఢిల్లీలో టపాసులమీద నిషేధం అమలైంది. మొదట్లో బేరియం లవణాలు లేని టపాసుల తయారీకి అనుమతించినప్పటికీ, ఆ మినహాయింపు కూడా దుర్వినియోగం కావడంతో పూర్తి నిషేధం అమలైంది. పాలకుల, న్యాయస్థానాల చొరవవల్ల, పెరిగిన కాలుష్యభయం వల్ల ఢిల్లీ వాసుల్లో కూడా టపాసులమీద మోజు తగ్గింది. విపక్షంలో ఉండగా, ఈ నిషేధాన్ని తప్పుబడుతూ వచ్చిన బీజేపీ ఢిల్లీలో తాను అధికారంలోకి రాగానే టపాసులపై సర్వోన్నత న్యాయస్థానంతోనే సరే కానివ్వండని అనిపించుకుంది. పొరుగురాష్ట్రాల్లో పంటవ్యర్థాలను తగలబెట్టడం కూడా ఢిల్లీ కాలుష్యానికి ఒక బలమైన కారణం కనుక, పరిస్థితిలో మార్పు వస్తున్నా ఈ మారు కూడా ఆ ప్రభావాన్ని కాదనలేం. ఇప్పుడు ఢిల్లీ ప్రభుత్వం ప్రకటించిన ప్రణాళికలో అనేకం గతకాలంలోనూ అమలు జరిగినవే. గద్దెమీద ఎవరున్నా ఈ తక్షణ ఉపశమన చర్యలనే మహాద్భుతమైనవిగా అభివర్ణించుకోవడం సహజం. గ్యాస్ చాంబర్‌లాగా తయారైన ఢిల్లీలో వాయురూపంలో ఉన్న విషాన్ని దిగమింగుతున్న సామాన్యులకు ఏటా వచ్చే ఈ ఆపదనుంచి విముక్తి ఎప్పుడో తెలియడం లేదు. అంటే ఈ ప్రశ్నకు సమాధానం దొరకని పరిస్థితి. ఇప్పటికైనా ఓ ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటూ కొన్ని కటినమైన నిర్ణయాలు అమలు చేస్తూ ఢిల్లీలో పేరుకుపోయిన కాలుష్య మహమ్మారిని పారద్రోలవచ్చు.

సంపాదకీయం

సామాజిక న్యాయం స్పీచ్‌లో..

సీఎం కుర్చీ మాత్రం అగ్రవర్ణాల జేబులో!

తెలంగాణ రాజకీయాల్లో మరోసారి "సామాజిక న్యాయం" అనే మాట మారుమోగుతోంది. ఎన్నికలు సమీపించిన ప్రతిసారీ రాజకీయ పార్టీల నోట సామాజిక న్యాయం, బహుజన రాజ్యం, పేదల అభివృద్ధి, అణగారిన వర్గాలకు అధికారం వంటి మాటలు వినిపించడం కొత్తేమీ కాదు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ మాటలకు, చేతల్లో కనిపించే ఆచరణకు మధ్య ఉండే అంతరం మాత్రం తెలంగాణ ప్రజలకు కొత్తగా అనిపించడం లేదు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు దశాబ్దాలుగా ఒకే ప్రశ్నను అడుగుతున్నాయి---"మాకు ఓట్లు కావాలి, కానీ అధికారం మాత్రం మీకే కావాలా? ఇదేనా సామాజిక న్యాయం?" అని. సామాజిక న్యాయం అంటే కొన్ని మంత్రి పదవులు ఇవ్వడం కాదు. ఒకటి రెండు కీలక పదవులు కేటాయించి, ఫొటోలు దిగించి, తమ ప్రభుత్వం సామాజిక న్యాయానికి కట్టుబడి ఉందని ప్రచారం చేసుకోవడం అంతకన్నా కాదు. నిజమైన సామాజిక న్యాయం అంటే సమాజంలో సంఖ్యాపరంగా, శ్రమపరంగా, ఆర్థికంగా, చారిత్రకంగా వెనుకబడిన వర్గాలకు పాలనా అధికారంలో సముచిత భాగస్వామ్యం కల్పించడం. ముఖ్యంగా నిర్ణయాలు తీసుకునే అత్యున్నత స్థాయిలో వారికి అవకాశం కల్పించడం. ముఖ్యమంత్రి పదవి వరకు సామాజిక ప్రాతినిధ్యం విస్తరించకుండా, కేవలం మంత్రి పదవులు, నామినేటెడ్ పదవులు, కార్పొరేషన్ చైర్మన్ పదవులతో సామాజిక న్యాయం పూర్తయిందని చెప్పడం ప్రజలను మభ్యపెట్టడమే. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పుడు సామాజిక న్యాయం గురించి ఎన్నో హామీలు వినిపించాయి. బలహీన వర్గాలకు అండగా ఉంటామని, అణగారిన వర్గాలకు రాజకీయ ప్రాధాన్యం పెంచుతామని చెప్పింది. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీల అమలు ఏ స్థాయిలో ఉందనే ప్రశ్న ఇప్పుడు ప్రజల్లో చర్చకు వస్తోంది. ముఖ్యంగా బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలు తమ రాజకీయ భవిష్యత్తు గురించి ఆలోచించడం ప్రారంభించారు. అధికారంలోకి రావడానికి ముందు చెప్పిన మాటలు, అధికారంలోకి వచ్చిన తర్వాత తీసుకున్న నిర్ణయాలు ఒకే తాటిపై ఉన్నాయా అనే ప్రశ్నకు ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇది ఒక్క కాంగ్రెస్ పార్టీకి మాత్రమే సంబంధించిన ప్రశ్న కాదు. తెలంగాణలో సామాజిక న్యాయం పేరుతో రాజకీయ రంగంలోకి వస్తున్న ప్రతి పార్టీకి ఇదే ప్రశ్న వర్తిస్తుంది. కాంగ్రెస్ కావచ్చు, బీజేపీ కావచ్చు, బీఆర్ఎస్ కావచ్చు, కమ్యూనిస్టు పార్టీలు కావచ్చు, కొత్తగా పుట్టుకొస్తున్న రాజకీయ శక్తులు కావచ్చు---సామాజిక న్యాయం గురించి మాట్లాడే ప్రతి పార్టీ తమ రాజకీయ నిర్మాణంలోనే దానికి సమాధానం చూపించాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే ప్రజలు ఇప్పుడు ప్రసంగాలను మాత్రమే వినే స్థితిలో లేరు. ఎవరు ఏ వర్గానికి చెందిన వారు? పార్టీ నాయకత్వంలో ఎవరికి ఎంత ప్రాధాన్యం ఉంది? నిర్ణయాధికారం ఎవరి చేతుల్లో ఉంది? ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఎవరిని ముందుకు తెస్తున్నారు? పార్టీ రాష్ట్ర నాయకత్వం, జిల్లా నాయకత్వం, శాసనసభ, పార్లమెంట్, స్థానిక సంస్థల్లో సామాజిక ప్రాతినిధ్యం ఎలా ఉంది? అనే ప్రశ్నలను ప్రజలు పరిశీలిస్తున్నారు. సామాజిక న్యాయం పేరుతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు మంత్రి పదవులు ఇస్తామని చెప్పడం సులభం. కానీ "ఈ వర్గాలకు చెందిన వ్యక్తి ముఖ్యమంత్రి కూడా కావచ్చు" అని చెప్పే ధైర్యం ఎన్ని పార్టీలకు ఉంది? ఈ ప్రశ్న ఇప్పుడు తెలంగాణలో బలంగా వినిపిస్తోంది. "మీరు ముఖ్యమంత్రి అయితే మేమేమిటి? మీ ప్రభుత్వంలో మేము కేవలం మంత్రులుగా, అనుచరులుగా, ఓటర్లుగా ఉండాలా? మా జనాభా ఓట్ల కోసం మాత్రమేనా? మాకు పాలనా అధికారం ఎందుకు ఉండకూడదు?" అని యువత, బహుజన వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. ఈ ప్రశ్నను ఎవరూ తేలికగా తీసుకోలేరు. ఒక రాజకీయ పార్టీ తనను తాను సామాజిక న్యాయానికి ప్రతినిధిగా ప్రకటించుకుంటూ, అదే సమయంలో ముఖ్యమంత్రి పదవిని మాత్రం ఒక నిర్దిష్ట సామాజిక వర్గానికే పరిమితం చేస్తే, ఆ పార్టీ చెప్పే సామాజిక న్యాయం ఎంతవరకు నిజమైనదో ప్రజలు ప్రశ్నించడం సహజం. ప్రజాస్వామ్యంలో ముఖ్యమంత్రి పదవి ఏ ఒక్క కులానికో, వర్గానికో పుట్టుకతో వచ్చిన హక్కు కాదు. ప్రజల ఓట్లతో ఏర్పడే ప్రభుత్వానికి నాయకత్వం వహించే అవకాశం అన్ని సామాజిక వర్గాలకు ఉండాలి. తెలంగాణ సమాజం మారుతోంది. ఒకప్పుడు నాయకులు చెప్పిన మాటలను ప్రశ్నించకుండా నమ్మే పరిస్థితి ఇప్పుడు లేదు. సామాజిక మాధ్యమాలు, ప్రత్యామ్నాయ మీడియా, ప్రజా సంఘాలు, విద్యావంతులు, రచయితలు, యువత రాజకీయ పార్టీల విధానాలను విశ్లేషిస్తున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చే హామీలను మాత్రమే కాకుండా, గతంలో అధికారంలో ఉన్నప్పుడు ఏమి చేశారు, ఎవరికి అవకాశాలు కల్పించారు, ఎవరి ప్రయోజనాలను కాపాడారు, ఎవరి సమస్యలను నిర్లక్ష్యం చేశారు అనే విషయాలను కూడా ప్రజలు గుర్తుంచుకుంటున్నారు. అందుకే "సామాజిక న్యాయం" అనే పదాన్ని రాజకీయ నినాదంగా మాత్రమే ఉపయోగించడం ఇకపై పనిచేయకపోవచ్చు. సామాజిక న్యాయం అంటే సామాజిక వర్గాల మధ్య అధికార భాగస్వామ్యం. అది కేవలం పదవుల పంపకం కాదు, నిర్ణయాధికారంలో భాగస్వామ్యం. అది కేవలం ఎన్నికల్లో సీట్లు ఇవ్వడం కాదు, విధాన రూపకల్పనలో భాగస్వామ్యం. అది కేవలం సభల్లో ప్రసంగాలు చేయించడం కాదు, రాష్ట్ర పాలనకు నాయకత్వం వహించే అవకాశం కల్పించడం. తెలంగాణ ఏర్పాటులో సామాజిక వర్గాల పాత్రను ఎవరూ మరిచిపోలేరు. రాష్ట్ర ఉద్యమంలో బహుజనులు, ఉద్యోగులు, విద్యార్థులు, రైతులు, కార్మికులు, మహిళలు, దళితులు, గిరిజనులు, మైనార్టీలు తమ వంతు పాత్ర పోషించారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా తమకు రాజకీయ అధికారంలో సముచిత వాటా వస్తుందని వారు ఆశించారు. కానీ ఆ ఆశలు పూర్తిగా నెరవేరాయా అన్నది నేటి రాజకీయ నాయకత్వం ఆలోచించాల్సిన ప్రశ్న. ఓటు అడిగేటప్పుడు "మీరు మా కుటుంబ సభ్యులు" అని చెప్పి, అధికారం వచ్చిన తర్వాత అదే ప్రజలను కేవలం ఓటు బ్యాంకుగా చూడటం ప్రజాస్వామ్యానికి అవమానం. బీసీ యువకుడికి, ఎస్సీ విద్యార్థికి, గిరిజన యువతికి, మైనార్టీ యువకుడికి రాజకీయ నాయకత్వంపై ఆశ కలిగించే వ్యవస్థ లేకపోతే సామాజిక న్యాయం ఎలా సాధ్యమవుతుంది? గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు నాయకత్వాన్ని పెంచే రాజకీయ సంస్కృతి లేకుండా కేవలం ఎన్నికల సమయంలో సామాజిక న్యాయం అనే పదాన్ని పలకడం వల్ల ప్రయోజనం ఏమిటి?

ఇక్కడ మరో కీలకమైన అంశం ఉంది. అగ్ర వర్ణాల వ్యక్తులు రాజకీయాల్లో ఉండకూడదని ఎవరూ చెప్పడం లేదు. ప్రజాస్వామ్యంలో ప్రతి వర్గానికీ రాజకీయ హక్కు ఉంది. కానీ ఒక వర్గానికి చెందిన నాయకత్వం శాశ్వతంగా ముఖ్యమంత్రి పదవిని తమకే పరిమితం చేసుకోవాలనే భావన ఉంటే, దానినే ప్రశ్నించాలి. సామాజిక న్యాయం అంటే ఒక వర్గాన్ని తొలగించడం కాదు, అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించడం. ముఖ్యంగా చారిత్రకంగా అధికారం నుంచి దూరంగా ఉంచబడిన వర్గాలకు నాయకత్వ అవకాశాలను విస్తరించడం. తెలంగాణ ప్రజలు ఇప్పుడు ఇదే విషయాన్ని రాజకీయ పార్టీల ముందు పెడుతున్నారు. "మీ పార్టీకి ఓటు వేస్తే మా జీవితాల్లో ఏమి మారుతుంది? మా పిల్లలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయ అవకాశాలు వస్తాయా? మా వర్గానికి కేవలం మంత్రి పదవి వస్తుందా? లేక ముఖ్యమంత్రి స్థాయిలో కూడా నాయకత్వం వహించే అవకాశం ఉంటుందా?" అనే ప్రశ్నలకు రాజకీయ పార్టీలు స్పష్టమైన సమాధానం ఇవ్వాల్సిన సమయం వచ్చింది. సామాజిక న్యాయం పేరుతో కల్లిబొల్లి కబుర్లు చెప్పి అధికారంలోకి రావచ్చు. ఎన్నికల్లో కొన్ని హామీలతో ప్రజలను ఆకట్టుకోవచ్చు. కానీ ప్రజల రాజకీయ చైతన్యాన్ని శాశ్వతంగా మోసం చేయడం సాధ్యం కాదు. ఒకసారి ప్రజలు తమ ఓటు విలువను, తమ సంఖ్యాబలాన్ని, తమ రాజకీయ శక్తిని గుర్తిస్తే రాజకీయ సమీకరణాలు మారక తప్పదు. కాంగ్రెస్ పార్టీ గతంలో చెప్పిన సామాజిక న్యాయం హామీలను తెలంగాణ ప్రజలు ఇప్పుడు ఆచరణలో కొలుస్తున్నారు. అదే విధంగా బీజేపీ, బీఆర్ఎస్, కమ్యూనిస్టులు, కొత్త రాజకీయ పార్టీలు కూడా తమ సామాజిక న్యాయ నినాదాలకు కార్యాచరణతో సమాధానం చెప్పాలి. "మేమే ముఖ్యమంత్రి అవుతాం, మీకు మాత్రం మంత్రి పదవులు ఇస్తాం" అనే రాజకీయ ధోరణి కొనసాగితే దానిని ప్రజలు ప్రశ్నించకుండా ఉండరు. ఎందుకంటే తెలంగాణ ప్రజాస్వామ్యం ఇప్పుడు కొత్త దశలోకి అడుగుపెడుతోంది. ఓటు వేసే ప్రజలు కేవలం అభ్యర్థిని మాత్రమే చూడడం లేదు; అధికార నిర్మాణాన్ని కూడా చూస్తున్నారు. ఎవరు పాలిస్తారు? ఎవరి చేతుల్లో నిర్ణయాధికారం ఉంటుంది? ఎవరి పిల్లలకు అవకాశాలు వస్తాయి? ఎవరి వర్గం రాజకీయంగా ఎదుగుతుంది? అనే ప్రశ్నలు ఎన్నికల చర్చల్లోకి వస్తున్నాయి. అందుకే తెలంగాణ రాజకీయ పార్టీలకు ఒక స్పష్టమైన సందేశం, సామాజిక న్యాయం అనే పదాన్ని ఇక నినాదంగా ఉపయోగించకండి. దాన్ని రాజకీయ ఆచరణగా చూపించండి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు కేవలం ఓట్లు అడగడం కాదు---నాయకత్వం ఇవ్వండి. మంత్రి పదవులు మాత్రమే కాదు---అత్యున్నత నిర్ణయాధికారంలో భాగస్వామ్యం కల్పించండి. ముఖ్యమంత్రి పదవి ఏ సామాజిక వర్గానికి శాశ్వత రిజర్వేషన్ కాదని ప్రజాస్వామ్య విలువలను గౌరవించండి. లేకపోతే "సామాజిక న్యాయం" పేరుతో మరోసారి అధికారాన్ని అందుకోవాలనే కలలు కనే రాజకీయ పార్టీలకు ప్రజలే సమాధానం చెబుతారు. ప్రజలు మోసపోయే రోజులు పోయాయి. మాటలకు ఓట్లు వేసే కాలం తగ్గుతోంది. ఆచరణకు, ప్రాతినిధ్యానికి, అధికార భాగస్వామ్యానికి ఓటు వేసే కాలం వస్తోంది. తెలంగాణ ప్రజలు ఇప్పుడు అడుగుతున్న ప్రశ్న ఒక్కటే---"మా ఓట్లు మీకు కావాలంటే, మా వర్గాలకు పాలించే హక్కు ఎందుకు ఉండకూడదు?" ఈ ప్రశ్నకు నిజాయితీగా సమాధానం చెప్పలేని ఏ పార్టీ అయినా సామాజిక న్యాయం గురించి మాట్లాడే నైతిక హక్కును ముందుగా తనలో తాను పరిశీలించుకోవాల్సిందే. ఎందుకంటే సామాజిక న్యాయం అంటే ఇతరులకు పదవులు పంచడం కాదు, అధికారాన్ని పంచుకోవడం. అదే ప్రజాస్వామ్యానికి అసలైన అర్థం.

-మన్నారం నాగరాజు
సామాజిక రాజకీయ విశ్లేషకులు.

"విశ్వాసం తప్పిన పీనుగ మోసినవాడినే పట్టిందంట"

అనే మాటలో మనిషి అనుభవించిన నమ్మకద్రోహం, ఆవేదన కనిపిస్తాయి. మనం మంచితనంతో ఆదుకున్న వ్యక్తే తిరిగి మనకు అపకారం చేస్తే, ఆ బాధ ఎలా ఉంటుందో ఈ మాట తెలియజేస్తుంది. ఎవరైనా కష్టాల్లో ఉన్నప్పుడు మనం చేయూతనిస్తాం. అవసరంలో డబ్బు ఇస్తాం, ఆపదలో అండగా నిలబడతాం, సమస్య వచ్చినప్పుడు మన సమయాన్ని వెచ్చించి సహాయం చేస్తాం. అప్పుడు మన మనసులో ఉండేది ఒక్కటే---వాళ్లు ఆ కష్టం నుంచి బయటపడాలి. కానీ కొందరు అవసరం తీరగానే మనం చేసిన మేలును మరిచిపోతారు. మరికొందరు మన మంచితనాన్ని తమకు అనుకూలంగా వాడుకుని, చివరికి మనకే ఇబ్బందులు కలిగిస్తారు. ఇక్కడ బాధపెట్టేది మనం కోల్పోయిన డబ్బో, సమయమో మాత్రమే కాదు... మనం పెట్టుకున్న నమ్మకం. "నేను ఇంతగా ఆదుకున్న వ్యక్తి నాతో ఇలా ప్రవర్తిస్తాడా?" అనే ప్రశ్న మనసును ఎక్కువగా గాయపరుస్తుంది. మనం చెప్పుకున్న వ్యక్తిగత విషయాలను బయటపెట్టడం, మన గురించి చెడుగా ప్రచారం చేయడం, అవసరంలో మనల్ని ఒంటరిగా వదిలేయడం---ఇవన్నీ ఆ నమ్మకాన్ని దెబ్బతీస్తాయి. కృతజ్ఞత అంటే చేసిన సహాయానికి సమానంగా తిరిగి సహాయం చేయడం ఒక్కటే కాదు. అందుకున్న మేలును గుర్తుంచుకోవడం, సహాయం చేసిన వ్యక్తిని గౌరవించడం, అతనికి హాని కలిగించకుండా ఉండటం కూడా కృతజ్ఞతే. తిరిగి ఏమీ ఇవ్వలేని పరిస్థితిలో



ఉన్నా, చేసిన మంచిని చెడుగా చిత్రీకరించ కుండా ఉండగలగాలి. స్వార్థం, అసూయ, తమ తప్పులను కప్పిపుచ్చుకోవాలనే ప్రయత్నం వల్ల కొందరు తమకు మేలు చేసినవారిపైనే నిందలు వేస్తారు. అయితే వారి ప్రవర్తనకు కారణం ఏదైనా, చేసిన అపకారానికి బాధ్యత వారిదే. అలాంటి అనుభవం ఎదురైతే మన మంచితనాన్ని పూర్తిగా వదిలేయాల్సిన అవసరం లేదు. మంచితనానికి వివేకం తోడవ్వాలి. ఎవరికైనా సహాయం చేసే ముందు వారి ప్రవర్తనను గమనించాలి. మన కుటుంబ అవసరాలు, మన ఆర్థిక స్థితి, మనశ్శాంతిని దృష్టిలో పెట్టుకుని సహాయం చేయాలి. పదేపదే మన నమ్మకాన్ని దెబ్బతీసేవారితో హద్దులు పెట్టుకోవాలి. ఒక్కరి నమ్మకద్రోహం వల్ల అందరినీ అనుమానిస్తే, నిజంగా మన చేయూత అవసరమైనవారికి కూడా దూరమవుతాం. అందుకే ఆ అనుభవాన్ని ఒక పాఠంగా తీసుకుని, ఎవరిని ఎంతవరకు నమ్మాలో నేర్చుకో వాలి. మేలు చేయడం మన సంస్కా రం... ఆ మేలును గుర్తుంచు కోవడం ఎదుటివారి సంస్కా రం. మన మంచిత నాన్ని నిలబె ట్టుకుంటూనే, మన ఆత్మగౌర వాన్ని కాపా డుకోవడం మన బాధ్యత.

-మీ నక్క యాదగిరి

సర్దుబాటు - వివాహ వ్యవస్థను దృఢం చేస్తుంది

వివాహం అంటే అమ్మాయి, అబ్బాయి కలవడం మాత్రమే కాదు, రెండు మనస్సులు, రెండు కుటుంబాలు, రెండు భిన్నమైన జీవన విధానాలు ఒకటిగా మార్చే బంధమే వివాహబంధము. వివాహం తర్వాత భార్యాభర్తలు కలిసి జీవించడమే కాకుండా, ఒకరి కుటుంబాన్ని మరొకరు గౌరవించడం, ఒకరి సంప్రదాయాలను మరొకరు అర్థం చేసుకోవడం, అవసరమైన సందర్భాల్లో సర్దుకుపోవడం ద్వారా మాత్రమే ఆ బంధం బలపడుతుంది. ప్రస్తుత కాలంలో వివాహాల సంఖ్య తగ్గడం కంటే, వివాహ బంధాలు ఎక్కువ కాలం నిలవకపోవడం ఒక ఆందోళనకరమైన అంశంగా మారుతోంది. చిన్న చిన్న అపార్థాలు, అహంకారం, అధిక అంచనాలు, కుటుంబ సభ్యుల జోక్యం, ఆర్థిక విషయాలు, ఉద్యోగ ఒత్తిళ్లు, వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన అభిప్రాయ భేదాలు వంటి అనేక కారణాలు భార్యాభర్తల మధ్య దూరాన్ని పెంచుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో సర్దుబాటు అనే లక్షణం వివాహ బంధానికి ఒక బలమైన పునాది. వివాహం జరిగిన రోజుతో ఇద్దరు వ్యక్తుల జీవితాలు మాత్రమే మారవు. రెండు కొత్త కుటుంబాలు ఒకరికొకరు దగ్గరవుతాయి. రెండు ఇళ్లలో పెరిగిన వ్యక్తులు ఒకే ఇంట్లో జీవించాల్సి వస్తుంది. వారి ఆలోచనలు, అలవాట్లు, అభిరుచులు, ఆచారాలు, ఆహారపు పద్ధతులు, మాట్లాడే తీరు, కుటుంబ సంబంధాలు వేర్వేరుగా ఉండవచ్చు. ఒక అమ్మాయి తన పుట్టింట్లో ఒక విధమైన వాతావరణంలో పెరిగి ఉండవచ్చు. ఒక అబ్బాయి తన కుటుంబంలో మరో విధమైన వాతావరణంలో పెరిగి ఉండవచ్చు. వివాహం తర్వాత ఇద్దరూ ఒకే విధంగా ఆలోచించాలి అనుకోవడం సాధ్యం కాదు. అందుకే వివాహ జీవితంలో మొదట అవసరమయ్యేది "నా విధానమే సరైనది" అనే భావనను వదిలి, "మనకు సరైన విధానం ఏమిటి?" అని ఆలోచించడం. చాలామంది సర్దుకుపోవడాన్ని బలహీనతగా భావిస్తారు. ఒకరి మాటకు మరొకరు ఒప్పుకుంటే తాము తగ్గిపోయినట్లు భావిస్తారు. కానీ నిజమైన సర్దుబాటు అంటే ఓటమి కాదు. అది సంబంధాన్ని కాపాడుకోవడానికి తీసుకునే పరిపక్వమైన నిర్ణయం. భార్య ఒక విషయంలో భర్త అభిప్రాయాన్ని గౌరవించడం, భర్త మరో విషయంలో భార్య అభిప్రాయానికి విలువ ఇవ్వడం ఇదే ఆరోగ్యకరమైన సర్దుబాటు. ప్రతి విషయంలో ఎవ్వరికి వాళ్ళు నేనే గెలవాలని ప్రయత్నిస్తే కుటుంబంలో ఎవరూ గెలిచినట్లు కాదు, ఇద్దరూ కలిసి గెలిచినప్పుడే కుటుంబం గెలిచినట్లు. ప్రతి కుటుంబానికి కొన్ని సంప్రదాయాలు ఉంటాయి. పండుగలను జరుపుకునే విధానం, పెద్దలను గౌరవించే పద్ధతి, ఇంటి ఆచారాలు, కుటుంబ కార్యక్రమాలు, బంధువులతో సంబంధాలు ఇవన్నీ భిన్నంగా ఉండవచ్చు. వివాహం తర్వాత తన కుటుంబ సంప్రదాయాలనే పాటించాలని ఒకరు పట్టుబడితే సమస్యలు రావచ్చు. అదే సమయంలో ఎదుటివారి సంప్రదాయాలను పూర్తిగా తిరస్కరించడం కూడా సరికాదు. ఒకరి సంప్రదాయాన్ని మరొకరు గౌరవించాలని వత్తిడి తీసుకరావడం సమస్యలు సృష్టికి కారణం. ప్రతి ఆచారాన్ని అనుసరించాల్సిన అవసరం లేదు. ముందుగా దాని వెనుక ఉన్న భావాన్ని అర్థం చేసుకోవాలి. గౌరవం ఉన్న చోటే అనుబంధం పెరుగుతుంది. వివాహ బంధానికి ప్రేమ ఎంత ముఖ్యమో గౌరవం కూడా అంతే ముఖ్యమైనది. ప్రేమ తగ్గిపోవచ్చు, పెరగవచ్చు కానీ పరస్పర గౌరవం ఉంటే అనేక సమస్యలను పరిష్కరించుకోవచ్చు. భర్త భార్య అభిప్రాయాన్ని వినాలి. భార్య కూడా భర్త అభిప్రాయాన్ని గౌరవించాలి. ఒకరి ఉద్యోగాన్ని, కష్టాన్ని, సమయాన్ని, బాధ్యతలను మరొకరు అర్థం చేసుకోవాలి. ఇంట్లో చేసే పనికి విలువ ఉండాలి. సంపాదించే వ్యక్తి మాత్రమే కుటుంబానికి ముఖ్యుడు కాదు. ఇంటిని నిర్వహించే వ్యక్తి కూడా కుటుంబ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తారు. కుటుంబంలో బాధ్యతలు పంచుకోవడం అనేది ఉపకారం కాదు, భాగస్వామ్యం. ఈ రోజుల్లో అనేక కుటుంబ సమస్యలకు ఆర్థిక విషయాలు కూడా ఒక కారణంగా మారుతున్నాయి. ఆదాయం ఎంత?



ఖర్చులు ఎంత? పొదుపు ఎలా చేయాలి? ఎవరి కుటుంబానికి ఎంత సహాయం చేయాలి? అప్పులు ఎలా తీర్చాలి? భవిష్యత్తు కోసం ఎలా ప్రణాళిక చేసుకోవాలి? వంటి విషయాల్లో ముందుగానే స్పష్టమైన చర్చ అవసరం. భర్త సంపాదన తనదే, భార్య సంపాదన తనదే అనే భావన కన్నా, కుటుంబ భవిష్యత్తు కోసం కలిసి నిర్ణయాలు తీసుకోవడం మంచిది. అయితే సర్దుబాటు పేరుతో ఒకరి సంపాదనపై మరొకరు పూర్తి నియంత్రణ సాధించడం కూడా సరికాదు. ఆర్థిక స్వేచ్ఛతో పాటు ఆర్థిక బాధ్యత కూడా ఉండాలి. వివాహం తర్వాత అమ్మాయికి పుట్టింటి అనుబంధం తగ్గిపోవాలని ఆశించడం ఎంత తప్పో, అబ్బాయి తన కుటుంబాన్ని పూర్తిగా దూరం చేయాలని ఆశించడం కూడా అంతే తప్పు. భర్త తన భార్య పుట్టింటిని గౌరవించాలి. అదే విధంగా భర్త కుటుంబాన్ని భార్య గౌరవించాలి. రెండు కుటుంబాల మధ్య పోలికలు పెట్టడం, "మా ఇంట్లో ఇలా ఉండదు", "మీ ఇంటి వాళ్లే ఇలా చేస్తారు" అంటూ విమర్శించడం సమస్యలను మరింత పెంచుతుంది. రెండు కుటుంబాలను పోటీగా చూడకుండా, రెండు కుటుంబాలను మన కుటుంబాలుగా చూడగలిగితే వివాహ బంధం మరింత అందంగా మారుతుంది. అహంకారం బంధానికి శత్రువుగా మారుస్తుంది. "నేనే ఎందుకు తగ్గాలి?" అనే ప్రశ్న అనేక కుటుంబాల్లో సమస్యలకు కారణమవుతోంది. ప్రతి విషయానికీ తనదే పైచేయి కావాలని ప్రయత్నించడం వల్ల ప్రేమ ఉన్నా దూరం పెరుగుతుంది. కొన్ని సందర్భాల్లో ఒకరు ముందడుగు వేయాలి. మరికొన్ని సందర్భాల్లో మరొకరు ముందుకు రావాలి. తప్పు చేసినప్పుడు "క్షమించు" అని చెప్పడం చిన్నదనం కాదు. మనస్పర్థలు వచ్చినప్పుడు మాట్లాడుకుని పరిష్కరించుకోవడం పరిపక్వత. క్షమాపణ చెప్పగలిగిన మనస్సు, క్షమించగలిగిన హృదయం ఉన్న కుటుంబంలో బంధం ఎక్కువకాలం నిలుస్తుంది, దృడంగా మారుతుంది. ప్రతి విషయంలో కుటుంబ సభ్యుల జోక్యం అవసరం లేదు. భార్యాభర్తల మధ్య చిన్న సమస్య వచ్చిన ప్రతిసారీ తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులను మధ్యలోకి తీసుకురావడం సమస్యను మరింత పెద్దది చేయవచ్చు. ప్రతి కుటుంబానికి తమ సమస్యలను తామే పరిష్కరించుకునే అవకాశం ఇవ్వాలి. పెద్ద సమస్యలు వచ్చినప్పుడు పెద్దల సలహా తీసుకోవచ్చు. కానీ ప్రతి చిన్న విషయాన్ని బయటకు తీసుకెళ్లడం వల్ల అపార్థాలు పెరుగుతాయి. సర్దుబాటుకు కూడా హద్దులు ఉన్నాయి సర్దుబాటు అంటే అన్నింటినీ భరించడం కాదు. అవమానం, హింస, వేధింపులు, మోసం, వ్యసనాలు, ఆర్థిక దోపిడీ వంటి తీవ్రమైన సమస్యలను "సర్దుకుపోవాలి" అంటూ సమర్థించడం సరైంది కాదు. వివాహ బంధంలో ప్రేమతో పాటు గౌరవం, భద్రత, స్వేచ్ఛ, సమానత్వం కూడా ఉండాలి. మనస్పర్థలు వస్తే ముందుగా ఎవ్వరికి వాళ్ళు ఒంటరిగా ఆలోచించాలి, తప్పు ఎవరివైపు ఉంటే క్షమాపణ కోరుకోవాలి, క్షమించే గుణాన్ని పెంపొందించుకోవాలి, ఇంకా ఎక్కువ ఇబ్బందులు జరిగితే దాని గురించి మాట్లాడాలి. అవసరమైతే కుటుంబ పెద్దలు, నిపుణులు లేదా తగిన సహాయ వ్యవస్థలను సంప్రదించాలి. ఆరోగ్యకరమైన సర్దుబాటు అనేది ఇద్దరి గౌరవాన్ని కాపాడే విధంగా ఉండాలి. నేటి యువత విద్యావంతులు. ఉద్యోగాలు చేస్తున్నారు. తమ జీవితంపై తమకు స్పష్టమైన అభిప్రాయాలు ఉన్నాయి. ఇది మంచి పరిణామమే. అయితే వ్యక్తిగత స్వేచ్ఛతో పాటు కుటుంబ బాధ్యతను కూడా అర్థం చేసుకోవాలి. వివాహానికి ముందు ఒకరినొకరు అర్థం చేసుకోవడం, భవిష్యత్తు లక్ష్యాలు, ఉద్యోగం, నివాసం, ఆర్థిక వ్యవహారాలు, పిల్లల గురించి అభిప్రాయాలు, కుటుంబ బాధ్యతలు వంటి విషయాలపై స్పష్టంగా మాట్లాడుకోవడం అవసరం. వివాహం అనేది జీవితాంతం కలిసి నడిచే ప్రయాణం. అందులో ఎప్పుడూ సంతోషమే ఉండదు. కొన్నిరోజులు ఆనందంగా ఉంటాయి. కొన్ని రోజులు సమస్యలతో ఉంటాయి. సంతోషంలో కలిసి నవ్వడం ఎంత ముఖ్యమో, కష్టాల్లో కలిసి నిలబడటం అంతకంటే ముఖ్యం. వివాహ జీవితంలో ప్రేమ మొదట ఆకర్షణగా ప్రారంభమవుతుంది. కాలం గడిచేకొద్దీ ఆ ప్రేమ బాధ్యతగా మారాలి. ఒకరి ఆరోగ్యం గురించి మరొకరు ఆలోచించడం, అలసిపోయినప్పుడు అండగా నిలవడం, వైఫల్యంలో ధైర్యం చెప్పడం, విజయాన్ని కలిసి జరుపుకోవడం ఇవే నిజమైన దాంపత్య జీవితానికి గుర్తులు. ఒకరి బలహీనతలను మరొకరు ఎగతాళి చేయకుండా, బలాలను ప్రోత్సహించాలి. బయట ప్రపంచం ముందు ఒకరినొకరు గౌరవించాలి. వ్యక్తిగత విషయాలను అందరి ముందు చర్చించకుండా గోప్యతను కాపాడాలి. వివాహం అనేది ఒక రోజు జరిగే వేడుక కాదు. ప్రతిరోజూ ఇద్దరూ కలిసి నిర్మించుకునే జీవితం. పెళ్లి రోజున ఇచ్చే హామీల కంటే, ఆ తర్వాత జరిగే పరిణామాలను, పరిస్థితులను అర్థం చేసుకొని ముందుకు సాగడం ముఖ్యం. వివాహ బంధం బలపడాలంటే ప్రేమ ఉండాలి. ప్రేమ నిలవాలంటే గౌరవం ఉండాలి. గౌరవం నిలవాలంటే పరస్పర అవగాహన ఉండాలి. అవగాహన పెరగాలంటే ఓర్పు ఉండాలి. ఈ అన్నింటినీ కలిపి నిలబెట్టేది సర్దుబాటు. సర్దుకుపోవడం అంటే తన వ్యక్తిత్వాన్ని కోల్పోవడం కాదు. ఎదుటివారి మనస్సును అర్థం చేసుకోవడం. తన అభిప్రాయానికి ఎంత విలువ ఇస్తామో, ఎదుటివారి అభిప్రాయానికి కూడా అంతే విలువ ఇవ్వడం. వివాహం అంటే "నేను" నుంచి "మనం" వైపు చేసే ప్రయాణం. అమ్మాయి తన ఇంటిని వదిలి వస్తుంది కాబట్టి ఆమె మాత్రమే సర్దుకోవాల్సిన అవసరం లేదు. అబ్బాయి కూడా తన జీవితంలోకి వచ్చిన కొత్త వ్యక్తిని అర్థం చేసుకోవాలి. ఇద్దరూ ఒక అడుగు చొప్పున ముందుకు వేస్తేనే కుటుంబ జీవితం సంతోషంగా సాగుతుంది. కుటుంబ వ్యవస్థ దృఢంగా మారుతుంది, కుటుంబ వ్యవస్థ దృడంగా మారితే సమాజం సానుకూలమైన మార్పు దిశగా ప్రయత్నిస్తుంది.

-వై. సంజీవ కుమార్,
ఫౌండర్ & ప్రెసిడెంట్,
స్కై ఫౌండేషన్,
9 3 9 3 6 1 3 5 5 5 ,
9493613555

గాంధీ జయంతి సందర్భంగా రహదారిపై మట్టి, రాళ్ల తొలగింపు

ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు

కూకట్ పల్లి అక్టోబర్ 02 వెలుతురు:

మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని వివేకానందనగర్ కాలనీ మెయిన్‌రోడ్డుపై పేరుకుపోయిన మట్టి కుప్పలు, రాళ్లు, చెత్తాచెదారాన్ని తొలగించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. మెయిన్‌రోడ్డుపై ఉన్న మట్టి, రాళ్లను తొలగించాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జనంపల్లి పురేందర్‌రెడ్డికి సూచించారు. ఎమ్మెల్యే సూచనల మేరకు పురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్మికులు రోడ్డుపై ఉన్న మట్టి కుప్పలు, రాళ్లు, చెత్తాచెదారాన్ని తొలగించారు. ఈ సందర్భంగా ఆటోలు మెయిన్‌రోడ్డుపై నిలిపి ప్రయాణికులకు, వాహన దారులకు ఇబ్బందులు కలిగించకుండా లోపలి ప్రాంతంలో నిలుపుకోవాలని ఆటో కార్మికులకు పురేందర్‌రెడ్డి సూచించారు. ఆటోలు కాలనీ లోపలి నుంచి రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పురేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛతకు ప్రాధాన్యతనిస్తూ రోడ్డుపై పేరుకుపోయిన చెత్తాచెదారం, మట్టి, రాళ్లను తొలగించినట్లు తెలిపారు. ప్రయాణికులు, స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రహదారిని సౌకర్య వంతంగా మార్చినట్లు పేర్కొన్నారు.

మహాత్ముని సేవలు చిరస్మరణీయం

పాపిరెడ్డినగర్ బస్తీ వెల్ఫేర్ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి

కూకట్ పల్లి అక్టోబర్ 02 వెలుతురు:
దేశానికి స్వాతంత్ర్యం సాధించేందుకు మహాత్మా గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని వెంకటేశ్వరనగర్ డివిజన్ పాపిరెడ్డినగర్ బస్తీ వెల్ఫేర్ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి అన్నారు. మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం పాపిరెడ్డినగర్‌లోని బస్తీ కార్యాలయం వద్ద గాంధీజీ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ.. సత్యం, అహింస, శాంతి మార్గాల్లో గాంధీజీ సాగించిన పోరాటం దేశ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందని పేర్కొన్నారు. గాంధీజీ ఆశయాలను నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆడెపు ప్రభాకర్, పైళ్ల శంకర్‌రెడ్డి, గజ్జెల వసంతరెడ్డి, మొగుళ్ల కనకరెడ్డి, సామల నర్సిరెడ్డి, కొంతం మహేందర్‌రెడ్డి, సులుగురు లక్ష్మారెడ్డి, కొండూరు యాదగిరి, నలసాని బాల్‌రెడ్డి, గడ్డం వెంకట్‌రెడ్డి, ఆసిరెడ్డి రంగారెడ్డి, గురం శంకర్‌రెడ్డి, డాకూరి తిరుపతిరెడ్డి, గట్టాని గోపాల్‌తో పాటు బస్తీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గాంధీ ఆశయాలు అందరికీ మార్గదర్శకం

జనసేన రాష్ట్ర జాయినింగ్ కమిటీ కన్వీనర్ ముమ్మారెడ్డి ప్రేమకుమార్

కూకట్ పల్లి అక్టోబర్ 02 వెలుతురు:
మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గం కేపీహెచ్‌బీ 5వ ఫేజ్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో గాంధీజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర జాయినింగ్ కమిటీ కన్వీనర్ ముమ్మారెడ్డి ప్రేమకుమార్ పాల్గొని మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముమ్మారెడ్డి ప్రేమకుమార్ మాట్లాడుతూ.. జాతిపిత మహాత్మా గాంధీ చూపిన సత్యం, శాంతి, అహింస మార్గాలు ఎల్లప్పుడూ ప్రజలకు మార్గదర్శకంగా నిలవాలని అన్నారు. గాంధీజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజ కవర్గానికి చెందిన జనసేన నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు తదితరులు పాల్గొని మహాత్మా గాంధీకి ఘన నివాళులు అర్పించారు.

గాంధీజీ ఆశయాలు యువతకు ఆదర్శం..

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్

కూకట్ పల్లి అక్టోబర్ 02 వెలుతురు:

మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌లు శుక్రవారం కేపీహెచ్‌బీ 1వ రోడ్ లోని గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అహింసను ఆయుధంగా మలుచుకుని దేశానికి స్వాతంత్ర్యం సాధించేందుకు మహాత్మా గాంధీ చేసిన పోరాటం నేటి యువతకు ఆదర్శంగా నిలవాలని అన్నారు. గాంధీజీ చూపిన మార్గంలో నడుస్తూ యువత దేశ శ్రేయస్సు కోసం తమ లక్ష్యాలను సాధించి, సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మహాత్మా గాంధీ వంటి మహనీయుల జీవిత చరిత్ర, వారు చేసిన త్యాగాలు, దేశానికి అందించిన సేవలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు భావితరాలకు తెలియజేయాలని సూచించారు. గాంధీజీ ఆశయాలను ఆచరణలో పెట్టడం ద్వారా సమాజంలో శాంతి, సామరస్యం మరింత బలోపేతం అవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ కోఆర్డినేటర్ సతీష్ అరోరా, మాజీ కార్పొరేటర్ పగుడాల శిరీష బాబురావు, నాయకులు వెంకటేష్, పవన్, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సభలో మాదృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తాం

- ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా చర్యలు తీసుకుంటాం
- ఆరుట్ల గ్రామసర్పంచ్ మానిపాటి శోభాకుమార్ ఉప సర్పంచ్ నుకంరాజు ముదిరాజ్

మంచాల వెలుతురు అక్టోబర్ 02:
మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో గాంధీ జయంతి సందర్భంగా ముందుగా మహాత్మా గాం ధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించిన గ్రామసర్పంచ్ మానిపాటి శోభాకుమార్ ఉ పసర్పంచ్ నుకంరాజు ముదిరాజ్ గ్రామకార్యదర్శి చిలుకల వెంకటేష్ గ్రామపంచాయతీ పాలక వర్గం సభ్యులు అనంతరం గ్రామసభ నిర్వహించారు ఈ సభలో గ్రామ పంచాయతీకి స్థలం కే టాయించకుండా అక్రమ వెంచర్లు ఏర్పాటు చేసిన వెంచర్ల యజమానులపై చర్యలు తీసుకోవా లి గ్రామపంచాయతీకి స్థలం కేటాయించిన తర్వాతనే ఇల్లు నిర్మించుకోవడానికి గ్రామపంచాయ తీ అనుమతి ఇవ్వాలని బిఆర్ఆర్ ఫౌండేషన్ సభ్యుడు మహమ్మద్ షాకేర్ పాలకవర్గాన్ని అధి కారులను నిలదీశారు ఈసందర్భంగా గ్రామపంచాయతీ వార్డుసభ్యుడు పున్నం రాము మాట్లా డుతూ గ్రామంలో ఎవ్వరు వెంచర్ ఏర్పాటుచేసిన గ్రామపంచాయతీకి10% స్థలం కేటాయించా లని అని అన్నారు ఆరుట్ల అంబేద్కర్ చౌరస్తాలో వాహానాల పార్కింగ్ సమస్య ఇబ్బందికరంగా ఉన్నది అని అలాగే వెంకటేశ్వరనగర్ కాలనీలో డ్రైనేజీసమస్య గ్రామంలో అక్కడక్కడ వీధిలైట్ల సమస్య కూడాఎక్కువ ఉన్నది ప్రజలు అని పాలకవర్గం దృష్టికి తీసుకువచ్చారు వెంటనే స్పం దించిన గ్రామసర్పంచ్ మానిపాటి శోభాకుమార్ ఉపసర్పంచ్ నుకంరాజు ముదిరాజ్ గ్రామపంచాయతీ కార్యదర్శి చిలుకల వెంకటేష్ మాట్లాడుతూ గ్రామంలో ప్రజలకు నీటిసమస్యలేకుండా చేయటానికి గతంలో పాడైన బోరు మోటార్లను మరమ్మతులు చేయించి ప్రజలు వాడుకోవడా నికి నీటిఎత్తిడి లేకుండా చేశామన్నారు అలాగే అంబేద్కర్ చౌరస్తాలో వాహానాల పార్కింగ్ సమ స్యలపై పాలకవర్గంతో చర్చించి చర్యలు తీసుకుంటాం అనిఅన్నారు ప్రజల సమస్యలు పరిష్క రిం చడానికి పాలకవర్గం ఎల్లప్పుడూ పనిచేస్తుంది ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎప్పటికప్పుడు గ్రామంలోని వార్డుల్లో పర్యటిస్తూ ప్రజాసమస్యలు తెలుసుకుంటున్నాం అని అ న్నారు ఈకార్యక్రమంలో గ్రామపంచాయతీ వార్డుసభ్యులు కొండిగారి శ్రావణ్ కుమార్ పంది శేఖ ర్ మంద మాధవి మోహన్ రెడ్డి పున్నం రాము రావుల జంగయ్య మహమ్మద్ ఇమ్రాన్ ఖాన్ లా లగారి మణెమ్మ వివిధ శాఖల అధికారులు అంగన్వాడీ టీచర్లు డ్వాక్రా సంఘం మహిళలు ఆశా వర్కర్లు వివిధ పార్టీల నాయకులుప్రజలు పాల్గొన్నారు

ప్రాణాలు పోకముందే స్పందించండి

- ప్రమాదాలకు నిలయంగా మారిన ఆరుట్ల నుండి కడీలభాయి తండా రాచకొండకు వెళ్లే రోడ్డు
- పూర్తిగా పాడైపోయిన బీటీ రోడ్డును పరిశీలించిన ప్రజాసంఘాల నాయకుడు కంబాలపల్లి భాస్కర్
- వెంటనే రోడ్డు మరమ్మతులు చేయాలని డిమాండ్

మంచాల వెలుతురు అక్టోబర్ 02:
మంచాల మండలం ఆరుట్ల గ్రామంనుండి కడిలబాయితండ రాచకొండ నారాయణపురం చౌ టుప్పల్ వెళ్ళేబిటి రోడ్డు పూర్తిగా దెబ్బతిని పాడైపోయి కంకర తేలిన రోడ్డును పరిశీలించిన ఇ బ్రహీంపట్నం నియోజకవర్గం ప్రజాసంఘాల నాయకుడు కంబాలపల్లి భాస్కర్ సందర్భంగా మా ట్లాడుతూ ఆరుట్ల నుండి కడిలాబాయి తండా రాచకొండకు వెళ్లేరోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది అనిఅన్నారు అనేకమంది ప్రమాదాలకు గురవుతున్నారు సంవత్సరాలు గడుస్తున్నఅ భివృద్ధికి నోచుకోని రోడ్డు గుంతలమయంగా మారిపోయి కంకర తేలి రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది అని అన్నారు ఆరుట్ల గ్రామంనుండి ప్రతిరోజు వందలాది వాహానాలు రాచకొండ సరళ మైసమ్మ శివాలయం సరళ మైసమ్మ హజ్రత్ గాలి దర్గా సందర్శించడానికి వెళుతూ ఉంటాయన్నారుహైద రాబాద్ నగరానికి కూత వేటు దూరంలో ఉన్న రాచకొండ ప్రాంతం రోడ్డు అభివృద్ధి కాకపోవడం సిగ్గుచేటు అన్నారు చౌటుప్పల్ రోడ్ హైవేకు లింకురోడ్ ఇదిస్థానిక ఎమ్మెల్య, ఎంపీ ఇద్దరు ఈ రోడ్డుకు ప్రత్యేక నిధులు కేటాయించి ఈ రోడ్డు పనులు ప్రారంభం చేయాలని విజ్ఞప్తి చే శారు గతంలో ఎంపీడీవో గారి దృష్టికి తీసుకొచ్చి రోడ్డు ఏపీలను కోరితే ఇప్పటికీ రోడ్డు వెయ్య లేదు రైతులు రోజువేలాది వాహానాలు ఈరోడ్డుపై నుండి వెళ్తుంటాయి రోడ్డు బాగు చేయడంలో ఎందుకు వివక్ష చూపుతున్నారు ఈరోజు వ్యవసాయ బాయి దగ్గర నుండి ఇంటికి వస్తుండగా కంబాలపల్లి శ్రీధర్ బైక్ పై నుండి రోడ్డు కంకర గుంతలు ఉండడం మూలంగా వాహనం అదుపు తప్పి కింద పడిపోయి గాయాల పాలయ్యాడు ఇప్పటికైనా ప్రభుత్వం అధికారులు స్థానిక ఎమ్మె ల్యే స్పందించి బీటీ రోడ్డుపనులు ప్రారంభించి వాహనదారులకు ఇబ్బందులు లేకుండాచూడాల ని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈకార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కొండిగారి ప్రసాద్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

రోడ్డుపై అదుపుతప్పి కింద పడిపోయి గాయాల పాలైన కంబాలపల్లి శ్రీధర్

హఫీజ్‌పేట్‌లో వీధి కుక్కల స్వైర విహారం,

వైద్య ఆరోగ్య శాఖ అవగాహన

రంగారెడ్డి జిల్లా వెలుతురు అక్టోబర్ 02:
హఫీజ్‌పేట్ ప్రాంతంలో వీధి కుక్కల స్వైర విహారం ఎక్కువైంది. గత కొద్ది రోజులుగా చిన్న పిల్లలు, పెద్దవాళ్లను కుక్కలు కరుస్తున్న ఘటనలు పెరుగుతున్నాయి. దీనివల్ల స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. స్వర్ణకుమారి గారి ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్య శాఖ బృందం హఫీజ్‌పేట్ లో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డా. రాకేష్ గారు, హెల్త్ సూపర్‌వైజర్లు, లోకల్ మెడికల్ ఆఫీసర్, ఆశా మరియు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. జీహెచ్ ఎం ఆధ్వర్యంలో వెంటనే ఆనమల్ బర్త్ కంట్రోల్ కార్యక్రమం చేపట్టాలని, కుక్కలకు **Anti-Rabies Vaccination** వేయాలని కోరారు. కుక్క కరిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రిలో **Anti-Rabies Vaccine** ఉచితంగా వేయించుకోవాలని సూచించారు.

గాంధీ ఆశయాలే సమాజానికి మార్గదర్శకం

- గాంధీ జయంతి సందర్భంగా ఘనంగా నివాళులు
- వివిధ డివిజన్లలో గాంధీజీ విగ్రహాలకు పూలమాలలు వేసిన బండి రమేష్

కూకట్ పల్లి అక్టోబర్ 02 వెలుతురు:
జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని కూకట్‌పల్లి నియోజకవర్గంలోని వివిధ డివిజన్లలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుల ఆధ్వర్యంలో మూసాపేట్, ఉమ్మడి అల్లాపూర్, గాయత్రి నగర్, కేపీహెచ్‌బీ 1వ రోడ్ ప్రాంతాల్లోని గాంధీజీ విగ్రహాలకు టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ.. మహాత్మా గాంధీజీ చూపిన సత్యం, అహింస, శాంతి, సేవా మార్గాలు నేటి సమాజానికి కూడా స్ఫూర్తిదాయకమని అన్నారు. గాంధీజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరంలో గాంధీజీ చేసిన మహోన్నత త్యాగాలను స్మరించుకోవడంతో పాటు, ఆయన కలలు కన్న సమసమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని కోరారు. ప్రజల్లో ఐక్యత, సామాజిక బాధ్యత, సేవా భావాన్ని పెంపొందించడమే గాంధీజీకి అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, మహిళా నాయకురాళ్లు, స్థానిక నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

ఎస్ఐఆర్ నోటీసులు అందుకున్నవారు పత్రాలతో ఓటు హక్కును కాపాడుకోవాలి

మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు..

కూకట్ పల్లి అక్టోబర్ 02 వెలుతురు:
ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా నోటీసులు అందుకున్న ఓటర్లు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు అన్నారు. అర్హత ఉన్న ప్రతి పౌరుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా అవసరమైన పత్రాలతో ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. మాధవరం నగర్ కాలనీలోని డివిజన్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో స్థానిక నాయకులు, బీఎల్ఏలతో కలిసి మాధవరం రంగారావు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్‌లో భాగంగా నోటీసులు అందుకున్న ప్రతి కుటుంబాన్ని బీఎల్ఓల సహకారంతో ఇంటి వద్దే సంప్రదించి, అవసరమైన పత్రాలను సమర్పించేలా సహకరించాలని బీఎల్ఏలకు సూచించారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా స్థానిక నాయకులు, బీఎల్ఏలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఓటర్లకు అవసరమైన సమాచారం అందించి, నిబంధనల ప్రకారం తమ వివరాలను సరిచూసుకునేలా సహకరించాలని తెలిపారు. అదేవిధంగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్లుగా అర్హత ఉన్న ప్రతి గ్రాడ్యుయేట్ తమ పేరును నమోదు చేసుకోవాలని రంగారావు సూచించారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు నమోదు ప్రక్రియకు నవంబర్ 6వ తేదీ వరకు గడువు ఉన్నందున, అర్హులైన ప్రతి ఒక్కరూ గడువులోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, బీఎల్ఏలు తదితరులు పాల్గొన్నారు.

గాంధీ, శాస్త్రి ఆశయాలు నేటి తరానికి ఆదర్శం

జయంతి వేడుకల్లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు

కూకట్ పల్లి అక్టోబర్ 02 వెలుతురు:

కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలో మహాత్మా గాంధీ, భారతదేశ మాజీ ప్రధానమంత్రి లాల్ బహాదూర్ శాస్త్రి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మూసాపేట్, బాలానగర్, బాలాజీనగర్ తదితర డివిజన్లలో జరిగిన కార్యక్రమాల్లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ, లాల్ బహాదూర్ శాస్త్రి విగ్రహాలు, చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ.. అహింస, సత్యాగ్రహ మార్గంలో మహాత్మా గాంధీ దేశ స్వాతంత్ర్య ఉద్యమానికి నాయకత్వం వహించారని అన్నారు. లాల్ బహాదూర్ శాస్త్రి సరళత, నిజాయితీ, దేశభక్తికి ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు. ఇద్దరు మహనీయుల జీవితాలు, దేశ సేవా స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శప్రాయమని తెలిపారు. అనంతరం కార్యక్రమాల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు, కార్యకర్తలతో వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆత్మీయంగా ముచ్చటించారు. కార్యకర్తలతో కలిసి 'చాయ్ పే చర్చ' కార్యక్రమంలో పాల్గొని పార్టీ కార్యక్రమాలు, ప్రజా సమస్యలు తదితర అంశాలపై స్నేహపూర్వకంగా చర్చించారు. ఈ కార్యక్రమాల్లో మూసాపేట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కోడిచెర్ల మహేందర్, బీజేపీ సీనియర్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, వివిధ మోర్చాల నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీ ఆశయాలు నేటి సమాజానికి స్ఫూర్తిదాయకం..

మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు

కూకట్ పల్లి అక్టోబర్ 02 వెలుతురు:

మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని మాధవరం నగర్ కాలనీ డివిజన్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు స్థానిక నాయకులతో కలిసి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ సత్యం, అహింస, శాంతి, సహనం వంటి మహాత్మా గాంధీ చూపిన విలువలు నేటి సమాజానికి కూడా ఎంతో అవసరమని అన్నారు. స్వాతంత్ర్య సమరంలో గాంధీజీ అందించిన సేవలు, ప్రజలను ఏకం చేసి అహింసా మార్గంలో నడిపించిన తీరు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. గాంధీజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ సత్యం, అహింస, స్వచ్ఛత, సామాజిక బాధ్యత వంటి విలువలను తమ జీవితాల్లో ఆచరించాలని పిలుపునిచ్చారు. సమాజంలో శాంతి, సామరస్యాన్ని పెంపొందించేందుకు గాంధీజీ సిద్ధాంతాలను ఆచరించడం అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని మహాత్మా గాంధీ కి నివాళులు అర్పించారు.

పేదలకు సీఎం సహాయనిధి అండ

మునుగోడు,అక్టోబర్ 2 (వెలుతురు):
ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు సీఎం సహాయ నిధి ఆర్థికంగా అండగా నిలుస్తోందని సర్పంచ్ గొపగోని పాపయ్యగౌడ్ పేర్కొన్నారు.శుక్రవారం మండలంలోని గంగోరిగూడెం గ్రామానికి చెందిన బొంత ఎల్లమ్మకు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహకారంతో మంజూరైన రూ.29 వేల ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్ అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు మహేష్‌గౌడ్,వార్డు సభ్యుడు బొంత వెంకటయ్య,కాంగ్రెస్ సీనియర్ నాయకులు గోపగోని స్వామి, బాలరాజ్,ఈర్ల కోటిలింగం, సైదులు, లింగస్వామి,శవగోని వెంకన్న,పానుగంటి వెంకన్న,గోపగోని నరసింహ,పగిళ్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీ ఆశయాలను పాటించడమే నివాళి

మునుగోడు, అక్టోబర్ 2 (వెలుతురు):
సత్యం,అహింసా మార్గాలను ఆచరించడమే మహాత్మా గాంధీజీకి నిజమైన నివాళి అని సర్పంచ్ మాలుగు శ్రీను అన్నారు.శుక్రవారం మండలంలోని కిష్టాపురం గ్రామంలో గాంధీ జయంతి సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గాంధీజీ చూపిన సత్యం,అహింసా మార్గాలు నేటి సమాజానికి ఆదర్శమన్నారు.ప్రతి ఒక్కరూ ఆయన ఆశయాలను పాటిస్తూ సమాజ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో బోయ సతీష్,వార్డ్ మెంబర్లు బోయ సురేష్,మహేశ్వరం భరత్,పాలుట్ల విజయ ప్రేమ్ కుమార్,పంచాయతీ కార్యదర్శి బండ లింగస్వామి,అంగన్ వాడి టీచర్,ఆశ వర్కర్,గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని గాంధీ విగ్రహానికి వినతి

మునుగోడు,అక్టోబర్ 2 (వెలుతురు):
జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరిని వీడాలని టీయూడబ్ల్యూజే (ఐజేయు) నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మునుగోడు మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ వద్ద మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జర్నలిస్టుల భద్రతకు జాతీయ చట్టం తీసుకురావడంతోపాటు నూతన మీడియా కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. రద్దు చేసిన వర్కింగ్ జర్నలిస్టు చట్టాల కింద గతంలో ఉన్న హక్కులను పునరుద్ధరించి,కొత్త వేతన మండలిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో అర్హులైన జర్నలిస్టులకు ఇళ్లు, ఇంటి స్థలాలు కేటాయించాలని, ఉద్యోగుల తరహాలో హెల్త్‌కార్డులు అందించి క్యాష్‌లెస్ వైద్యసేవలు కల్పించాలని కోరారు. జర్నలిస్టుల హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడుతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కుంభం ఇంద్రసేనారెడ్డి, ముదుపు శ్యాం, జాజుల స్వామిగౌడ్, మార్నేని ప్రభాకర్, పెరుమాళ్ల ప్రమోద్ కుమార్, రెడ్డిమల్ల వెంకట్, పాంపాటి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

గాంధీజీ స్ఫూర్తితో సేవ చేయాలి

మునుగోడు,అక్టోబర్ 2 (వెలుతురు)
:మహాత్మా గాంధీజీ చూపిన సత్యం,అహింస,సేవా మార్గాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని మునుగోడు సర్పంచ్ పాలకూరి రమాదేవి నరసింహ గౌడ్, ఎంపీడీవో వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు.గాంధీ జయంతి సందర్భంగా శుక్రవారం గ్రామపంచాయతీ ఆవరణలో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొని గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈరమళ్ల ప్రసాద్ తన తండ్రి ఈరమళ్ల స్వరాజ్యం జ్ఞాపకార్థం గ్రామపంచాయతీకి చెందిన 30 మంది పారిశుద్ధ్య కార్మికులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షుడు పల్లెర్ల శ్రీకాంత్,కార్యదర్శి పామనగండ్ల నవీన్‌కుమార్, కోశాధికారి నీల వెంకన్న,గౌరవ అధ్యక్షుడు ఎడవల్లి సురేష్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి,క్లబ్ సభ్యులు,వార్డు సభ్యులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్లు పట్టివేత

చౌటుప్పల్ వెలుతురు అక్టోబర్ 02:
చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం లో అక్రమంగా గ్యాస్ను నింపి విక్రయిస్తున్న సిలిండర్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీస్ ఇన్స్పెక్టర్ మన్మథ కుమార్ తెలిపారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం.. నమ్మదగిన సమాచారం మేరకు కొయ్యలగూడెం లో జబ్బారం గుజర్ (25) అక్రమంగా గ్యాస్ సిలిండర్ పెట్టుకొని బ్లాక్లో అధిక ధరలకు అమ్ముతున్నాడని రైడ్ చేయగా టాటా ఏస్

బేరింగ్ నెంబర్ ఏస్ర్త 3ఔ 3321 లో ఇండియన్ గ్యాస్ ఫుల్ సిలిండర్ లో పెద్దవి 10, భారత్ సిలిండర్ లో పెద్దది 2, స్మాల్ గ్యాస్ కాళీ సిలిండర్స్ 2, పెద్ద ఇనుప రెగ్యులేటర్ పట్టుబడ్డాయి. వాటిని స్వాధీన పరుచుకుని పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

మండల కేంద్రంలో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

గుండాల, అక్టోబర్ 2 (వెలుతురు):
యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలో జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గుండాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఇమ్మడి దశరథ గుప్తా మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇమ్మడి దశరథ గుప్తా మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ చూపిన సత్యం, అహింస, శాంతి మార్గాలు నేటి సమాజానికి కూడా ఆదర్శప్రాయమన్నారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం, పేదల సంక్షేమం, సమసమాజ స్థాపన దిశగా కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తోందన్నారు.తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని తెలిపారు. ఆలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆధ్వర్యంలో నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

జరుగుతోందన్నారు. మహాత్మా గాంధీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, యువజన నాయకులు తదితరులు పాల్గొని మహాత్మా గాంధీకి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ

ఉపాధ్యక్షులు ఏలూరు రామ్ రెడ్డి. జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి పొడిశెట్టి వెంకన్న. గ్రామ శాఖ అధ్యక్షుడు కొడపర్తి భాస్కర్. ఉపసర్పంచ్ ఆవుల సాయిప్రసాద్. సింగిల్ విండో డైరెక్టర్ అనపర్తి యాదగిరి. నాయకుల మాజీ ఎంపీటీసీ సూదగాని రామచంద్రు. ఆవుల శ్రీను. భాస్కర్ . రమేష్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

గ్రామాలలో వికసిత్ గ్రామపంచాయతీల ప్రణాళికలు

నూతనకల్ అక్టోబర్ 2(వెలుతురు)
మండల వ్యాప్తంగా గ్రామపంచాయతీలు, మండల కార్యాలయాలలో గాంధీ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామపంచాయతీ నూతనకల్లో వికసిత్ గ్రామపంచాయతీ ప్రణాళిక గ్రామ పంచాయతీ వనరులను పటం గీసి చూపించటం జరిగింది. 2026-27 సంవత్సరానికి గాను రూపకల్పనలో భాగంగా నిర్వహించారు.వీబీజీ రామ్ జి పనులను వివరణ జలసిరి పనులు గ్రామ సభలో గ్రామ ప్రజల అవసరాలు ప్రాథమిక సమస్యలు మౌలిక సదుపాయాలు అభివృద్ధి త్రాగునీరు పారిశుధ్యం ఉపాధి బాలల సంక్షేమ గ్రామాభివృద్ధికి అవసరమైన పనులను ప్రజల భాగస్వామ్యంతో అవసరాల ప్రాధాన్యత ఆధారంగా గుర్తించి గ్రామపంచాయతీకి భవిష్యత్తు అభివృద్ధికి అవసరమైన వనరులను సమన్వయం చేసుకొని

సమగ్ర ప్రణాళిక రూపొందించి కార్యాచరణ ప్రణాళికలు తీర్మానాల రూపంలో పై అధికారులకు నివేదించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సునీత, సర్పంచ్ మహేశ్వర మల్లికార్జున్, పిఎసిఎస్ చైర్మన్ నాగం జయసుధ సుధాకర్ రెడ్డి,ఉప సర్పంచ్ నాగం సరిత సుధీర్ రెడ్డి ఎంపీవో, ఏపీఓ శ్రీరాములు ఆర్డబ్ల్యూఎస్ డీఈ

రమేష్ ఏఈ ఉదయకుమార్ సభ్యులు,గ్రామ స్థాయి అధికారులు పాల్గొన్నారు.మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించి వికసి పంచాయతీ ప్రణాళికలు పనుల గుర్తింపు కార్యక్రమాలను నిర్వహించారు.ఆయా గ్రామ పంచాయతీ సర్పంచ్ లు, పంచాయతీ కార్యదర్శులు గ్రామస్థాయి అధికారులు పాల్గొన్నారు.

సర్ధార్ సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులుగా సోంబాబు గౌడ్

మోత్కూరు, అక్టోబర్ 2, వెలుతురు న్యూస్ :
సర్ధార్ సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులుగా మోత్కూరు మున్సిపల్ కేంద్రానికి చెందిన ధబ్బేటి సోంబాబు గౌడ్ ని నియమిస్తూ ఆ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు కప్పల రవి కుమార్ గౌడ్ శుక్రవారం స్వయంగా నియామకపు పత్రాన్ని అందజేశారు. అదేవిధంగా మున్సిపల్ కేంద్రానికి చెందిన మొరిగాల శ్రీనివాస్ జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శిగా బుషిగంపల పుష్పను జిల్లా మహిళ విభాగం ఉపాధ్యక్షురాలుగా నియమించారు.ఈ సందర్భంగా రవి కుమార్ మాట్లాడుతూ సర్వాయి పాపన్న ఆశయాల సాధనతో పాటు, కుల వృత్తి గీత సంఘాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని కోరారు.అనంతరం నూతనంగా నియామకమైన వారిని పూలమాలలు,శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పంజాల మల్లేష్ గౌడ్,వర్కింగ్ ప్రెసిడెంట్ టి ఆనంద్ గౌడ్,జిల్లా మహిళ విభాగం

అధ్యక్షురాలు పచ్చిమట్ల మాధవి, స్థానిక గీత సొసైటీ అధ్యక్షుడు మొరిగాల సురేష్,ఉపాధ్యక్షులు బీసు రవి,పాలకవర్గం సభ్యులు,నాయకులు బుర్ర యాదయ్య, ధబ్బేటి రమేష్,బీసు మధు,మొరిగాల రాజయ్య, వెంకన్న,ఎరుకల రాజు,చక్రపాణి,ఎరుకల నర్మద తదితరులు పాల్గొన్నారు.

భారతమాత ముద్దుబిడ్డల జయంతి వేడుకలు

చౌటుప్పల్ వెలుతురు అక్టోబర్ 02:
భారతమాత ముద్దుబిడ్డలు సమరయోధులు జాతిపిత మోహన్ దాస్ కరంచంద్ గాంధీ మరియు మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి గార్ల జయంతి వేడుకలు చౌటుప్పల్ లోని రాజీవ్ స్మారక భవనంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో రాజీవ్ స్మారక ట్రస్టు ప్రధాన కార్యదర్శి ఎం.ఏ. ఖయ్యూం, చౌటుప్పల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బోయ దేవేందర్, చౌటుప్పల్ మున్సిపల్ అధ్యక్షులు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ మాజీ అధ్యక్షులు సుర్వి నరసింహ గౌడ్, రాజీవ్ స్మారక ఆర్గనైజర్ సెక్రెటరీ నల్ల నరసింహ, జిల్లా కాంగ్రెస్ నాయకులు నందగిరి భీమయ్య, రామాలయ ధర్మకర్త ఆవుల యేసు యాదవ్, మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చెరుకు లింగస్వామి, మండల ప్రచార కార్యదర్శి యాస నరసింహారెడ్డి, ఐఎన్‌టియుసి బ్లాక్ అధ్యక్షులు కంచర్ల జంగయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాదాని గోపాల్, ఐఎన్‌టియుసి చౌటుప్పల్ మండల ప్రధాన కార్యదర్శి మహమ్మద్ చాంద్ పాషా, నాయకులు సుర్కంటి భగవంతు రెడ్డి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

రెండు ఎమ్మెల్సీ టికెట్లు రెడ్డిలకు కేటాయించి బిసిలను విస్మరించారు

మోత్కూరు, అక్టోబర్ 2, వెలుతురు న్యూస్ :
పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రెండు స్థానాలకు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులను కేటాయించడం అన్యాయమని బీసీ రిజర్వేషన్ సాధన సమితి జిల్లా నాయకులు కలిమెల నర్సయ్య అన్నారు.శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కుల గణన నిర్వహించి దేశానికి ఆదర్శంగా నిలిచామని చెప్పుకుంటున్నా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో మాత్రం ఆ స్ఫూర్తి పాటించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నల్లగొండబిఖమ్మం వరంగల్, హైదరాబాద్‌బిరంగారెడ్డిబిమహబూబ్ నగర్ నియోజకవర్గాలకు సర్వోత్తమ్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి అభ్యర్థులుగా ప్రకటించడం సామాజిక న్యాయానికి విరుద్ధమన్నారు. ఇప్పటికైనా ప్రకటించిన అభ్యర్థులను పునః పరిశీలించి

బీసీ ఎస్సీ ఎస్టీ, మైనార్టీలకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో బీసీ రిజర్వేషన్ సాధన సమితి పట్టణ అధ్యక్షులు నిలిగొండ మత్స్యగిరి, స్థానిక నాయకులు లింగంపల్లి రఘువర్ధన్ రావు, రాహుల్ ప్రతీక్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా గాంధీ జయంతి

మోత్కూర్, అక్టోబర్ 02,వెలుతురు న్యూస్ :
మోత్కూరు మండల కేంద్రంలో మహాత్మ గాంధీగారి 157 వ జయంతి సందర్భంగాబిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మోత్కూర్ లోని మహాత్మ గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పొన్నెబోయిన రమేష్ పట్టణ పార్టీ అధ్యక్షులు జంగ శ్రీను మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తీపిరెడ్డి మెగారెడ్డి రైతుబంధు సమితి మాజీ మండల అధ్యక్షులు కొండ సోంమల్లు అడ్డగూడూరు మండల ప్రధాన కార్యదర్శి చౌగోని సత్యం గౌడ్ మాజీ సర్పంచ్ బత్తిని తిరుమలేష్ సింగిల్ విండో డైరెక్టర్లు పురుగుల మల్లయ్య సామ పద్మా రెడ్డి జిల్లా నాయకులు దాసరి తిరుమలేష్ కూరెళ్ల పరమేష్ మున్సిపల్ యూత్ అధ్యక్షులు కంచర్ల క్రాంతి కుమార్ రెడ్డి జిట్ట సాయికుమార్ పోన్నెబోయిన మచ్చగిరి దాసరి నవీన్ నేర్లకంటి శీను కొమ్మూరి యాదిరెడ్డి పోన్నె బోయిన జానార్ధన్ తదితరులు పాల్గొన్నారు

మోత్కూరులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీకి ఘన నివాళులు

మోత్కూర్, అక్టోబర్ 2,వెలుతురు న్యూస్ :
శుక్రవారం నాడు మోత్కూరు మండల కేంద్రంలో ఉన్న మహాత్మా గాంధీ గారి విగ్రహానికి మండల, పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పూల మాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశంచి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాచకొండ బాలరాజు గౌడ్ ,పట్టణ అధ్యక్షులు బద్దం నాగార్జున రెడ్డి మాట్లాడుతూ

గాంధీజీ ఆశయాలే కాంగ్రెస్ పార్టీకి మార్గదర్శకం.జాతిపిత మహాత్మా గాంధీజీ సత్యం, అహింస, త్యాగం, సత్యాగ్రహం అనే ఆయుధాలతో దేశ స్వాతంత్ర్య ఉద్యమానికి నాయకత్వం వహించారని నాయకులు గుర్తు చేశారు.గాంధీజీ ఆశయాలతోనే కాంగ్రెస్ పార్టీ దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు.పేదలు, రైతులు, కార్మికులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమమే గాంధీజీ కలల భారతదేశానికి నిజమైన రూపమని అన్నారు.సామాజిక సమానత్వం, మత సామరస్యం, ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని అన్నారు.గాంధీజీ చూపిన సత్యం--అహింస మార్గంలో నడుస్తూ ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను పరిరక్షించడమే ఆయనకు నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ శ్రీ మతి గడ్డం స్వప్న సోమ నర్సయ్య ,ూాజూ చైర్మెన్ పేలపూడి వెంకటేశ్వర్లు, మున్సిపల్ కౌన్సిలర్లు,మండల , పట్టణ మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాళ్ళు ముద్దం జయ శ్రీ,అన్నేపు పద్మ,కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

చౌటుప్పల్ వెలుతురు అక్టోబర్ 02:
కాకినాడకు చెందిన కుంచె లారెన్స్ (26) చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం సమీపంలో మోటార్ సైకిల్ పైనుంచి జారిపడి, రోడ్డు ప్రమాదంలో శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడని పోలీస్ ఇన్స్పెక్టర్ జి. మన్మథ కుమార్

తెలిపారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం... లారెన్స్ రెండు నెలల క్రితం కాకినాడ నుంచి హైదరాబాద్ కి జాబ్ నిమిత్తం వచ్చే ఎర్రగడ్డలో హాస్టల్లో ఉంటున్నాడు. తేదీ 02.10.2026 నాడు అతనితోపాటు హాస్టల్లో ఉండే శివప్రసాద్ అనే అతను కలిసి పల్సర్ బైక్ ఖజూ 40శ్రీజ 8524 గలదానిపై శివప్రసాద్ బైక్ నడుపుతూ వెనకాల లారెన్స్ కూర్చొని హైదరాబాద్ నుండి బయలుదేరి కాకినాడ వెళ్తుండగా పంతంగి టోల్ గేట్ వద్దకు రాగానే లారెన్స్ నిద్ర వస్తుంది అని శివప్రసాద్ కి చెప్పగా వారు తిరిగి మరల హైదరాబాద్ కి వెళ్తుండగా మార్గమధ్యలో అందాజా తెల్లవారుజామున 4:45 గంటల సమయంలో ఆందోల్ మైసమ్మ గుడి సమీపంలోకి రాగానే లారెన్స్ బైక్ పై నుండి నిద్రపోయి కిందపడగా వారి వెనుక నుండి వస్తున్న గుర్తు తెలియని వాహనం అతని తల మీద నుండి వెళ్లగా లారెన్స్ తలకు ఇతర శరీర భాగాలకు బలమైన రక్త గాయాలై అక్కడికక్కడే మరణించినాడు, మృతదేహాన్ని వెంటనే చౌటుప్పల్ ప్రభుత్వాసుపత్రికి తరలించినారు చీకోటి సుధాకర్ ఫిర్యాదు మేరకు పోలీసు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శని అమావాస్య ఉత్సవాలకు శ్రీకారం

- మూడు రోజులపాటు ఘనంగా ఉత్సవాలు
- గోడపత్రిక ఆవిష్కరించిన

మంత్రి దామోదర రాజనర్సింహ...

జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 02:
సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం బర్దీపూర్ దత్తగిరి క్షేత్రంలోని శ్రీ శని ఘాట్‌లో ఈ నెల 8, 9, 10 తేదీల్లో నిర్వహించనున్న శని అమావాస్య ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఉత్సవాలకు సంబంధించిన గోడపత్రికను శుక్రవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతి అవధూత గిరి మహారాజ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అవధూత గిరి మహారాజ్ మాట్లాడుతూ.. ఈ నెల 10న శని అమావాస్య సందర్భంగా శనీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పంచామృత తైలాభిషేకం, రుద్రాభిషేకం, రుద్రహోమం, పూర్ణాహుతి తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శని అమావాస్య ఉత్సవాలకు మంత్రి దామోదర రాజనర్సింహతో పాటు పలువురు ఆధ్యాత్మిక గురువులు, ప్రవచనకర్తలు హాజరుకానున్నట్లు తెలిపారు. మూడు రోజులపాటు జరిగే ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి శనీశ్వర స్వామి వారిని దర్శించుకుని ఆశీస్సులు పొందాలని అవధూత గిరి మహారాజ్ కోరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు మల్లికార్జున పాటిల్, మునిపల్లి మాజీ ఎంపీపీ తాటిపల్లి రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య అనుసంధానకర్తలు గ్రామ పాలనాధికారులే..

- గ్రామ పాలనాధికారుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తాను
- ఆయా డిమాండ్లు పరిష్కారమయ్యేలా మా వంతుగా కృషి చేస్తాం
- జీపీవోల ప్రథమ మహాసభలో నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి, వెలుతురు అక్టోబర్ 02
ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య అనుసంధానకర్తలు గ్రామ పాలనాధికారులేనని డీసీసీ మాజీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి అన్నారు. ప్రభుత్వం చేసే మంచి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో వారిదే కీలక పాత్ర అని ఆమె వివరించారు. గ్రామ పాలన ఆఫీసర్స్ అసోసియేషన్ తెలంగాణ, సంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సంగారెడ్డి పట్టణంలో నిర్వహించిన ప్రథమ మహాసభకు డీసీసీ మాజీ అధ్యక్షురాలు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇష్టారాజ్యంగా వ్యవహరించి వీఆర్వో వ్యవస్థను నాశనం చేసిందన్నారు. వాళ్లు చేసే భూ అక్రమాలు వెలుగులోకి రావద్దని ఉద్దేశంతోనే వీఆర్వో వ్యవస్థను తొలగించారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టగానే, తిరిగి వారి సేవలను వినియోగించుకునేలా గ్రామ పాలనాధికారులుగా నియమించారని ఆమె గుర్తు చేశారు. రానున్న రోజుల్లోనూ వారిని మరింత ప్రోత్సహించేలా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు కొన్ని డిమాండ్లను నిర్మలా జగ్గారెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. తప్పకుండా ఈ డిమాండ్లను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళతానని ఆమె హామీ ఇచ్చారు. వాటి పరిష్కారం కోసం తనవంతుగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జీపీవోల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు మల్లారం అర్జున్, విజయ్, రాష్ట్ర కార్యదర్శి దాసరి వీరన్న, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎం. చిరంజీవి, ఆర్గనైజింగ్ సెక్రటరీ పృథ్వి రాజ్, జిపివో ల సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, సహాయ కార్యదర్శి సుజాత, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కూన సంతోష్ , మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ హఫీజ్, టౌన్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ కిరణ్ గౌడ్ పాల్గొన్నారు.

ఆలయాలపై దాడులు సరికాదు..!

- విశ్వ హిందూ మహాసంఘ్ రాష్ట్ర అధ్యక్షులు సిద్ధేశ్వరానందగిరి
- దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 02:
హిందూ దేవాలయాలు, అర్చకులపై దాడులు చేయడం ఏమాత్రం సమర్థనీయం కాదని విశ్వ హిందూ మహాసంఘ్ భారత్ ప్రపంచ హిందూ సమాఖ్య (వరల్డ్ హిందూ ఫెడరేషన్) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సిద్ధేశ్వరానందగిరి మహారాజ్ తీవ్రంగా ఖండించారు. ఆలయాలపై, అర్చకులపై దాడులకు పాల్పడే వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్ (చైతన్యపురి) పరిధిలోని సంతోషిమాత ఆలయంలో పూజారి, అమ్మవారి విగ్రహంపై ఓ వ్యక్తి కర్రతో దాడికి యత్నించిన ఘటన అత్యంత బాధాకరమన్నారు. ఆలయంలో పూజలు జరుగుతున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకోవడం ఆందోళనకరమని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని, ఆలయాలు, అర్చకులకు భద్రత కల్పించాలని సిద్ధేశ్వరానందగిరి మహారాజ్ కోరారు. దాడికి పాల్పడిన వ్యక్తిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నారాయణఖేడ్‌లో జర్నలిస్టుల నిరసన ర్యాలీ

గాంధీ విగ్రహానికి వినతిపత్రం

వెలుతురు నారాయణఖేడ్ అక్టోబర్ 02 :
సంగారెడ్డి జిల్లా :- నారాయణఖేడ్ పట్టణంలో గాంధీ జయంతిని పురస్కరించుకుని, జాతీయ జర్నలిస్టుల డిమాండ్ల దినోత్సవ సందర్భంగా నారాయణఖేడ్ పట్టణంలోని ఐబీ గెస్ట్ హౌస్ నుండి జర్నలిస్టులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించి తమ నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ జర్నలిస్టులపై దేశవ్యాప్తంగా జరుగుతున్న దాడులను అరికట్టి, వారి ఉద్యోగ భద్రతకు ప్రత్యేక చట్టం తీసుకురావాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జర్నలిస్టుల సమస్యల పట్ల అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని వీడాలి.రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి.ప్రతి వర్కింగ్ జర్నలిస్టుకు ఇళ్లు మరియు ఇళ్ల స్థలాలు కేటాయించాలి.ప్రభుత్వ ఉద్యోగులకు వర్తింపజేస్తున్న హెల్త్ కార్డుల విధానం జర్నలిస్టులకు

కూడా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.. కార్యక్రమంలో జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు సయ్యద్ ఆసిఫ్, జిల్లా ఉపాధ్యక్షుడు ఈ. వెంకటేశం, జాయింట్ సెక్రటరీ అబ్దుల్ రాహుఫ్, ఈసీ సభ్యుడు హసీబ్ పాటిల్, నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడు హలీం, డివిజన్ అధ్యక్షుడు జీ. సత్యం, ప్రధాన కార్యదర్శి కే. భూమయ్య పాల్గొన్నారు. వీరితో పాటు ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు బి. రాములు, ప్రధాన కార్యదర్శి

జావిద్, ఉపాధ్యక్షులు జి. విఠల్, అశోక్, కోశాధికారి నాథేక్, జాయింట్ సెక్రటరీలు అంజయ్య, జైపాల్ రెడ్డి, రషీద్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు వీర రెడ్డి, సంతోష్, ఎలక్ట్రానిక్ మీడియా ఉపాధ్యక్షుడు నిసార్, కోశాధికారి రవీందర్, జాయింట్ సెక్రటరీ అంబదాస్ ,జర్నలిస్టులు రాములు, శ్రీశైలం,వడ్ల వెంకటరమణ,వడ్ల జ్ఞానేశ్వర్,గౌలి మేఘారం , కౌసర్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

శేఖాపూర్ గ్రామసభలో అభివృద్ధికి బిగ్‌ప్లాన్

- నీటి సంరక్షణే లక్ష్యం.. రైతు సంక్షేమమే ధ్యేయం: సర్పంచ్ చేష్మోద్దీన్
- 15 కీలక పనులకు ప్రతిపాదనలు.. గ్రామాభివృద్ధికి పక్కా ప్రణాళిక

జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 02:
గ్రామ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం శేఖాపూర్‌లో నిర్వహించిన గ్రామసభలో 15 కీలక అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రతిపాదనలు రూపొందించారు. సర్పంచ్ మొహమ్మద్ చేష్మోద్దీన్ ఆధ్వర్యంలో జరిగిన గ్రామసభలో నీటి సంరక్షణ, రైతు సంక్షేమం, రహదారుల అభివృద్ధి, పారిశుద్ధ్యం, పచ్చదనం, వరదల నివారణ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. గ్రామ అవసరాలను క్షేత్రస్థాయిలో గుర్తించి, ప్రజలకు అత్యవసరమైన పనులను ప్రాధాన్యత క్రమంలో ఎంపిక చేసినట్లు

సర్పంచ్ తెలిపారు. ముఖ్యంగా నీటి వనరుల సంరక్షణతో పాటు రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. రోడ్లు, పారిశుద్ధ్య నిర్వహణ, పచ్చదనం పెంపు, వర్షపు నీటి ప్రవాహం నియంత్రణ వంటి పనులను చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. గ్రామసభ ప్రారంభానికి ముందు జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటానికి సర్పంచ్ మొహమ్మద్ చేష్మోద్దీన్, పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి పూలమాలలు వేసి నివాళు

లర్పించారు .ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. "ప్రజల సూచనలు, గ్రామ అవసరాల ఆధారంగానే అభివృద్ధి పనులను ఎంపిక చేస్తున్నాం. ప్రజల అవసరాలే ప్రాధాన్యంగా గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తాం" అని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి, మండల ఏపీఓ అశోక్‌కుమార్, వార్డు సభ్యులు గౌటటి శేఖర్, మొహమ్మద్ సల్మాన్, మరియం సైఫ్, నాయకులు మొహమ్మద్ అబ్దుల్ రాఫుఫ్, మొహమ్మద్ షాబుద్దీన్, ఫీల్డ్ అసిస్టెంట్ మ్యాతారి రూబెన్, అంగన్‌వాడీ టీచర్లు, బీఎల్‌ఓలు, ఆశా వర్కర్లు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

గాంధీ ఆశయాలే నేటి సమాజానికి మార్గదర్శకం

- మహాత్మా గాంధీకి ఘన నివాళులు అర్పించిన మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్
- సత్యం, అహింస, శాంతి సిద్ధాంతాలను ఆచరణలో పెట్టాలి : చైర్మన్

జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 2:
గాంధీ జయంతి సందర్భంగా సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మహాత్మా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్ పాల్గొని గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ మహమ్మద్ యూనుస్ మాట్లాడుతూ.. భారతదేశ స్వాతంత్ర్య సమరంలో మహాత్మా గాంధీ పోషించిన పాత్ర చిరస్మరణీయమని అన్నారు. సత్యం, అహింస, శాంతి, సత్యాగ్రహం వంటి సిద్ధాంతాలను ఆయుధాలుగా చేసుకుని బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ప్రజలను ఏకం చేసిన మహనీయుడు గాంధీజీ

అని కొనియాడారు.దేశ స్వాతంత్ర్యం కోసం గాంధీజీ చేసిన పోరాటం, త్యాగాలు, సామాజిక సమానత్వం కోసం చేపట్టిన కార్యక్రమాలు, పేదలు, అణగారిన వర్గాల అభ్యున్నతికి చేసిన కృషి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. గాంధీజీ కలలుగన్న స్వచ్ఛమైన, సమానత్వంతో కూడిన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి

చేయాలని పిలుపునిచ్చారు. గాంధీజీ ఆశయాలను ఆచరణలో పెట్టడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి. ప్రభాకర్, వైస్ చైర్మన్ శిరీషా రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నరేష్ గౌడ్, మాజీ అధ్యక్షుడు కండెం నర్సింలు, మాజీ వైస్ చైర్మన్ ఖాజా, కౌన్సిలర్లు జహంగీర్, జమీలుద్దీన్, రంగా అరుణ్ కుమార్, శ్రీధర్ రెడ్డి, అక్రమ్, అతీక్ హక్కాని, జాఫర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీకాంత్ రెడ్డి, బర్కత్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

తపస్ ఆధ్వర్యంలో లాల్ బహుదూర్ శాస్త్రి జయంతి

చేగుంట వెలుతురు అక్టోబర్ 2:
తపస్ చేగుంట మండల శాఖ ఆధ్వర్యంలో లాల్ బహుదూర్ శాస్త్రి జయంతిని పి.ఎం.శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చేగుంటలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తపస్సు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చల్లా లక్ష్మణ్ మాట్లాడుతూ సందర్భంగా తపస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చల్లా లక్ష్మణ్ మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్యోద్యమం లో ప్రముఖ పాత్ర వహించాడు అని, మొదట రైల్వే మంత్రిగా, హోంమంత్రిగా, భారతదేశానికి రెండవ ప్రధానమంత్రిగా పనిచేసే భారతదేశానికి సేవలందించారని, అతను 1965 ఇండో-పాకిస్థాన్ యుద్ధ కాలంలో దేశాన్ని నడిపించిన గొప్ప వ్యక్తి అని, అతని నినాదం "జై జవాన్ జై కిసాన్", యుద్ధ సమయంలో బాగా ప్రాచుర్యంలోనికి తెచ్చి, ప్రజల హృదయాలలో గుర్తుండిపోయిన వ్యక్తి అని, దేశాన్ని రక్షించడానికి జవాన్ ఎంత ముఖ్యమో, భారతదేశానికి అన్నం పెట్టడానికి రైతు అంత ముఖ్యమని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో తపస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రావుల వెంకటేష్, తంగేళ్లపల్లి కృష్ణమూర్తి, తపస్ జిల్లా నాయకులు పూల బోయిన దేవానంద్,సుమతి, పట్లూరి యాదగిరి, రమేశ్ పి ఆర్ టి యు జిల్లా ఉపాధ్యక్షులు చల్లా రామకృష్ణ, బాలు, సి అర్ పి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ విగ్రహానికి జర్నలిస్టుల సమస్యలపై వినతి..!

- ఇంటి స్థలాలు, హెల్త్ కార్డులు, అక్రిడిటేషన్లు మంజూరు చేయాలని జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి డిమాండ్

సంగారెడ్డి వెలుతురు అక్టోబర్ 02:
గాంధీ జయంతి సందర్భంగా జాతీయ జర్నలిస్టుల డిమాండ్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని సంగారెడ్డి పట్టణంలోని జిల్లా పరిషత్ ప్రాంగణంలో గల జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి జర్నలిస్టులు వినతిపత్రం సమర్పించారు. తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే--ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ, ప్రజాస్వామ్య పరిరక్షణలో కీలకపాత్ర పోషిస్తున్న జర్నలిస్టుల హక్కులు, భద్రత, సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. గాంధీజీ చూపిన సత్యం, అహింస మార్గంలో జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తున్నామని తెలిపారు. మీడియా రంగాన్ని సమగ్రంగా సమీక్షించి, ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా విధాన సిఫారసులు చేసేందుకు సమగ్ర మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులు, మీడియా సిబ్బంది, వార్తా సంస్థలను దాడులు, బెదిరింపులు, అణచివేత నుంచి రక్షించేందుకు ప్రత్యేక కేంద్ర చట్టం తీసుకురావాలని కోరారు. వర్కింగ్ జర్నలిస్టులకు సంబంధించిన 1955, 1958 చట్టాల నిబంధనలను పునరుద్ధరించి ఉద్యోగ భద్రత, పని గంటల పరిమితి,

వివాదాల పరిష్కారం, ఉద్యోగం నుంచి తొలగించినప్పుడు న్యాయమైన పరిహారం అందేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా ఉద్యోగులకు పెరుగుతున్న జీవన వ్యయానికి అనుగుణంగా వేతనాలు అందించేందుకు కొత్త వేతన బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. తెలంగాణలో అర్హులైన జర్నలిస్టులందరికీ ఇంటి స్థలాలు కేటాయించాలని, సంగారెడ్డి జిల్లాలోనూ అర్హులైన ప్రతి జర్నలిస్టుకు స్థలం ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జర్నలిస్టులకు ఆరోగ్య సేవలను పునరుద్ధరించి, తక్షణమే హెల్త్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో అక్రిడిటేషన్ కార్డులు అందని అర్హులైన జర్నలిస్టులందరికీ కార్డులు జారీ చేయాలని ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ అనిల్ కుమార్ పేర్కొన్నారు. జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వాలు స్పందించి పరిష్కార చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర నాయకుడు జోగిపేట యాదగిరి, వెంకటరెడ్డి,సంఘం జిల్లా కోశాధికారి అన్వర్, జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం, శ్రీనాథ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ విల్సన్, ఉలవల రాజు, అంజయ్య, జాయింట్ సెక్రెటరీ శ్రీనివాసరెడ్డి, సుమన్,చిన్న మధ్యతరహా పత్రికల సంఘం జిల్లా అధ్యక్షుడు సిద్ధిక్, ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ చవాన్, కోశాధికారి లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు నజీర్,సీనియర్ జర్నలిస్టు మధుసూదనాచారి, రథసారథి సీఈవో సంతోష్ గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు విజయరాజు, పరంజ్యోతి, నాగరాజుగౌడ్, ఫోటో జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు ఆరిఫ్, ఇతర నేతలు సంతోష్, సత్యం, సాక్ష్యం శ్రీనివాస్, నవీన్, పటాన్చెరు నియోజకవర్గ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పత్తి నరసింహ ప్రధాన కార్యదర్శి యాదగిరి, బొల్లారం నాయుడు, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఓయూ పీహెచ్‌డీ విద్యార్థి కంపాటి వెంకట్ గౌడ్ మృతికి బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ నివాళి

హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 02:
ఉస్మానియా యూనివర్సిటీ పీహెచ్‌డీ విద్యార్థి, ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం ఎదుళ్లచెరువు గ్రామానికి చెందిన కంపాటి వెంకట్ గౌడ్ దారుణ హత్యకు గురై మృతి చెందడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ అన్నారు. శుక్రవారం వెంకట్ గౌడ్ భౌతికకాయాన్ని సందర్శించిన లింగంగౌడ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎవరికి ఎలాంటి హాని తలపెట్టని వెంకట్ గౌడ్‌ను దారుణంగా హత్య చేయడం అత్యంత బాధాకరమని, ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఆయన అకాల మరణం ఆయన కుటుంబ సభ్యులకు, స్నేహితులకు, ఓయూ విద్యార్థి లోకానికి తీరని లోటని అన్నారు. చిన్న వయసులోనే ఆయన మృతి చెందడం అత్యంత విషాదకరమని పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామని,ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని కోరుకుంటున్నట్లు జాజుల లింగంగౌడ్ పేర్కొన్నారు. హంతకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బిసి విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు బొల్లెపల్లి స్వామి గౌడ్, జక్కుల మధు, బైరు నాగరాజు గౌడ్, నకిరేకంటే సైదులు, బూడిద ప్రవీణ్,జోగు గణేష్, నోముల శేషు, సతీష్, శ్రీనివాస్ రెడ్డి,తీగల శ్యామ్మ,అంజి, శ్రవణ్ మరియు తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీ ఆశయాలు, సత్యం, అహింసా మార్గాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శం

సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్

సైబరాబాద్ వెలుతురు అక్టోబర్ 02:
సైబరాబాద్ కమిషనరేట్‌లో జాతిపిత మహాత్మా గాంధీజీ జయంతి వేడుకలను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ గాంధీజీ చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, మహాత్మా గాంధీజీ చూపిన సత్యం, అహింస, శాంతి, క్రమశిక్షణ మార్గాలు నేటికీ ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం గాంధీజీ చేసిన త్యాగాలు, పోరాటం చిరస్మరణీయమని పేర్కొన్నారు. గాంధీజీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ సమాజంలో శాంతి, సామరస్యం, సోదరభావాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు. ప్రజలకు న్యాయం చేయడం, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించడం, సమాజ సేవకు అంకితభావంతో పనిచేయడం పోలీసుల ప్రధాన కర్తవ్యమని తెలిపారు. గాంధీజీ కలలుగన్న స్వచ్ఛమైన, శాంతియుతమైన, సమానత్వ సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని సీపీ గారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ డీసీపీ అన్నపూర్ణ, హెడ్‌క్వార్టర్స్ డీసీపీ సంజీవ్, హెడ్‌క్వార్టర్స్ అడిషనల్ డీసీపీ షమీర్, హన్మంత్ రావుతో పాటు ఇతర పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

గాంధీ, శాస్త్రి ఆశయాలను ఆచరించాలి

స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా జయంతి వేడుకలు

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 02
జాతిపిత మహాత్మా గాంధీ, భారత మాజీ ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ చూపిన అహింసా మార్గం, సత్యనిష్ఠ, త్యాగనిరతి నేటికీ ప్రతి ఒక్కరికీ ఆదర్శ ప్రాయమని పేర్కొన్నారు. లాల్ బహదూర్ శాస్త్రి దేశానికి అందించిన విశిష్ట సేవలు, నిరాడంబర జీవనశైలి, దేశభక్తి భావితరాలకు స్ఫూర్తిదాయకమని తెలిపారు. దేశం కోసం తమ జీవితాలను అంకితం చేసిన మహనీయుల ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్కై ఫౌండేషన్ అధ్యక్షుడు వై. సంజీవకుమార్, ఉపాధ్యక్షురాలు ఓ. పావని పాల్గొన్నారు.

గాంధీ జయంతి సందర్భంగా జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

గోషామహల్ అక్టోబర్ 02 (వెలుతురు)
గాంధీ జయంతిని పురస్కరించుకుని గోషామహల్ సర్కిల్ ఏఎంహెచ్ఓ నేహా ఆధ్వర్యంలో నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జీహెచ్ఎంసీ కమిషనర్, అదనపు కమిషనర్ (హెల్త్ అండ్ శానిటేషన్), గోల్కొండ జోన్ జోనల్ కమిషనర్, గోషామహల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసారు. గోషామహల్ అసిస్టెంట్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ నేహా, డీఈఈ (ఎస్‌డబ్ల్యూఎం) అఫ్తాబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరానికి గోషామహల్ ఎగ్జిబిషన్, జాంబాగ్ వార్డులకు చెందిన పారిశుద్ధ్య కార్మికులు, ఎంటమాలజీ సిబ్బంది పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా సిబ్బందికి శారీరక పరీక్షలతో పాటు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. ఫాస్టింగ్, పోస్ట్‌ప్రాండియల్ రక్త పరీక్షలతో పాటు అవసరమైన ముఖ్యమైన రక్త పరీక్షలను ఉచితంగా చేపట్టారు. పారిశుద్ధ్య కార్మికులు, క్షేత్రస్థాయి సిబ్బంది ఆరోగ్య పరిరక్షణ, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు నేహా స్పష్టం చేసారు.

గాంధీజీ, శాస్త్రి చూపిన విలువలను నేటి యువతకు ఆదర్శం

టీఎన్‌జీఓస్ యూనియన్ కేంద్ర ప్రధాన కార్యదర్శి డా.ఎస్.ఎం. హుస్సేని ముజీబ్

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 02
జాతిపిత మహాత్మా గాంధీ, మాజీ ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని టీఎన్‌జీఓస్ యూనియన్ భవన్‌లో జయంతి వేడుకలు నిర్వహించారు. టీఎన్‌జీఓస్ యూనియన్ కేంద్ర ప్రధాన కార్యదర్శి డా. ఎస్.ఎం. హుస్సేని ముజీబ్ గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డా. ముజీబ్ మాట్లాడుతూ.. భారత స్వాతంత్ర్య సమరంలో మహాత్మా గాంధీ పోషించిన పాత్ర చిరస్మరణీయమన్నారు. సత్యం, అహింస, శాంతి, నైతిక విలువలను జీవితంలో ఆచరించి దేశ ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చారని తెలిపారు. కుల, మత, ప్రాంత, భాష భేదాలకు అతీతంగా ప్రజలంతా ఐక్యంగా ఉండాలన్న గాంధీజీ మార్గం నేటి సమాజానికి కూడా ఎంతో అవసరమన్నారు. గాంధీజీ చూపిన సత్యం, అహింసా మార్గాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని, సమాజంలో శాంతి, సోదరభావం, సామాజిక న్యాయం కోసం తమవంతు బాధ్యత నిర్వర్తించాలని సూచించారు. ప్రజాసేవలో ఉన్న ఉద్యోగులు నిజాయితీ, నిబద్ధతతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే గాంధీజీకి అందించే నిజమైన నివాళి అని అన్నారు.

శాస్త్రి సేవలు ఆదర్శం

మాజీ ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి దేశానికి అందించిన సేవలను డా.ముజీబ్ కొనియాడారు. నిరాడంబర జీవితం, నిజాయితీ, క్రమశిక్షణ, దేశభక్తి, అంకితభావానికి శాస్త్రి ఆదర్శప్రాయుడన్నారు. దేశం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న సమయంలో ఆయన నాయకత్వం, ధైర్యం, నిర్ణయాత్మకత ప్రజలకు స్ఫూర్తినిచ్చాయని పేర్కొన్నారు. శాస్త్రి ఇచ్చిన 'జై జవాన్--జై కిసాన్' నినాదం దేశ భద్రతలో సైనికులు, ఆహార భద్రతలో రైతుల సేవల ప్రాధాన్యతను తెలియజేస్తుందన్నారు. దేశ అభివృద్ధిలో రైతులు, సైనికులు, ఉద్యోగులు, కార్మికుల పాత్ర కీలకమన్నారు. గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రి చూపిన విలువలను యువత ఆదర్శంగా తీసుకుని దేశ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీఓస్ యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షులు కొండల్ రెడ్డి, కార్యదర్శి శైలజ, హైదరాబాద్ సిటీ అధ్యక్షులు శ్రీకాంత్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు అసద్ ఉద్దీన్, ట్రెజరర్ అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్, హైదరాబాద్ అసోసియేట్ ప్రెసిడెంట్ కె.ఆర్. రాజ్‌కుమార్, ఉపాధ్యక్షులు ఖలీద్, బొలిగిద్ద శంకర్, ఐటీఐ ఫోరం అధ్యక్షులు గోవర్ధన్ రెడ్డి, హైదరాబాద్ ఈసీ సభ్యులు ముఖీద్ ఖురేషీ, ఏపీఆర్‌వో వహీద్, ఐటీఐ యూనిట్ అధ్యక్షులు సత్యనారాయణ, ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ కృష్ణ, స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ రోహిత్, మధు, ఉస్మాన్ భాయ్, రామకృష్ణ అన్న, మహమ్మద్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

హిమాయత్‌నగర్‌లో విజయవంతంగా మెగా హెల్త్ క్యాంప్

2,450 మందికి ఉచిత వైద్య సేవలు

హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 02:
జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా హిమాయత్ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ ఆధ్వర్యంలో డివిజన్‌లోని కేశవ్ మెమోరియల్ పాఠశాలలో ఘనంగా మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. గత పది రోజులుగా ఈ వైద్య శిబిరంపై డివిజన్‌లో విస్తృత స్థాయిలో ప్రచారం నిర్వహించడంతో, ప్రజల నుండి విశేష స్పందన లభించింది. దీని ఫలితంగా ఈరోజు డివిజన్‌లో సుమారు 2,450 మంది ప్రజలు ఈ వైద్య శిబిరానికి విచ్చేసి ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకున్నారు.

వైద్య శిబిరంలో అందించిన ముఖ్యమైన సేవలు: పరీక్షలు & నిర్ధారణ: రాండమ్ బ్లడ్ షుగర్ టెస్ట్, జనరల్ ఫిజీషియన్ కన్సల్టేషన్, ఈసీజీ (ECG) మరియు 2డి ఈకో పరీక్షలు.

ప్రత్యేక విభాగాలు: కంటి మరియు దంత వైద్య సంబంధిత పరీక్షలు నిర్వహించి, రోగులకు అవసరమైన ఉచిత మందులను అందజేశారు.

ప్రముఖ ఆసుపత్రుల భాగస్వామ్యం: ఈ మెగా హెల్త్ క్యాంపులో యశోద హాస్పిటల్స్, పుష్పగిరి కంటి హాస్పిటల్, హైదరాబాద్ డెంటల్ హాస్పిటల్ మరియు ఉస్మానియా హాస్పిటల్‌కు చెందిన వైద్య నిపుణులు పాల్గొని సేవలు అందించారు.

ఉచిత కంటి ఆపరేషన్లు: ఈ వైద్య శిబిరంలో గుర్తించిన 19 మందికి పుష్పగిరి ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచితంగా క్యాటరాక్ట్ (కంటిశుక్ల) సర్జరీలు నిర్వహించనున్నారు.

ఆయుష్ & ఆయుర్వేద సేవలు: అలోపతితో పాటు ఆయుర్వేదిక్, యునాని మరియు ఆయుష్ వైద్యులు కూడా ఈ మెగా క్యాంపులో పాల్గొని డివిజన్ ప్రజలకు తమ వైద్య సేవలను విస్తృతంగా అందించారు. ఇంతటి బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టి సామాన్యులకు వైద్యం చేరువ చేసినందుకు డివిజన్ మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ గారికి స్థానిక ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, జీవన వాహిని ట్రస్ట్ ప్రతినిధి ధనలక్ష్మి తదితరులు పాల్గొని విజయవంతం చేశారు.

అంతర్రాష్ట్ర గంజాయి ముఠా గుట్టురట్టు

- జార్ఖండ్ నుంచి హైదరాబాద్‌కు గంజాయి తరలింపు.. ఇద్దరి అరెస్ట్
- 3.3 కేజీల పండు గంజాయి, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం
- స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ రూ.1.80 లక్షలు
- కమిషనర్స్ టాస్క్‌ఫోర్స్ చార్మినార్, గోల్కొండ జోన్ల ఇన్‌ఛార్జ్ అదనపు డీసీపీ కె.ఎస్. రావు వెల్లడి

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 02
జార్ఖండ్ నుంచి హైదరాబాద్‌కు గంజాయిని తరలించి విక్రయిస్తున్న అంతర్రాష్ట్ర ముఠా గుట్టును హైదరాబాద్ కమిషనర్స్ టాస్క్‌ఫోర్స్ (చార్మినార్ జోన్) బృందం, మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు సంయుక్తంగా రట్టు చేశారు. ఆరాంఘర్ ఎక్స్ రోడ్, బృందావన్ హోటల్ సమీపంలో పక్కా సమాచారంతో నిర్వహించిన దాడిలో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి 3.3 కేజీల పండు గంజాయి, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న సొత్తు మొత్తం విలువ సుమారు రూ.1.80 లక్షలు. అరెస్టయిన వారిలో జార్ఖండ్‌లోని బొకారో స్టీల్ సిటీ, మారఫారీ కాలనీకి చెందిన ఇంజమాముల్ హక్ అలియాస్ ఫైజల్ ఖాన్ (25), బొకారోలోని ధుండి బజార్‌కు చెందిన అనీష్ కుమార్ సా (25) ఉన్నారు. వీరిద్దరూ కార్మికులుగా పనిచేస్తున్నారు.

తక్కువ ధరకు కొనుగోలు.. హైదరాబాద్‌లో అధిక ధరకు విక్రయం

పోలీసుల విచారణలో నిందితులిద్దరూ జార్ఖండ్‌కు చెందిన చిన్ననాటి మిత్రులని తేలింది. 2024లో జీవనోపాధి కోసం హైదరాబాద్‌కు వచ్చిన వీరు కొంపల్లి ప్రాంతంలో నివసిస్తూ క్యాటరింగ్ పనులు చేసేవారు. ఈ క్రమంలో హసన్‌నగర్‌కు చెందిన తరుణ్ కుమార్‌తో పరిచయం ఏర్పడింది. క్యాటరింగ్ ద్వారా వచ్చే ఆదాయం తమ విలాసవంతమైన ఖర్చులకు సరిపోకపోవడంతో తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో గంజాయి విక్రయాలకు పాల్పడ్డారు. క్యాటరింగ్ రంగంలో పనిచేసే పలువురికి గంజాయి అలవాటు ఉందని గుర్తించిన వీరు జార్ఖండ్ నుంచి తక్కువ ధరకు గంజాయి తీసుకొచ్చి హైదరాబాద్‌లో అధిక ధరకు విక్రయించాలని పథకం వేశారు. జార్ఖండ్ రాష్ట్రం బొకారో జిల్లా పిండజోడ మండలం కాండ్రా గ్రామానికి చెందిన సుక్కు అలియాస్ ముర్ము నుంచి కేజీ రూ.13 వేల చొప్పున గంజాయిని కొనుగోలు చేసి, హైదరాబాద్‌లో తరుణ్ కుమార్‌కు కేజీ రూ.18 వేల నుంచి రూ.20 వేల చొప్పున గతంలో రెండు, మూడు సార్లు విక్రయించినట్లు విచారణలో వెల్లడైంది.

డెలివరీకి వచ్చి పోలీసులకు చిక్కారు

పది రోజుల క్రితం తరుణ్ కుమార్ మరోసారి గంజాయి కావాలని కోరడంతో నిందితులు సుక్కు నుంచి 3.3 కేజీల గంజాయిని కొనుగోలు చేసి రైలులో జార్ఖండ్ నుంచి హైదరాబాద్‌కు చేరుకున్నారు. తరుణ్ కుమార్ సూచన మేరకు ఆరాంఘర్ ఎక్స్ రోడ్డు వద్ద గంజాయిని డెలివరీ చేసేందుకు ఎదురుచూస్తుండగా పక్కా సమాచారంతో పోలీసులు చుట్టుముట్టి వారిని అరెస్ట్ చేశారు. ఈ కేసులో ప్రధాన సరఫరాదారు జార్ఖండ్‌కు చెందిన సుక్కు అలియాస్ ముర్ము, స్థానిక గంజాయి విక్రేత హసన్‌నగర్‌కు చెందిన తరుణ్ కుమార్ పరారీలో ఉన్నారు. వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ ఆపరేషన్‌ను చార్మినార్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్. సైదాబాబు పర్యవేక్షణలో ఎస్సైలు ఎం. మహేష్, కె. రామారావు, ఎం. మధు, పీసీ పి. మహేష్, చార్మినార్ జోన్ టాస్క్‌ఫోర్స్ బృందం, మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ సిబ్బంది సంయుక్తంగా నిర్వహించారు. కేసు వివరాలను కమిషనర్స్ టాస్క్‌ఫోర్స్ చార్మినార్, గోల్కొండ జోన్ల ఇన్‌ఛార్జ్ అదనపు డీసీపీ కె.ఎస్. రావు వెల్లడించారు.

రాష్ట్రంలో ఆటో ఛార్జీలు పెంపు

- కనీస ఛార్జీ రూ.30, ఆపై కిలోమీటర్కు రూ.14
- తెలంగాణలో ఆటో ఛార్జీలు పెంచుతూ రవాణాశాఖ ఉత్తర్వులు
- 1.6 కి.మీ. వరకు ఆటో కనీస ఛార్జ్ రూ.30గా..

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 02
తెలంగాణలో ఆటో ఛార్జీలు పెంచుతూ రవాణాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. 1.6 కి.మీ. వరకు ఆటో కనీస ఛార్జ్ రూ.30 గా ఉండనుంది. కనీస ఛార్జ్ తర్వాత ప్రతి కిలోమీటర్‌కు రూ.14 వసూలు చేయనున్నారు. ప్రతి నిమిషానికి ఆటో డిటెన్షన్ ఛార్జీలు 75 పైసలుగా నిర్ణయించారు. రాత్రి 11 నుంచి తెల్లవారుజామున 5 వరకు ఒకటిన్నర శాతం అదనపు ఛార్జీలు వసూలు చేసేందుకు అనుమతి ఇచ్చారు. మూడు నెలల్లోపు డిజిటల్ మీటర్లు ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది.

అసలేం జరిగిందంటే..

ఆటో కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, ఆగస్టు 23 నుంచి బంద్ చేయాలని రాష్ట్ర ఆటో, యాప్ ఆధారిత రవాణా సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ గతంలో వెల్లడించింది. దీంతో ఆగస్టు 22వ తేదీన కార్మికులతో ప్రభుత్వం చర్చలు జరిపింది. ప్రభుత్వం తరఫున రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, అధికారులు చర్చల్లో పాల్గొన్నారు. ఆటో కార్మికుల డిమాండ్ల పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉందని మంత్రి వారికి హామీ ఇచ్చారు. ఆర్టీసీ ఎలక్ట్రిక్ ఆటోలను కొనుగోలు చేయనుందనే వార్తల్లో వాస్తవం లేదని స్పష్టం చేశారు. మంత్రి హామీతో బంద్ విరమించిన కార్మికులు, వారి ప్రతిపాదనలను రవాణా శాఖకు పంపారు. దీనిపై ఏర్పాటైన అధికారుల కమిటీ ఛార్జీల పెంపుపై సెప్టెంబర్ నెలలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. తాజాగా ఈ ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలపగా, రవాణా శాఖ ఉత్తర్వులు జారీచేసింది.

ఇబ్రహీంపట్నం వాసవి రెసిడెన్షియల్ కళాశాలలో మహాత్మాగాంధీ జయంతి వేడుకలు

- గాంధీజీ ఆశయాలు యువతకు స్ఫూర్తిదాయకం.
- కళాశాల చైర్మన్ మాదారం రమేష్ గౌడ్

ఇబ్రహీంపట్నం వెలుతురు అక్టోబర్ 02:
ఇబ్రహీంపట్నం వాసవి రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో జాతిపిత మహాత్మాగాంధీ జయం తి వేడుకలను ఘనంగా నిర్వహించారు కళాశాల చైర్మన్ మాదారం రమేష్ గౌడ్ మహాత్మా గాం ధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స త్యం అహింసశాంతి నైతిక విలువలను ప్రపంచానికి చాటిచెప్పిన మహాత్మా గాంధీ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని అన్నారు విద్యార్థులు గాంధీజీ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని క్రమశిక్షణ సేవాభావం దేశభక్తి నైతిక విలువలను జీవితంలో అలవర్చుకోవాలని రమేష్ గౌడ్ పిలుపు నిచ్చారు యువత బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదిగి సమాజ అభివృద్ధికి తమవంతు కృ షి చేయాలని సూచించారు కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు సిబ్బంది విద్యార్థులు పాల్గొ ని మహాత్మాగాంధీకి ఘన నివాళులు అర్పించారు

గ్రామ స్వరాజ్యమే గాంధీజీ కల

- ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి
- మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, మున్సిపల్ చైర్పర్సన్
- గాంధీజీ ఆశయాలను నిత్య జీవితంలో ఆచరించడమే ఆయనకు ఇచ్చే నిజమైన గౌరవం: చిలువేరు సమ్మయ్య గౌడ్

కేసముద్రం వెలుతురు, అక్టోబర్ 02: స్వాతంత్ర్య సమరంలో సత్యం, అహింస అనే ఆయుధాలతో దేశ ప్రజలను ఏకం చేసి, భారతదేశానికి స్వేచ్ఛా స్ఫూర్తిని అందించిన జాతిపిత మహాత్మా గాంధీ లి157వ జయంతిలి వేడుకలను కేసముద్రం మండల కేంద్రంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. కేసముద్రం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లిచిలువేరు సమ్మయ్య గౌడ్లి ఆధ్వర్యంలో గాంధీ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో స్థానిక నేతలు, కార్యకర్తలు భారీగా పాల్గొని గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమానికి మార్కెట్ కమిటీ చైర్మన్ లిగంట సంజీవరెడ్డిలి ముఖ్యఅతిథిగా హాజరై గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీజీ పోషించిన చారిత్రక పాత్రను, ఆయన అందించిన అమూల్యమైన సేవలను నాయకులు స్మరించుకున్నారు.

ప్రజల కోసం రాజకీయాలు.. పదవుల కోసం కాదు: చిలువేరు సమ్మయ్య గౌడ్

ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిలువేరు సమ్మయ్య గౌడ్ మాట్లాడుతూ --- "గాంధీజీ దృష్టిలో రాజకీయాలు అంటే పదవులు, అధికారం కావు; అది ప్రజా సేవకు ఒక పరమ పవిత్రమైన సాధనం. సమాజంలో చివరి వరుసలో ఉన్న పేదవాడి కన్నీరు తుడవడమే నిజమైన ప్రజాసేవ అని గాంధీజీ తన జీవితాంతం ఆచరించి చూపారు. సత్యం, అహింస, సేవ అనే మూడు మూలస్తంభాలను ప్రతి ఒక్కరూ తమ జీవితంలో భాగం చేసుకోవాలి. గాంధీజీ ఆశయాలను కేవలం జయంతి రోజున స్మరించుకోవడంతో సరిపెట్టకుండా, మన నిత్య జీవితంలో ఆచరణలో పెట్టడమే ఆయనకు మనం ఇచ్చే అసలైన నివాళి, గౌరవం" అని పిలుపునిచ్చారు.

గ్రామ స్వరాజ్యమే గాంధీజీ స్వప్నం: మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి

ముఖ్యఅతిథి, మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి మాట్లాడుతూ --- "భారతదేశ ఆత్మ గ్రామాలేనని గాంధీజీ బలంగా విశ్వసించారు. ప్రతి గ్రామం స్వయం సమృద్ధి సాధించి ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. స్థానిక సమస్యలను స్థానిక ప్రజలే పరిష్కరించుకునేలా గ్రామ పంచాయతీలకు పూర్తి అధికారాలు ఉండాలన్నదే గాంధీజీ కల. సమాజంలో అత్యంత వెనుకబడిన చివరి వ్యక్తికి సైతం నిర్ణయాధికారంలో భాగస్వామ్యం లభించినప్పుడే ప్రజాస్వామ్యానికి నిజమైన అర్థం, సార్థకత చేకూరుతాయి" అని స్పష్టం చేశారు. గాంధీజీ కేవలం ఒక వ్యక్తి మాత్రమే కాదని.. ఆయనొక మహత్తర ఆలోచన, సిద్ధాంతం, నిత్య స్ఫూర్తి అని ఈ సందర్భంగా పలువురు వక్తలు కొనియాడారు. ఆయన చూపిన సత్యం, అహింస, స్వచ్ఛత, సేవ, గ్రామ స్వరాజ్య మార్గాలు నేటి ఆధునిక సమాజానికి కూడా అత్యంత ఆవశ్యకమని పేర్కొన్నారు. పదవులు కోరని పావ-నమూర్తిగా, కోట్లాది ప్రజల హృదయాలను గెలుచుకున్న మహనీయుడిగా గాంధీజీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని చెప్పారు. గాంధీజీని కేవలం విగ్రహాల్లో చూడటం కాకుండా, ఆయన ఆశయాలను మన ఆచరణలో చూపించడమే లి157వ జయంతిలి సందర్భంగా ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు ఏకగ్రీవంగా స్పష్టం చేశారు. గుగులోత్ దస్రునాయక్, వైస్ చైర్మన్ అంబటి మహేందర్ రెడ్డి, =-రూ మెంబెర్ రావుల మురళీ,కౌన్సిలర్లు తరాల వీరేష్,కిషోర్ నాయక్, భద్యానాయక్,రాంబాబు,రడం వెంకన్న,రడం శ్రీనివాస్,బానోత్ లక్ష్మి బాలు,కొత్త ప్రభాకర్,ఆయూబ్ ఖాన్,దామరకొండ ప్రవీణ్, సామల నర్సయ్య,ముదిగిరి సాంబయ్య,వోలం రమేష్,వోలం రాజు,వోలం మురళీ,మార్కెట్ డైరెక్టర్ యాదగిరి,మాజీ ఎంపీటీసీ బాలు నాయక్,మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ గౌడ్, ఎండీ రఫి,పోకల శ్రీనివాస్,సుధాకర్, శ్రీహరి,రాజేష్, రాపోలు శ్రీనివాస్,పార్వతి, ప్రభురాని,ధనలక్ష్మి,పాస్టర్ వీరన్న, లక్ష్మన్ నాయక్,మిట్టగడుపుల యాకుబ్,నాగేంద్ర చారి, వెంకన్న గౌడ్,రియాజ్, ముజ్జు, రషీద్ ఇంకా మండలంలోని వివిధ గ్రామాల పార్టీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు,పార్టీ అనుబంధ సంఘాల నాయకులు,పార్టీ అభిమానులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, చీూఖ×నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

సంతోషిమాత ఆలయంపై

దాడిని తీవ్రంగా ఖండించిన బీజేపీ

- నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలి
- బీజేపీ న్యాల్కల్ మండల అధ్యక్షుడు మల్లేష్ గంగ్వార్

జహీరాబాద్, వెలుతురు అక్టోబర్ 02: దిల్‌సుఖ్‌నగర్‌లోని సంతోషిమాత ఆలయంపై దాడి జరిగినట్లు వస్తున్న వార్తలను సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం న్యాల్కల్ మండల బీజేపీ అధ్యక్షుడు మల్లేష్ గంగ్వార్ తీవ్రంగా ఖండించారు. శుక్రవారం సాయంత్రం న్యాల్కల్ మండలం గంగ్వార్ చౌరస్తా వద్ద ఆయన ఈ ఘటనపై స్పందించారు. ఈ సందర్భంగా మల్లేష్ గంగ్వార్ మాట్లాడుతూ.. ఆలయంపై దాడి ఘటన భక్తుల మనోభావాలను తీవ్రంగా కలచివేసిందన్నారు. ఆలయాలపై దాడులు,

ప్రజల మత విశ్వాసాలను కించపరిచే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించరాదని అన్నారు. ఘటనపై పోలీసులు తక్షణమే స్పందించి సమగ్రంగా, నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఘటనకు బాధ్యులైన వారిని ఆధారాలతో గుర్తించి, సంబంధిత చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని కోరారు. నిందితులకు న్యాయస్థానం ద్వారా కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని, పోలీసు శాఖను డిమాండ్ చేశారు. అలాగే ఆలయానికి, భక్తులకు తగిన భద్రత కల్పించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా మతపరమైన ప్రదేశాల వద్ద పోలీసు భద్రతను పెంచాలని కోరారు. మతపరమైన ప్రదేశాలపై దాడులను ప్రభుత్వం, పోలీసు శాఖ తీవ్రంగా పరిగణించాలని మల్లేష్ గంగ్వార్ అన్నారు. ప్రజలు ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా శాంతియుతంగా నిరసన తెలియజేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

దేవాలయాల్లో చోరీ

కేసును ఛేదించిన పోలీసులు

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 02 : దేవాలయాల్లో చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ ఆమనగల్లు పోలీసులు అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి సుమారు రూ. 1.65 లక్షల విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. విట్టాయిపల్లి గ్రామ సమీపంలోని హనుమాన్, పెద్దమ్మ దేవాలయాల్లో జరిగిన చోరీలపై కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతిక ఆధారాలు, క్లూస్ టీమ్, ఫింగర్ ప్రింట్ విభాగం సహకారంతో దర్యాప్తు చేపట్టారు. నాగర్ కర్నూల్ జిల్లా గంటరావుపల్లి గ్రామానికి చెందిన పెద్దముక్కల ఈశ్వర్ ను పోలీసులు అరెస్ట్ చేశారు. విచారణలో పెద్దకొత్తపల్లి, పానగల్లు, గంటరావుపల్లి, కందుకూరు ప్రాంతాల్లో జరిగిన ఇతర దేవాలయ చోరీల్లో కూడా అతని ప్రమేయం ఉన్నట్లు వెల్లడయ్యిందని తెలిపారు. నిందితుడి వద్ద నుంచి వెండి వస్తువులు, ఇత్తడి దీపాలు, గంటలు, రాగి పాత్రలు, బంగారు పూత వస్తువు, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు.

నేడు రైతు నేస్తంలో పాల్గొని విత్తనాలు పంపిణీని ప్రారంభించనున్న మంత్రి తుమ్మల

హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 02: రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నేడు పాల్గొని, రబీ 2026-27 సీజన్‌కు సంబంధించి నూనెగింజలు, పప్పుధాన్యాల పంటల విత్తన పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. రాష్ట్రంలో నూనె గింజలు, పప్పుధాన్యాల సాగు విస్తీర్ణం మరియు ఉత్పత్తిని పెంచడంతో పాటు రైతులకు నాణ్యమైన ధృవీకరించబడిన విత్తనాలను సబ్సిడీపై అందుబాటులోకి తీసుకురావడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం.

నూనెగింజల విత్తన పంపిణీ

దేశంలో తినదగిన నూనెల దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి, దేశీయ నూనెగింజల ఉత్పత్తిని పెంచడం, ఆత్మనిర్భరత సాధించడం, రైతుల ఆదాయాన్ని మెరుగుపరచడం లక్ష్యంగా జాతీయ తినదగిన నూనెలు--నూనెగింజల మిషన్ పథకాన్ని అమలు చేస్తున్నారు. 2026-27 సంవత్సరానికి చీవీజుూ-రూూ పథకం కింద మొత్తం రూ. 49.35 కోట్ల నిధులు కేటాయించగా, అందులో రూ. 34.55 కోట్ల మదర్ సాంక్షన్ రాష్ట్రానికి విడుదలైంది. ఇందులో కేంద్ర వాటా రూ. 21.33 కోట్లు, రాష్ట్ర వాటా రూ. 13.22 కోట్లు ఉన్నాయి. ఈ పథకం కింద వాల్యూ చైన్ క్లస్టర్లు (ఎజజం) ద్వారా ధృవీకరించబడిన విత్తనాల పంపిణీ, బ్లాక్ స్థాయి ప్రదర్శనలు, రైతులకు శిక్షణ, మట్టి నమూనాల సేకరణ, కృషిమ్యాపర్ సహాయం, నిర్వహణ మరియు అవగాహన కార్యక్రమాలు, బ్రీడర్ విత్తనాల కొనుగోలు, పంట అనంతర మౌలిక వసతుల మద్దతు కింద ఆయిల్ మిల్లుల ఏర్పాటు వంటి కార్యక్రమాలను చేపట్టనున్నారు.

గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం

ఆదిలాబాద్ వెలుతురు అక్టోబర్ 02: ఆదిలాబాద్ రూరల్ మండలంలోని గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని పలు గిరిజన గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే, ాణఖీ నిధులతో చేపట్టనున్న కమ్యూనిటీ షెడ్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. చించుఘాట్, పందిరిలోద్ది, అంకాపూర్, లోహారా, టిప్పా గ్రామాల్లో రూ. 5 లక్షల చొప్పున, హట్టిగుట్టలో రూ. 5 లక్షలు, లింగుగూడలో రూ. 25 లక్షలు కలిపి మొత్తం రూ. 55 లక్షల విలువైన అభివృద్ధి పనులకు భూమిపూజ చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. గిరిజన ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు రహదారులు, విద్యుత్, తాగునీరు తదితర మౌలిక వసతులను దశలవారీగా కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఇటీవల ఏర్పాటైన గిరిజన కాలనీల్లో విద్యుత్ కనెక్షన్లు, ఇతర ప్రాథమిక సదుపాయాలు పూర్తిస్థాయిలో అందుబాటులో లేని ప్రాంతాలకు త్వరలోనే అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. గిరిజన యువతకు నైపుణ్యాభివృద్ధి ఎంతో కీలకమని పేర్కొన్న ఎమ్మెల్యే, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాల్లో శిక్షణ అందించి, ఆదిలాబాద్‌లో రానున్న పారిశ్రామిక అభివృద్ధిలో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాలు, మౌలిక సదుపాయాల కల్పన కోసం తన వంతు కృషి నిరంతరం కొనసాగుతుందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు దయాకర్ నాయకులు కార్తీక్ విశాల్ ముకుంద. విట్టల్ ముకుంద. గ్రామ పటేళ్లు సర్పంచ్లు తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ.. మళ్లీ ఉక్కిరిబిక్కిరి

- అక్టోబర్ ఆరంభంలోనే పెరిగిన వాయు కాలుష్యం
- గాలి నాణ్యత సూచీ 166కు చేరిక.. ముందున్నది కాలుష్య సీజన్!
- సెప్టెంబర్‌లో ఉపశమనం.. అక్టోబర్‌లో మళ్లీ కాలుష్య ఛాయలు



న్యూఢిల్లీ, వెలుతురు అక్టోబర్ 2: దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం మళ్లీ క్రమంగా పెరుగుతోంది. వర్షాలు, అనుకూల వాతావరణ పరిస్థితులతో సెప్టెంబర్‌లో కొంతకాలం స్వచ్ఛమైన గాలిని పీల్చిన ఢిల్లీ వాసులకు అక్టోబర్ ప్రారంభం నుంచే పరిస్థితులు మారుతున్నాయి. అక్టోబర్ 1న ఢిల్లీలో సగటు గాలి నాణ్యత సూచీ 166గా నమోదైంది. ఇది 'మోస్తరు' స్థాయిలో ఉన్నప్పటికీ.. అంతకు ముందు రోజు నమోదైన 129తో పోలిస్తే కాలుష్యం గణనీయంగా పెరిగింది. అంతకుముందు వరుసగా కొన్ని రోజుల పాటు ఢిల్లీలో గాలి నాణ్యత 'సంతృప్తికర' స్థాయిలో ఉండటం గమనార్హం. ప్రస్తుతం నగరంలో పది మైక్రాన్ల కంటే తక్కువ పరిమాణం కలిగిన సూక్ష్మ ధూళికణాలు ప్రధాన కాలుష్య కారకాలుగా ఉన్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. అక్టోబర్ మొదటి రోజున నమోదైన 166 గాలి నాణ్యత సూచీ.. గత నాలుగేళ్లలో అక్టోబర్ ప్రారంభంలో నమోదైన అత్యధిక స్థాయిగా నమోదైంది. కొన్ని ప్రాంతాల్లో పరిస్థితి మరింత అధ్వానంగా ఉంది. ఐఐటీ ఢిల్లీ వద్ద గాలి నాణ్యత సూచీ 248, జహంగీర్‌పురిలో 218, ద్వారక సెక్టార్-8లో 214, నరేలాలో 205 వరకు నమోదైంది. ఈ ప్రాంతాల్లో గాలి నాణ్యత 'కాలుష్యభరిత' స్థాయికి చేరింది. తక్కువ వేగంతో వీచే గాలులు కాలుష్యకారకాలు వాతావరణంలో పేరుకుపోవడానికి కారణమవుతున్నాయి.

వాహనాలు, దుమ్ము, నిర్మాణ పనులే ప్రధాన కారణాలు

ఢిల్లీ కాలుష్యానికి ఒకే ఒక్క కారణం లేదని నిపుణులు చెబుతున్నారు. వాహనాల నుంచి వెలువడే పొగ, రోడ్లపై పేరుకుపోయే దుమ్ము, నిర్మాణాలు, కూల్చివేతల నుంచి వెలువడే సూక్ష్మ ధూళికణాలు, పరిశ్రమల నుంచి వెలువడే పొగ, బహిరంగంగా చెత్తను కాల్చడం వంటి అనేక అంశాలు గాలి నాణ్యతను ప్రభావితం చేస్తున్నాయి. శీతాకాలం సమీపించే కొద్దీ పొరుగు రాష్ట్రాల్లో పంట వ్యర్థాలను కాల్చడం కూడా ఢిల్లీ--ఎన్‌సీఆర్ ప్రాంత గాలిపై ప్రభావం చూపే అంశంగా మారుతుంది. గాలి వేగం తగ్గడం, వాతావరణ పరిస్థితుల కారణంగా కాలుష్యకారకాలు చెదరిపోకుండా ఒకే ప్రాంతంలో నిలిచిపోవడం సమస్యను మరింత తీవ్రతరం చేస్తుంది. ప్రతి ఏడాది అక్టోబర్ నుంచి శీతాకాలం వరకు ఢిల్లీలో కాలుష్య సమస్య తీవ్రమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. చల్లటి వాతావరణం, తక్కువ గాలి వేగం, ఉష్ణోగ్రతల్లో మార్పులు వంటి వాతావరణ అంశాలతోపాటు ప్రాంతీయ కాలుష్య ఉద్గారాలు కలిసినప్పుడు నగరంపై పొగమంచు ముసురు కమ్ముకునే ప్రమాదం ఉంటుంది.

కాలుష్య నియంత్రణకు ముందస్తు చర్యలు

కాలుష్యాన్ని కేవలం శీతాకాలంలో అత్యవసర చర్యలతో ఎదుర్కొనే విధానానికి బదులుగా ఏడాది పొడవునా నియంత్రణ చర్యలు చేపట్టే దిశగా ఢిల్లీ ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. వాహన కాలుష్య నియంత్రణ, రోడ్లపై దుమ్ము తగ్గింపు, చెత్త దహనంపై నిఘా, నిర్మాణ ప్రాంతాల్లో కాలుష్య నియంత్రణ, ప్రజా రవాణా ప్రోత్సాహం, పచ్చదనం పెంపు వంటి చర్యలకు ప్రాధాన్యం ఇస్తోంది. కాలుష్య మూలాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు సమీకృత నియంత్రణ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఇందులో కృత్రిమ మేధ, నిఘా కెమెరాలు, గాలి నాణ్యత గణాంకాలు, రోడ్డు శుభ్రత వాహనాల స్థాన నిర్ధారణ వ్యవస్థ వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించనున్నారు. నిర్మాణ ప్రాంతాలపైనా ప్రత్యేక నిఘా పెట్టనున్నారు.

వాహన కాలుష్యాన్ని తగ్గించేందుకు అక్టోబర్ 1 నుంచి చెల్లుబాటు అయ్యే కాలుష్య నియంత్రణ ధ్రువపత్రం లేని వాహనాలపై ప్రత్యేక తనిఖీలు ప్రారంభించారు. వాహనాల నుంచి వెలువడే పొగ నియంత్రణతోపాటు వాహన కాలుష్య పరీక్షా కేంద్రాల సామర్థ్యాన్ని పెంచే చర్యలు కూడా చేపడుతున్నారు. ముందున్నది ఢిల్లీకి కీలకమైన కాలుష్య కాలం. ప్రస్తుతం గాలి నాణ్యత సూచీ 166 వద్ద 'మోస్తరు' స్థాయిలో ఉన్నప్పటికీ.. అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలల్లో వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా మారితే కాలుష్యం వేగంగా పెరిగే అవకాశం ఉంది. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని వాహనాల నుంచి వెలువడే పొగ, రోడ్డు దుమ్ము, నిర్మాణ వ్యర్థాలు, చెత్త దహనం, పంట వ్యర్థాల దహనంపై సమన్వయంతో చర్యలు తీసుకోవడం కీలకంగా మారింది. ఢిల్లీ గాలి నాణ్యత మరోసారి ప్రమాదకర స్థాయికి చేరకుండా ముందస్తు నియంత్రణ చర్యలు చేపట్టడం అధికారులకు ప్రధాన సవాలుగా మారింది.

అదిరిన పంచ్..

బాక్సర్ లవ్లీనాకు స్వర్ణం

నగోయా, వెలుతురు అక్టోబర్ 02: బాక్సర్ లవ్లీనా బోర్గహెయిన్ చరిత్ర సృష్టించింది. ఏషియన్ గేమ్స్‌లో స్వర్ణం సాధించింది. మహిళల 75 కేజీల విభాగం ఫైనల్ బౌట్‌లో ఆమె చైనా ప్రత్యర్థి బావో జియిపై 5-0 తేడాతో విజయం నమోదు చేసింది. ఇవాళ బాక్సర్ లవ్లీనా పుట్టిన రోజు. అయితే బర్త్‌డే రోజునే ఆమె గోల్డ్ మెడల్ కొట్టడం గమనార్హం. ఒలింపిక్ పతక విజేత లవ్లీనా.. ఏషియన్ గేమ్స్‌లో తొలిసారి స్వర్ణ పతకాన్ని గెలుచుకున్నది. ఏషియన్ గేమ్స్‌లో స్వర్ణం సాధించిన రెండో భారత మహిళా బాక్సర్‌గా లవ్లీనా చరిత్ర సృష్టించింది. గతంలో లెజెండరీ బాక్సర్ కేసీ మేరీకోమ్ స్వర్ణం గెలుచుకున్నది. 2014లో ఇంచియాన్‌లో జరిగిన ఏషియన్ గేమ్స్ 51 కేజీల ఫ్లైవెయిట్ కేటగిరీలో ఆమె ఆ పతకాన్ని సాధించింది. ఏషియన్ గేమ్స్‌లో 13వ రోజు భారత్‌కు పతకాల జోరు మొదలైంది. లవ్లీనా గోల్డ్ సాధించడంతో.. ఈ గేమ్స్‌లో భారత్ గెలిచిన స్వర్ణ పతకాల సంఖ్య 12కు చేరింది. ఇవాళ మహిళల రికర్వ్ ఆర్చరీ జట్టు గోల్డ్ కొట్టింది. ఇక రికర్వ్ మిక్స్‌డ్ టీమ్‌లో భారత జట్టుకు సిల్వర్ మెడల్ వచ్చింది.

ప్రస్తుతానికి 70 పతకాలు గెలిచిన భారత్ .. మెడల్స్ ట్యాలీలో ఆరో స్థానంలో నిలిచింది. భారత్ ఇప్పటి వరకు 12 స్వర్ణాలు, 24 రజతం, 35 కాంస్య పతకాలను గెలుచుకున్నది.

కళ్యాణలక్ష్మీ లబ్దిదారులకు

ఎంపీ వద్దిరాజు శుభాకాంక్షలు

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 02 : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్ర శేఖర రావు సుపరిపాలనకు కళ్యాణలక్ష్మీ పథకం ఒక ప్రబల నిదర్శనం అని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర చెప్పారు. తెలంగాణ ఉద్యమం కొనసాగుతున్న సమయంలో కేసీఆర్ ఒక తండాలో స్వయంగా చూసిన ఒక సంఘటనకు ఈ పథకం మూలం అని ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు. పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు 1,00,116 రూపాయల చొప్పున కానుకగా అందించాలన్న ఆలోచన కేసీఆర్‌కు వచ్చిందన్నారు. ఆడబిడ్డ పెళ్లి సమయంలో తల్లిదండ్రుల మీద ఆర్థిక భారం తగ్గించేందుకు కళ్యాణలక్ష్మీతో పాటు షాదీ ముభారక్ పథకాలు ఎంతగానో ఉపయోగపడ్డాయని, బాల్య వివాహాలు కూడా తగ్గాయని ఎంపీ రవిచంద్ర వివరించారు. కేసీఆర్ మానవీయ దృక్కోణం నుంచి వచ్చిన కళ్యాణ లక్ష్మీ,షాదీ ముభారక్ పథకాల ద్వారా 16 లక్షల 78వేల పేదింటి ఆడబిడ్డలు,వారి కుటుంబా లకు మేలు జరిగిందని ఆయన తెలిపారు. కాంగ్రెస్ పాల నలో కళ్యాణలక్ష్మీ పథకం పూర్తిగా నిర్లక్ష్యానికి గురి కావడం తీవ్ర విచారకరమని ఎంపీ రవిచంద్ర చెప్పారు. ఈ పథకాల అమలుతో పాటు ఇస్తానన్న తులం బంగారం ఊసే లేకుండా పోయిందన్నారు. కళ్యాణలక్ష్మీ అమలులోకి వచ్చి శుక్రవారంతో 12 ఏళ్లు నిండిన శుభ సందర్భంగా వాటి లబ్ధిదారులకు ఎంపీ వద్దిరాజు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

పట్టాలెక్కనున్న మరో వందేభారత్ స్లీపర్..!

- బెంగళూరు-ముంబై మధ్య కొత్త సర్వీసు ఈ నెలలోనే ప్రారంభించే యోచనలో రైల్వే శాఖ
- సుమారు 16 గంటల్లో గమ్యస్థానం.. ఆరు రోజులు రాకపోకలు

బెంగళూరు, వెలుతురు అక్టోబర్ 2: దేశంలో మరో వందేభారత్ స్లీపర్ రైలు అందుబాటులోకి రానుంది. బెంగళూరు--ముంబై నగరాల మధ్య వందేభారత్ స్లీపర్ రైలు సర్వీసును ఈ నెలలో ప్రారంభించేందుకు రైల్వే శాఖ సన్నాహాలు చేస్తోంది. కేఎస్ఆర్ బెంగళూరు--ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినస్ (ముంబై) మధ్య ఈ రైలు రాకపోకలు సాగించనుంది. రైల్వే బోర్డు ఈ సర్వీసును ఆమోదించినప్పటికీ ప్రారంభ తేదీపై తుది ప్రకటన ఇంకా వెలువడాల్సి ఉంది.

16 గంటల్లోనే ప్రయాణం

ప్రతిపాదిత షెడ్యూల్ ప్రకారం బెంగళూరు నుంచి రాత్రి 10 గంటలకు బయలుదేరే రైలు మరుసటి రోజు మధ్యాహ్నం 1.50 గంటలకు ముంబై చేరుకునే అవకాశం ఉంది. తిరుగు ప్రయాణంలో ముంబై నుంచి రాత్రి 10.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 2.50 గంటలకు బెంగళూరు చేరుకునేలా ప్రణాళిక రూపొందించారు. మొత్తం ప్రయాణ సమయం సుమారు 16 గంటలుగా ఉండనుంది. అయితే తుది సమయాల్లో మార్పులు ఉండొచ్చని రైల్వే వర్గాలు తెలిపాయి.

ఏడు ప్రాంతాల్లో నిలుపుదల

ఈ సర్వీసుకు అనంతపురం, గుంతకల్, రాయచూర్, కలబురగి, సోలాపూర్, పుణే, కల్యాణ్ ప్రాంతాల్లో నిలుపుదల ప్రతిపాదించారు. వారానికి ఆరు రోజులు రైలు నడిచేలా ప్రణాళిక రూపొందించారు. బెంగళూరు నుంచి బయలుదేరే సర్వీసు సోమవారం, ముంబై నుంచి బయలుదేరే సర్వీసు మంగళవారం ఉండదని ప్రతిపాదిత షెడ్యూల్‌లో పేర్కొన్నారు. ఈ మార్గంలో రెండు వందేభారత్ స్లీపర్ రేక్‌లను వినియోగించనున్నారు. ప్రస్తుతం బెంగళూరు--ముంబై మధ్య నేరుగా నడిచే ప్రధాన రైలు ఉద్యాన్ ఎక్స్‌ప్రెస్. ఇది సుమారు 1,134 కిలోమీటర్ల దూరాన్ని 22 గంటలకు పైగా తీసుకుంటోంది. కొత్త వందేభారత్ స్లీపర్ అందుబాటులోకి వస్తే ఈ రెండు నగరాల మధ్య రాత్రి ప్రయాణానికి వేగవంతమైన ప్రత్యామ్నాయం అందుబాటులోకి రానుంది.

కాంగ్రెస్ తీసేది 'సేవ్ డెమోక్రసీ మార్చ్' కాదు..

ప్యూర్లీ 'సేవ్ డైనాస్టీ మార్చ్' : డా. కె. లక్ష్మణ్

- రాహుల్ గాంధీ, కాంగ్రెస్ వైఖరిపై లక్ష్మణ్ తీవ్ర ఆగ్రహం
- ఓటమి భయంతోనే ఈవీఎంలు, ఎలక్షన్ కమిషన్‌పై పసలేని ఆరోపణలు
- దొంగ ఓట్లను కాపాడుతూ మజ్లిస్‌కు వత్తాసు పలుకుతున్న కాంగ్రెస్
- ఎమర్జెన్సీ చీకటి రోజుల్లో రాజ్యాంగాన్ని కాలరాసిన చరిత్ర కాంగ్రెస్‌దే
- తెలంగాణలో ఎమ్మెల్యేల ఫిరాయింపులపై 'ఆర్ఆర్' రాజ్యాంగం నడుస్తోందా అని సూటి ప్రశ్న

హైదరాబాద్ వెలుతురు 02 అక్టోబర్, 2026: జాతిపిత మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా వారికి ఘనంగా నివాళులర్పిస్తూ, కాంగ్రెస్ పార్టీ మరియు రాహుల్ గాంధీ అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరిపై బీజేపీ రాజ్యసభ సభ్యులు, పార్లమెంటరీ బోర్డు సభ్యులు డా. కె. లక్ష్మణ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్, 'ఇండి' కూటమి చేపట్టిన 'సేవ్ డెమోక్రసీ మార్చ్' అసలు ప్రజాస్వామ్య పరిరక్షణ యాత్ర కాదని, అది కేవలం తమ కుటుంబ వారసత్వాన్ని కాపాడుకోవడానికి చేస్తున్న ప్యూర్లీ 'సేవ్ డైనాస్టీ మార్చ్' అని ఆయన దుయ్యబట్టారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో లక్ష్మణ్ గారు మాట్లాడారు. ప్రజాస్వామిక ఎన్నికల ప్రక్రియలో దేశ ప్రజలు పదే పదే కాంగ్రెస్‌ను ఓడిస్తుంటే వారు జీర్ణించుకోలేకపోతున్నారని డా. లక్ష్మణ్ ఫైర్ అయ్యారు. ప్రధాని నరేంద్ర మోదీ గారి అభివృద్ధి, ప్రజాదరణను ఎదుర్కోలేక, ప్రజల్లోకి వెళ్లి ఓట్లు అడిగే నైతిక ధైర్యం లేకనే 'ఓట్ చోరీ', 'ఈవీఎంల ట్యాంపరింగ్' అంటూ కాంగ్రెస్ నాయకులు రాద్ధాంతం చేస్తున్నారని సూటిగా నిలదీశారు. 'ఆడలేక మద్దెల ఓడు' అన్నట్లుగా కాంగ్రెస్ గెలిచిన కర్ణాటక, తెలంగాణ, కేరళశీలో ప్రజా తీర్పని, ఓడిపోయిన చోట మాత్రం ఈవీఎంలు, ఎన్నికల సంఘం పక్షపాతమంటూ వింత వాదనలు తెరపైకి తేవడం వారి ద్వంద్వ నీతికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. ప్రజలు రెండుసార్లు, మూడుసార్లు తిరుగులేని మెజారిటీతో ఎన్నుకున్న ప్రధాని నరేంద్ర మోదీ గారిని, హోం మంత్రి అమిత్ షా గారిని కాంగ్రెస్ నాయకులు 'దేశద్రోహులు' అంటూ సంబోధించడాన్ని దేశ ప్రజలు తీవ్రంగా అసహ్యించుకుంటున్నారని ఫైర్ అయ్యారు. ఓటర్ల జాబితాలో ఏళ్ల తరబడి తిష్టవేసిన దొంగ ఓట్లు, చనిపోయిన వారి ఓట్లు, డూప్లికేట్ ఓట్లను తొలగించి జాబితాను ప్రక్షాళన (ఎస్ఐఆర్) చేస్తుంటే కాంగ్రెస్ పార్టీకి ఎందుకు అంత కడుపుమంట అని లక్ష్మణ్ నిలదీశారు. ఈ ఓటర్ల ప్రక్షాళన మజ్లిస్ పార్టీకి కంటగింపుగా మారితే, కాంగ్రెస్ పార్టీ వారికి వత్తాసు పలుకుతూ దొంగ ఓట్లను కాపాడే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. అర్హులైన యువ ఓటర్లకు ఓటు హక్కు కల్పించేందుకు ఫారం-6 ద్వారా పారదర్శకంగా ప్రక్రియ జరుగుతోందని, సుప్రీంకోర్టు సైతం ఓటర్ల జాబితా ప్రక్షాళన చట్టబద్ధమైన ప్రక్రియ అని తేల్చిచెప్పినా, కోర్టుల తీర్పులను బేఖాతరు చేస్తూ రోడ్లెక్కి నిరసనలు తెలపడం సిగ్గుచేటన్నారు. ఎన్నికలు అయిపోయాక ఓటర్ల జాబితా ప్రక్షాళన చేయండని కాంగ్రెస్ డిమాండ్ చేయడం అంటే, "రోగి చనిపోయాక ఆపరేషన్ చేయండి" అన్న చందంగా ఉందని తీవ్రంగా మండిపడ్డారు. దొంగ ఓట్లతోనే గెలవాలని కాంగ్రెస్ చూస్తోందని ఆయన ఆరోపించారు. అన్ని పార్టీల బీఎల్ఏల సమక్షంలో నిబంధనల ప్రకారం పరిశీలన జరుగుతుంటే, మైనారిటీల ఓట్లు, పేదల ఓట్లు తొలగిస్తున్నారంటూ కెమెరాల ముందు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్న కాంగ్రెస్ నేతలు, కోర్టుల్లోగానీ, రికార్డుల్లోగానీ ఒక్కటంటే ఒక్క ఆధారం కూడా ఎందుకు సమర్పించలేకపోయారని ప్రశ్నించారు. రాజ్యాంగ విలువల గురించి మాట్లాడే హక్కు కాంగ్రెస్‌కు ఏమాత్రం లేదని లక్ష్మణ్ స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా సవరణ అనేది మోదీ ప్రభుత్వం కొత్తగా తెచ్చింది కాదని, ప్రతి 20 సంవత్సరాలకు రాజ్యాంగబద్ధంగా జరిగే సాధారణ ప్రక్రియ అని గుర్తుచేశారు. ఈసీఐ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ గారి రాజీనామా డిమాండ్ చేస్తూ కూనిరాగాలు తీస్తున్న కాంగ్రెస్ నేతలు తమ గతాన్ని మరిచిపోయారా అని నిలదీశారు. ఎమర్జెన్సీ విధించి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన నల్లటి చరిత్ర నెహ్రూ-గాంధీ కుటుంబానిదని గుర్తుచేశారు. ఆనాడు ఎమర్జెన్సీ సమయంలో ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ కార్యదర్శిగా ఉంటూ అత్యాచారాలు, దౌర్జన్యాలు, బలవంతపు కుటుంబ నియంత్రణలకు కారణమై షా కమిషన్ ద్వారా తీవ్ర అభియోగాలు ఎదుర్కొన్న నవీన్ చావ్లాను, ఇందిరా గాంధీ ఎలక్షన్ కమిషనర్‌గా నియమించిన విషయాన్ని రేవంత్ రెడ్డి, మహేష్ కుమార్ గౌడ్ తెలుసుకోవాలని హితవు పలికారు. నాటి సీఈసీ ఎన్. గోపాలస్వామి స్వయంగా నవీన్ చావ్లాపై 12 అభియోగాలు మోపినా పట్టించుకోని చరిత్ర కాంగ్రెస్‌దని మండిపడ్డారు. న్యాయస్థానం ఇందిరా గాంధీ ఎన్నిక చెల్లదని తీర్పునిస్తే, కోర్టును కాదని పార్లమెంట్ పదవీకాలాన్ని పెంచుకున్న ఘనత కాంగ్రెస్‌ది కాదా అని ప్రశ్నించారు. తెలంగాణలో ప్రజాస్వామ్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అపహాస్యం చేస్తోందని లక్ష్మణ్ ఫైర్ అయ్యారు. బీఆర్ఎస్ పార్టీ గుర్తుపై గెలిచిన ఎమ్మెల్యే కాంగ్రెస్ కండువా కప్పుకుని పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేస్తే, అది పార్టీ ఫిరాయింపు కాదని స్పీకర్ సమర్థించడంపై హైకోర్టు చెంపపెట్టులాంటి తీర్పు ఇచ్చినా కాంగ్రెస్ నేతలకు బుద్ధి రాలేదని మండిపడ్డారు. తెలంగాణలో ఏకంగా 10 మంది ఎమ్మెల్యేలను చేర్చుకుని రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతున్నారని, ఇక్కడ ఏమైనా రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డిలు కలిసి 'ఆర్ఆర్ రాజ్యాంగం' నడుపుతున్నారా అని నిలదీశారు. చేతిలో రాజ్యాంగం పుస్తకం పట్టుకుని తిరిగే రాహుల్ గాంధీకి తెలంగాణలో జరుగుతున్న ఈ రాజ్యాంగ విరుద్ధ చేష్టలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. రాజీవ్ గాంధీ ప్రధానిగా ఉన్న హయాంలోనే బ్యాలెట్ పద్ధతి నుంచి ఈవీఎంలను తీసుకువచ్చారని, నేడు రాహుల్ గాంధీ ఈవీఎంలను వ్యతిరేకించడం అంటే రాజీవ్ గాంధీ నిర్ణయాన్ని తప్పుపట్టడమేనా అని ప్రశ్నించారు. దేశం అంతరిక్ష రంగంలో దూసుకుపోతుంటే, కాంగ్రెస్ మాత్రం మళ్లీ పాత బ్యాలెట్ పేపర్లతో బూత్ క్యాప్చరింగ్, రిగ్గింగ్, దౌర్జన్యాల మాఫియా పద్ధతులను తీసుకురావాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉత్తరప్రదేశ్‌లో పటిష్టమైన శాంతిభద్రతల వల్ల రిగ్గింగ్‌లకు తావులేకుండా పోయిందని, గతంలో బ్యాలెట్ బాక్సులు ఎత్తుకెళ్లడం, తగులబెట్టడం నిత్యకృత్యంగా మారిన పశ్చిమ బెంగాల్‌లో సైతం ఇటీవల ఎన్నికలు ఎంత ప్రశాంతంగా జరిగాయో గమనించాలన్నారు. 1952, 1957, 1962, 1967లలో కాంగ్రెస్ హయాంలోనే ఏకకాలంలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు జరిగాయని, నేడు 'వన్ నేషన్ - వన్ ఎలక్షన్' ద్వారా ప్రజాధనం, సమయం ఆదా అవుతుందంటే రాహుల్ గాంధీ ఎందుకు వ్యతిరేకిస్తున్నారని ప్రశ్నించారు. మొత్తం ప్రపంచం భారతదేశాన్ని 'మదర్ ఆఫ్ డెమోక్రసీ'గా గౌరవిస్తుంటే, విదేశాల్లో భారత ప్రజాస్వామ్యాన్ని కించపరిచేలా రాహుల్ గాంధీ మాట్లాడటం దేశద్రోహ చర్య అని, కాంగ్రెస్ ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు సరైన సమయంలో తగిన గుణపాఠం చెబుతారని డా. కె. లక్ష్మణ్ హెచ్చరించారు.

ఇది పక్కాగా ఉగ్రదాడే..!

- ఫ్లైదుబాయ్ విమాన ఘటనపై ఇజ్రాయెల్
- ఎలాంటి డౌట్ లేదన్న ముంబయిలోని ఇజ్రాయెల్ కాన్సుల్ జనరల్ యానివ్
- ఫ్లైదుబాయ్ హీరో స్మిత్ మచ్చర్‌పై ప్రశంసలు

ముంబై, వెలుతురు అక్టోబర్ 02: దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు వెళ్తున్న ఫ్లైదుబాయ్ విమానాన్ని కూల్చివేయడానికి ప్రయత్నించిన ఘటనను స్పష్టమైన ఉగ్రదాడిగా అభివర్ణించింది ఇజ్రాయెల్?. అందులో ఎలాంటి సందేహం లేదని ముంబయిలోని ఇజ్రాయెల్ కాన్సుల్ జనరల్ యానివ్ రెవాచ్ అన్నారు. ఈ ఘర్షణను విమాన సిబ్బంది మధ్య జరిగిన సాధారణ వివాదంగా చిత్రీకరించడానికి కొన్ని అంతర్జాతీయ మీడియా సంస్థలు చేసిన ప్రయత్నాలను ఆయన తోసిపుచ్చారు. అలాగే ఫ్లైదుబాయ్ కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై ప్రశంసలు కురిపించారు.
దీన్ని పైలట్ల మధ్య జరిగిన గొడవగా చిత్రీకరించొద్దు
"ఫ్లైదుబాయ్ విమానాన్ని కూల్చివేయడానికి ప్రయత్నించిన ఘటన కచ్చితంగా ఒక ఉగ్రవాద దాడే. దీనిపై ఎలాంటి సందేహం లేదా మరో ప్రశ్న లేదు. ఇజ్రాయెల్, ఆ దేశ ప్రజల తరఫున కెప్టెన్ స్మిత్ మచ్చర్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు. ఆయన ప్రదర్శించిన అసాధారణ ధైర్యసాహసాలను గౌరవించాలనుకుంటున్నాం. అందుకే మచ్చర్‌కు వ్యక్తిగతంగా కృతజ్ఞతలు తెలిపేందుకు మేము ఈ రోజు ఒక ప్రజా ప్రచారాన్ని ప్రారంభించాలని అనుకుంటున్నాం. ఇక ఫ్లైదుబాయ్ విమానంలో జరిగిన ఘటనను అంతర్జాతీయ మీడియా, పాశ్చాత్య మీడియా సంస్థలు ఎంతలా వక్రీకరించాయో మనం చూశాం. దాడి చేసిన వ్యక్తి ఒక ముస్లిం అని మనం మర్చిపోకూడదు. అతను కేవలం దాడి చేసిన వ్యక్తి మాత్రమే కాదు, ఒక ఉగ్రవాది కూడా. దీనిని ఒక భారతీయ, ఒమన్ పైలట్ మధ్య జరిగిన గొడవగా చిత్రీకరించడానికి మీడియా ప్రయత్నించొద్దు. అది వాస్తవం కాదు. ఉగ్రవాదాన్ని దాని అసలు పేరుతోనే పిలవాలి." అని యానివ్ రెవాచ్ పేర్కొన్నారు.

మచ్చర్‌ను ఇజ్రాయెల్‌లో సత్కరించాలనుకుంటున్నాం : యానివ్ రెవాచ్

కెప్టెన్ స్మిత్ మచ్చర్ ఆరోగ్య పరిస్థితి గురించి కూడా ముంబయిలోని ఇజ్రాయెల్ కాన్సుల్ జనరల్ యానివ్ రెవాచ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఫ్లైదుబాయ్ హీరో మచ్చర్ చేతులు, మెడకు తీవ్ర గాయాలయ్యాయని తమకు తెలిసిందన్నారు. మచ్చర్?ను ఇప్పటికే యూఏఈలోని ఆస్పత్రికి తరలించారని చెప్పారు. "మాకు యూఏఈపై నమ్మకం ఉంది. ఆ దేశం మచ్చర్‌ను బాగా చూసుకుంటుంది. అన్నింటికంటే ముందు మచ్చర్ త్వరగా కోలుకోవాలి. ఆరోగ్యంగా ఉండాలని మేము ప్రార్థిస్తున్నాం. ఆ తర్వాత ఇజ్రాయెల్‌లో అతడికి ఆతిథ్యం ఇచ్చి, సత్కరించాలనుకుంటున్నాం." అని యానివ్ రెవాచ్ వ్యాఖ్యానించారు. తీవ్రవాదాన్ని రెచ్చగొట్టడానికి.. ఫ్లైదుబాయ్ విమాన సర్వీసుల నిలిపివేతపైనా యానివ్ రెవాచ్ స్పందించారు. ఈ నిర్ణయం ఎలాంటి గందరగోళానికి దారితీయదని అన్నారు. ప్రస్తుతం యూఏఈ, ఇజ్రాయెల్ మధ్య రోజూ 23కిపైగా విమానాలు తిరుగుతున్నాయని చెప్పారు. ఇజ్రాయెల్ గత 80 ఏళ్లుగా అత్యున్నత అప్రమత్తతతో (హైఅలర్ట్) జీవిస్తోందని పేర్కొన్నారు. దశాబ్దాలుగా ఉగ్ర సంస్థలు, కొన్ని పొరుగు ముస్లిం దేశాల నుంచి వచ్చే ముప్పులను ఎదుర్కోవడం ఇజ్రాయెల్‌కు అలవాటేనని వెల్లడించారు. పాకిస్థాన్ ద్వంద్వ ప్రమాణాల ఆట ఆడుతోందన్నారు. ఒకవైపు యుద్ధ ముగింపునకు మధ్యవర్తిత్వం వహించడానికి ప్రయత్నిస్తూ, మరోవైపు తీవ్రవాదాన్ని రెచ్చగొట్టడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కాబట్టి పాక్ ప్రభుత్వంతో చాలా జాగ్రత్తగా ఉండాలని పిలుపునిచ్చారు. మక్కా ఒప్పందం విషయంలో పూర్తిగా విఫలమైనందున పాక్ ఒక విధంగా హడావిడి చేయడానికి ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. సౌదీ అరేబియాలో రోజూ ఏం జరుగుతుందో చూస్తున్నామని తెలిపారు. మక్కాలోని అత్యంత పవిత్ర స్థలాలపై ముస్లిం మిలీషియాలు, హౌతీలు దాడులకు పాల్పడుతున్నారని అన్నారు. అయినా ఆ దాడులకు పాక్ వంటి దేశాలు ఖండించకుండా కపటనీతిని ప్రదర్శిస్తున్నాయని ఎద్దేవా చేశారు.

అమిత్ షా తెలంగాణ పర్యటన ఖరారు

హైదరాబాద్ వెలుతురు 2 అక్టోబర్, 2026: కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి అమిత్ షా అక్టోబర్ 4న తెలంగాణలో పర్యటించనున్నారు. తెలంగాణలో ఏర్పాటు చేస్తున్న ఘుమ్ఘుతీ ఖుఅతీఎ ౧ాతీశీయవష్ భూమిపూజ కార్యక్రమంతో పాటు, ౌఎబశ్రీ సంస్థ రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్న మొట్టమొదటి ఆధునిక ఖుఅతీఎూశ్రీఖుత్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో వారు పాల్గొంటారు. మెదక్ జిల్లా, తూప్రాన్‌లోని ఊర్జీ ఇండస్ట్రియల్ పార్క్‌లో ఉదయం 10 గంటల నుంచి ఈ కార్యక్రమం జరగనుంది. తెలంగాణలో ఖుఅతీఎ ౧ావష్శీతీ అభివృద్ధిలో ఈ ప్రాజెక్టు ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలవనుంది. రాష్ట్రంలో పాడిపరిశ్రమ వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు, వ్యాల్యూ క్రియేషన్ పెంచడం, పాడి రైతులకు మరిన్ని అవకాశాలు కల్పించడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం.
ఈ ప్లాంట్ మొత్తం ఉత్పత్తి సామర్థ్యం:
పాలు : రోజుకు 5 లక్షల లీటర్లు (5LLPD)
పెరుగు: రోజుకు 200 వీవ్‌తీఅఎ౧శీఅవం (200 MTPD)
మజ్జిగ (ప్లేన్, మసాలా), బాటిల్స్ ఇచ్చే ప్రొబయో టిక్
మజ్జిగ: రోజుకు 30 కిలో లీటర్లు (30 KLPD)
లస్సీ (కప్స్/పౌచెస్): రోజుకు 30 Kilo Litres (30 KLPD)
పన్నీరు (థర్మో ప్రాసెసింగ్) : రోజుకు 10 Metric Tonnes (10 MTPD)
ఐస్ క్రీమ్: రోజుకు 50 Kilo Litres (50 KLPD)Ñ దీన్ని రోజుకు 1 లక్ష లీటర్లకు (1.0 LLPD) విస్తరించే అవకాశం
వివిధ రకాల ఫ్రెష్ స్వీట్స్: రోజుకు 3 Metric Ton nes (3MTPD)Ñ దీన్ని రోజుకు 5 Metric Tonnes (5MTPD) వరకు విస్తరించే అవకాశం
బేకరీ ఐటమ్స్ (బ్రెడ్, కుకీస్, రస్క్): రోజుకు 5 Metric Tonnes (5MTPD)
నెయ్యి: రోజుకు 5 Metric Tonnes (5MTPD)
శ్వేత విప్లవం 2.0 అమిత్ షా నాయకత్వంలోని కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ.. 2024 సెప్టెంబర్ 19న శ్వేత విప్లవం 2.0 కార్యక్రమాన్ని ప్రారంభించింది. కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ, కేంద్ర మత్స్యశాఖ, పాడి-పశుసంవర్ధక శాఖలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టాయి. ఈ సహకార విధానం ద్వారా ద్వారా ఇప్పటివరకు Dairy Cooperativవం పరిధిలోకి రాని సంఘాలను, వ్యవస్థలను బలోపేతం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. సహకార సమాఖ్య నెట్‌వర్క్‌ను మరింత విస్తరించడం, పాడి రైతులకు మార్కెట్ ౌఎఎవం పెంచడం, ఉపాధి అవకాశాలు కల్పించడం, మహిళా సాధికారతను ప్రోత్సహించడం వంటి అంశాలపై ఈ శ్వేత విప్లవం 2.0 ప్రధానంగా దృష్టి సారిస్తోంది. దీంతోపాటుగా 2028-29 నాటికి Dairy Cooper a-tives ద్వారా పాల సేకరణను 50% పెంచడం ఈ కార్యక్రమం లక్ష్యం. శ్వేత విప్లవం 2.0లో భాగంగా 2029 నాటికి దేశవ్యాప్తంగా 75,000 కొత్త పాడి సహకార సంఘాలను (చీణజూ) ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇందులో భాగంగా తెలంగాణలో 1,525 కొత్త సహకార సంఘాలను ఏర్పాటు చేయాలన్న లక్ష్యాన్ని నిర్దేశించాం.

సహకార రంగం బలోపేతానికి ప్రత్యేక చర్యలు

దేశవ్యాప్తంగా సహకార రంగాన్ని మరింత బలోపేతం చేయాలన్న విస్తృత లక్ష్యంలో భాగంగానే ఈ చర్యలను చేపడుతున్నాం. సహకార రంగానికి తగిన ప్రాధాన్యత కల్పిస్తూ, ఈ రంగాన్ని మరింత బలోపేతం చేయాలన్న లక్ష్యంతో గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారు 2021 జూలై 6న ప్రత్యేకంగా సహకార మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఈ మంత్రిత్వ శాఖ బాధ్యతలను శ్రీ అమిత్ షా గారు నిర్వహిస్తున్నారు. గత ఐదేళ్లలో ఈ రంగాన్ని బలోపేతం చేసేందుకు అనేక కీలక చర్యలు తీసుకున్నాం. ఇందులో ప్రాథమిక సహకార సంఘాలకు ఆదాయ మార్గా లను పెంచడం ద్వారా వాటిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు మోడల్ నిబంధనలను రూపొందించ డం, నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (చీజణజ) పరిధిని విస్తరించడం, GeM PortalýË సహకార సంఘాలను కొనుగోలుదా రులుగా చేర్చడం, దేశవ్యాప్తంగా సహకార రంగానికి సంబంధించి సమగ్రమైన, విశ్వసనీయమైన, ఎప్పటికప్పుడు National Cooperative Database రూపొందించడం వంటి కీలక చర్యలు ఉన్నాయి.

తెలంగాణకు NCDC నుంచి భారీ మద్దతు

గత 12 ఏళ్లలో National Cooperative Develop ment Corporation (NCDC) ద్వారా తెలంగాణ ప్రభుత్వానికి మొత్తం ?1.16 లక్షల కోట్లు మంజూరు చేశాం.
2025-26 ఖరీఫ్, రబీ సీజన్ (ఖమీా) కలిపి.. ధాన్యం కొనుగోలుకోసం తెలంగాణ ప్రభుత్వానికి చీజణజ ద్వారా ?37,000 కోట్లను విడుదల చేశాం. అదేవిధంగా 2026-27 రబీ సీజన్ కు రాష్ట్ర ప్రభుత్వానికి చీజణజ ?22,700 కోట్ల రుణాన్ని మంజూరు చేసింది. ఇందులో ఇప్పటికే ?1,825 కోట్లు విడుదలయ్యాయి. తెలంగాణకు చీజణజ ద్వారా గతంలో ఏనాడూ అందనంత సహాయం మోదీ ప్రభుత్వంలో అందుతోంది. కేవలం వరి ధాన్యం ౢతీశీఎబతీవఎవత్ కోసమే చీజణజ ఇప్పటివరకు దాదాపు ?60 వేల కోట్లు మంజూరు చేసింది. ఇందులో గత మూడు ౌఝుంశీఅంకు సంబంధించి ?39,186 కోట్లు విడుదల చేసింది.

NCDC పరిధి మరింత విస్తరణ

ఇటీవల పార్లమెంట్ నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ బిల్లును కూడా ఆమోదిం చింది. చీజణజ పరిధిని మరింత విస్తరించడంతో పాటు, ఇప్పటివరకు రిజిస్టర్డ్ కోఆపరేటివ్స్ కు పరిమితమైన ఫండింగ్ అవకాశాలను.. ఇకపై Cooperative Sectorý పనిచేసే ఏ సంస్థకైనా విస్తరించేలా ఈ బిల్లు ద్వారా అవకాశం కల్పించాం. దీనివల్ల తెలంగాణకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది.

యూసీసీ అమలు చేయనున్న గుజరాత్

- చట్టానికి రాష్ట్రపతి ఆమోదం.. దేశంలో రెండో రాష్ట్రం
- గుజరాత్ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్
- వారసత్వపు ఆస్తి హక్కు విషయంలో స్త్రీలు, పురుషులకు సమాన హక్కులు

గాంధీనగర్, వెలుతురు అక్టోబర్ 02 : యూసీసీ (యునిఫాం సివిల్ కోడ్) చట్టాన్ని గుజరాత్ రాష్ట్రం అమలు చేయబోతుంది. దీనిపై గుజరాత్ అసెంబ్లీలో గత మార్చిలో చేసిన తీర్మానాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తాజాగా ఆమోదించారు. దీంతో ఈ చట్టం రాష్ట్రంలో అమలులోకి రానుంది. యూసీసీని అమలు చేయబోతున్న రెండో రాష్ట్రంగా గుజరాత్ నిలవబోతుంది. ఇంతకుముందు మొదటిసారిగా ఉత్తరాఖండ్ ఈ చట్టాన్ని అమలులోకి తీసుకొచ్చింది. ఇప్పుడు గుజరాత్ కూడా ఈ చట్టాన్ని అమలు చేయబోతుంది. ద గుజరాత్ యునిఫాం సివిల్ కోడ్ బిల్, 2026 పేరిట ఈ బిల్లును సీఎం భూపేంద్ర పటేల్ ఆధ్వర్యంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిందది. ఈ మేరకు గుజరాత్ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ కూడా విడుదల చేసింది. దీని ప్రకారం రాష్ట్రంలో ఇకపై వివాహం, సహజీవనం, ఆస్తి పంపకాలు వంటివన్నీ ఈ చట్టం పరిధిలోకి వస్తాయి. ఈ విషయాల్లో కొత్త రూల్స్ అమలవుతాయి.

యూసీసీ ప్రకారం చట్టంలో రానున్న కీలక మార్పులివే..

గిరిజన తెగలకు మినహా అందరికీ ఈ చట్టం వర్తిస్తుంది. ఈ చట్టం ప్రకారం వారసత్వపు ఆస్తి హక్కు విషయంలో స్త్రీలు, పురుషులకు సమాన హక్కులుంటాయి. అంటే, కొడుకుకైనా, కూతురుకైనా ఆస్తి విషయంలో సమాన హక్కు ఉంటుంది. ఎవరైనా సహజీవనం చేస్తే ఇకపై రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందే. అలా చేయకుండా సహజీవనాన్ని కొనసాగించినా కూడా నేరమే. పెళ్లిళ్లతో సమానంగా సహజీవనాన్ని కూడా నమోదు చేసుకోవాల్సిందే. విడాకులు కూడా చట్టబద్ధంగా జరగాల్సిందే. సహజీవనం విషయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కీలకంగా చెప్పుకోవాలి. తాము సహజీవనానికి వ్యతిరేకం కాదని సీఎం భూపేష్ పటేల్ చెప్పారు. అయితే, ఈ విషయంలో మహిళల హక్కులకు ప్రాధాన్యం ఇస్తామని, అందువల్లే సహజీవనానికి కూడా రిజిస్ట్రేషన్ చేసుకునేలా చట్టం తెచ్చామన్నారు. రాష్ట్రంలో మహిళలు అందరికీ సమాన హక్కులు ఉంటాయని, మత పరంగా ఎలాంటి మినహాయింపు ఉండదని సీఎం అన్నారు. అన్ని మతాలవారికి సమానంగా యూసీసీ చట్టం వర్తిస్తుందన్నారు.

జాతీయ స్థాయిలో ప్రీతి సత్తా

- 'మిస్ ఎర్త్ వాటర్ ఇండియా-2026' ప్రధాన టైటిల్‌ను కైవసం
- గతంలో 'మిస్ హైదరాబాద్ రన్నరప్'

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 02 : తెలంగాణకు చెందిన యువ మోడల్ ప్రీతి ముండే జాతీయ స్థాయి అందాల పోటీల్లో సత్తా చాటారు. జైపూర్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో తెలంగాణ తరఫున ప్రాతినిధ్యం వహించిన ఆమె 'మిస్ ఎర్త్ వాటర్ ఇండియా-2026' ప్రధాన టైటిల్‌ను కైవసం చేసుకున్నారు. అలాగే పోటీదారులతో స్నేహపూర్వకంగా మెలిగినందుకు 'మిస్ కంజీనియాలిటీ-2026' టైటిల్‌ను కూడా సాధించారు. పోటీలో వివిధ రౌండ్లలో ప్రీతి తన ప్రతిభ, ఆత్మవిశ్వాసం, వ్యక్తిత్వంతో న్యాయనిర్ణేతలను ఆకట్టుకున్నారు. జాతీయ స్థాయిలో రెండు ప్రతిష్టాత్మక టైటిళ్లు సాధించడం పట్ల ఆమె కుటుంబసభ్యులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు అభినందనలు తెలిపారు. గతంలో 'మిస్ హైదరా బాద్ రన్నరప్', 'మిస్ మహారాష్ట్ర--బ్రెయిన్ విత్ బ్యూటీ' అవార్డులను గెలుచుకున్న ప్రీతి, ఇటీవల మిస్ యూనివర్స్ తెలంగాణ-2026 పోటీల్లో టాప్-15 ఫైనలిస్ట్‌గా నిలిచారు. తాజా విజయంతో తన ఖాతాలో మరో రెండు ప్రతిష్టాత్మక టైటిళ్లను చేర్చుకున్నారు. మోడలింగ్, ఫ్యాషన్ రంగంలో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవడమే తన లక్ష్యమని ప్రీతి తెలిపారు. భవిష్యత్‌లో అంతర్జాతీయ స్థాయి పోటీల్లోనూ పాల్గొని, తెలంగాణకు మరింత గుర్తింపు తీసుకురావాలని ఆమె కోరుకుంటున్నారు.

రెండేళ్లలోనే 64 శాతం పతనం!

- రూ.310 నుంచి రూ.111కు కుప్పకూలిన ప్రభుత్వ కంపెనీ షేరు
- ఆల్‌టైమ్ హై నుంచి భారీ పతనం.. 52 వారాల కనిష్ఠానికి చేరువలో స్టాక్
- ఐపీఓ ధర మాత్రం రూ.32.. ఇప్పటికీ 247 శాతం లాభంలోనే షేరు
- టాప్ మేనేజ్‌మెంట్‌పై కేంద్రం కీలక నిర్ణయం.. అనిశ్చితిలో ఇన్వెస్టర్లు
- వార్షిక ఫలితాలు బాగున్నా.. త్రైమాసిక గణాంకాలతో పెరుగుతున్న ఒత్తిడి



ముంబై, వెలుతురు, అక్టోబర్ 02 : స్టాక్ మార్కెట్లలో ఎప్పుడు ఏం జరుగుతుందో ముందుగానే చెప్పడం కష్టం. ఎన్నో అంశాలు స్టాక్ మార్కెట్లను ప్రభావితం చేస్తుంటాయి. ఇక భారత స్టాక్ మార్కెట్లు మాత్రం గత కొంత కాలంగా భారీగా నష్టపోతున్నాయి. గతేడాది జనవరిలో అమెరికా అధ్యక్షుడిగా మళ్లీ డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి చూస్తే దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు తీవ్ర ఒడుదొడుకులకు గురయ్యాయి. లాభనష్టాల మధ్య ఊగిసలాడుతూనే ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉద్రిక్త పరిస్థితులు, పలు దేశాల మధ్య యుద్ధాలు, ట్రంప్ సుంకాలు, పెరుగుతున్న క్రూడాయిల్ ధరలు, ద్రవ్యోల్బణం వంటివి స్టాక్ మార్కెట్లను పడేస్తున్నాయి. ఇక గత 7-8 వారాలుగా కూడా అమెరికా- ఇరాన్ ఉద్రిక్తతలు తీవ్రమవుతుండటం, క్రూడాయిల్ ధరలు పెరుగుతుండటం, యూఎస్ ఫెడ్ కీలక వడ్డీ రేట్లను పెంచే అంచనాలు ఉండటం వల్ల స్టాక్ మార్కెట్లలో పతనం కనిపిస్తూనే ఉంది. దీంతో మార్కెట్ల పతనం నేపథ్యంలో పెద్ద పెద్ద కంపెనీల స్టాక్స్ కూడా కుదేలవుతున్నాయి. ఇక మిగతా స్టాక్స్ సంగతి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఈ క్రమంలోనే పునరుత్పాదక ఇంధన రంగానికి రుణాలు అందించే ప్రభుత్వ రంగ సంస్థ ఇండియన్ రెనివబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఐఆర్ఈడీఏ) స్టాక్ గత రెండేళ్లుగా తీవ్ర ఒత్తిడిలో కొనసాగుతోంది. ఈ ఐఆర్ఈడీఏ స్టాక్ విషయానికి వస్తే 2024 జులై 15న రూ. 310 వద్ద ఆల్ టైమ్ గరిష్ఠాన్ని తాకింది. ఇక 2026 అక్టోబర్ 1 సెషన్‌లో చూస్తే ఈ స్టాక్ ధర రూ. 111 వద్ద స్థిరపడింది. దీంతో ఆల్ టైమ్ హై నుంచి చూస్తే కేవలం రెండేళ్ల వ్యవధిలోనే షేర్ ధర ఏకంగా 64 శాతం కుదేలైంది. ఈ 2026లోనే ఐఆర్ఈడీఏ షేర్ ధర సుమారు 20 శాతం తగ్గగా, ఏడాది వ్యవధిలో 28 శాతం పతనమైంది. సెప్టెంబర్ 16న ఈ స్టాక్ ధర రూ. 107.40 వద్ద 52 వారాల కనిష్ఠ స్థాయిని తాకింది.

ఐపీఓ ధర నుంచి మాత్రం భారీగా జంప్...

అయితే ఐపీఓ ధరతో పోలిస్తే పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. 2023 నవంబరు 29న మార్కెట్లో లిస్ట్ అయిన ఐఆర్ఈడీఏ షేరు రూ. 32 ధరతో చూస్తే ప్రస్తుతం కూడా 247 శాతం అధికంగానే ఉంది. ఐపీఓ తర్వాత స్టాక్ ఊహించని రీతిలో భారీగా పెరిగింది. ఒక దశలో దీని ప్రైస్ టు బుక్ వాల్యూ గరిష్ఠ మార్కును దాటింది. ఇది కంపెనీ అసలు విలువ కంటే చాలా ఎక్కువ కావడంతో మార్కెట్ ధర సాధారణ స్థాయికి దిగొస్తుంది. తాజాగా ఐఆర్ఈడీఏ టాప్ మేనేజ్మెంట్‌కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అక్టోబర్ 1న కంపెనీ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్ ప్రకారం- డాక్టర్ విజయ్ కుమార్ మోహంతీకి ఐఆర్ఈడీఏ ఛైర్మన్ అండ్ ఎండీ అదనపు బాధ్యతలను మరో 3 నెలలు పొడిగించారు. జులై నుంచి ఈయన అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇది కూడా ఇన్వెస్టర్లలో అనిశ్చితికి కారణమైంది. వార్షిక ఫలితాలు బాగానే ఉన్నా, త్రైమాసిక ఫలితాలు నిరాశపర్చడం కూడా స్టాక్ పతనం అయ్యేందుకు కారణమవుతోంది.

విజయ్ బ్రాండ్‌పై ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని మరింత బలోపేతం చేయాలి

విజయ ఆయిల్‌ను తెలంగాణకే పరిమితం చేయకుండా దేశవ్యాప్తంగా విస్తరించాలి

శివరాంపల్లిలో విజయ మెగా ఆయిల్ ప్యాకింగ్ కేంద్రం, మినరల్ వాటర్ ప్లాంట్‌ను మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి ప్రారంభించిన మంత్రి తుమ్మల

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 02: శివరాంపల్లిలో టీజీ ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విజయ మెగా ఆయిల్ ప్యాకింగ్ కేంద్రాన్ని, మినరల్ వాటర్ ప్లాంట్‌ను మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. విజయ వంట నూనెల విక్రయ కేంద్రానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 20 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ప్రారంభమైన విజయ ఆయిల్ ప్యాకింగ్ కేంద్రం నేడు రోజుకు 200 మెట్రిక్ టన్నుల సామర్థ్యానికి ఎదగడం గర్వకారణమని మంత్రి తుమ్మల అన్నారు. విజయ ఆయిల్‌ను ఈ స్థాయికి తీసుకువచ్చిన ప్రతి ఒక్కరినీ అభినందించారు. ప్రైవేట్ ఆయిల్ బ్రాండ్ల ఆధిపత్యాన్ని తగ్గించి, ప్రజలకు నాణ్యమైన వంట నూనెలను సరసమైన ధరలకు అందించడంతో పాటు ధరల స్థిరీకరణ లక్ష్యంతో విజయ ఆయిల్ ప్యాకింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విజయ ఆయిల్ తొలినాళ్లలో వేరుశనగ, పొద్దుతిరుగుడు, పామాయిల్ వంటి మూడు రకాల వంట నూనెలను అందించగా,

ప్రస్తుతం రైస్ బ్రాన్, నువ్వుల, దీపం, కొబ్బరి తదితర ఆరు రకాల వంట నూనెలను వినియోగదారులకు అందిస్తున్నదని మంత్రి పేర్కొన్నారు. విజయ్ బ్రాండ్ అంటే నాణ్యతకు గుర్తింపు అని, ప్రజల్లో ఉన్న ఈ నమ్మకాన్ని మరింత బలోపేతం చేయాలని అన్నారు. నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకుండా వినియోగదారుల విశ్వాసాన్ని కాపాడుకోవాలని సూచించారు. శివరాంపల్లిలో ఏర్పాటు చేసిన మెగా ఆయిల్ ప్యాకింగ్ కేంద్రం పూర్తిగా ఆటోమేటెడ్ విధానంలో, పరిశుభ్రమైన, హైజెనిక్ వాతావరణంలో వంట నూనెలను ప్యాకింగ్ చేసేలా రూపొందించామని మంత్రి తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని ఉత్పత్తి సామర్థ్యంతో పాటు నాణ్యతను మరింత పెంచాలని సూచించారు. మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభంతో ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ మార్కెట్‌లోకి విజయ అడుగుపెట్టిందని తెలిపారు. విజయ ఆయిల్ ఉత్పత్తులు తెలంగాణకే పరిమితం కాకుండా దేశవ్యాప్తంగా అందుబాటులోకి రావాలని మంత్రి తుమ్మల అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు మూడున్నర లక్షల ఆయిల్‌పామ్ సాగు అవుతుందని, రానున్న రోజుల్లో రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగును 10 లక్షల ఎకరాలకు తీసుకెళ్లడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, వ్యవసాయశాఖ కార్యదర్శి సురేంద్రమోహన్, ఆయిల్ ఫెడ్ ఎండీ యాస్మిన్ బాషా, రిటైర్డ్ ఐ.పి.ఎస్ శ్రీనివాస్ రెడ్డి మరియు రైతులు పాల్గొన్నారు.

పిల్లలను కనకపోతే క్రూరత్వమా?

సంతానం లేకపోవడాన్ని క్రూరత్వంగా పరిగణించలేం.. : మద్రాస్ హైకోర్టు

చెన్నై, వెలుతురు అక్టోబర్ 02 : సంతానలేమిపై మద్రాస్ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సంతానం లేకపోవడాన్ని క్రూరత్వంగా పరిగణించలేమని న్యాయస్థానం స్పష్టం చేసింది. కేవలం దంపతులు కాలేదన్న కారణంతో భార్యను దోషిగా పేర్కొనలేమని తెలిపింది. జస్టిస్‌లు జి.ఆర్. స్వామినాథన్, ఎం.డి. సుమతిలతో కూడిన ధర్మాసనం... భార్యకు సంతానం కలగకపోవడాన్ని 'వైవాహిక దోషం'గా పరిగణించలేమని తీర్పు ఇచ్చింది. భార్య క్రూరంగా ప్రవర్తిస్తోందని ఆరోపిస్తూ విడాకులు కోరుతూ భర్త దాఖలు చేసిన పిటిషన్‌ను మద్రాసు హైకోర్టు కొట్టివేసింది. భార్య క్రూరత్వం కారణంగా సంతానం కలగలేదని.. తనకు విడాకులు ఇవ్వాలంటూ ఓ భర్త పిటిషన్ వేశాడు. ఈ పిటిషన్‌ను ఫ్యామిలీ కోర్టు కొట్టేసింది. అనంతరం బాధితుడు హైకోర్టును ఆశ్రయించాడు. విచారణ అనంతరం హైకోర్టు కూడా పిటిషన్‌ను కొట్టేసింది. వివాహం యొక్క ఉద్దేశం పిల్లలను కనడం మాత్రమే కాదని.. సంతానం లేనంతమాత్రాన వైవాహిక సంబంధంలో ఏ భాగస్వామి విఫలమైనట్లు కాదని కోర్టు పేర్కొంది.

అసలు విషయం ఏమిటి?

బార్ అండ్ బెంచ్ నివేదిక ప్రకారం.. ఆ దంపతులు జూన్ 2007లో వివాహం చేసుకున్నారు. మొదట్లో వివాహ జీవితం సజావుగా సాగినప్పటికీ... ఆ తర్వాత భార్య తనను అవమానించడం, పని నుంచి ఆలస్యంగా ఇంటికి వచ్చినప్పుడు అనుమానించడం, తరచుగా ఇంటి నుంచి బయటకు వెళ్లిపోవడం ప్రారంభించిందని భర్త ఆరోపించాడు. 2016 జూన్‌లో తన భార్య బహిరంగంగా తనను నపుంసకుడని పిలిచిందని.. చెప్పుతో, ఆ తర్వాత చీపురుతో కొట్టిందని, మంగళసూత్రాన్ని తీసివేసిందని, ఫొటోలను చించివేసి ఇంటి నుంచి వెళ్లిపోయిందని ఆరోపించాడు. అయితే భర్త ఆరోపణలను భార్య ఖండించింది. తాను గర్భాశయ ఫైబ్రాయిడ్లకు శస్త్రచికిత్స చేయించుకున్నానని, అలాగే బిడ్డను కని తన వైవాహిక జీవితాన్ని కొనసాగించాలనే ఆశతో చికిత్స కూడా తీసుకున్నానని తెలిపింది. శారీరక, మానసిక ఇబ్బందులు తెలిసినప్పటికీ, బిడ్డను కనాలని, వైవాహిక బంధాన్ని కాపాడుకోవాలని ఆశతో భార్య సంతోషంగా అటువంటి చికిత్సను భరిస్తే, ఆమె ప్రవర్తనను ఏ విధంగానూ వివాహాన్ని తిరస్కరించినట్లుగా గానీ, భర్త పట్ల క్రూరత్వంగా గానీ పరిగణించలేమని కోర్టు పేర్కొంది. భర్తతో కుటుంబాన్ని ఏర్పరచుకోవాలనే ఆశతో పదేపదే బాధాకరమైన చికిత్స చేయించుకునే స్త్రీ, వైవాహిక బంధాన్ని విడిచిపెట్టిన వ్యక్తిగా పరిగణించబడదని తెలిపింది. పిల్లలు లేకపోవడం వల్ల భార్యాభర్తలిద్దరూ మానసిక వేదనకు గురైనప్పటికీ, సంతానలేమి చికిత్స వల్ల కలిగే శారీరక పరిణామాలను భరించాల్సింది మహిళేనని కూడా కోర్టు పేర్కొంది. దంపతులు చాలా కాలం పాటు విడివిడిగా ఉండటం క్రూరత్వాన్ని లేదా వివాహం పూర్తిగా విచ్ఛిన్నమవ్వడాన్ని నిరూపించడానికి సరిపోతుందనే వాదనను కూడా కోర్టు తిరస్కరించింది.

అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ, పీజీ దరఖాస్తుల గడువు మళ్లీ పొడిగింపు

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 02 : డా.బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో వివిధ కోర్సుల ప్రవేశాల గడువును ఈ నెల 13వ తేదీ వరకు పొడిగించారు. విద్యార్థుల సౌలభ్యం కోసం అడ్మిషన్ల తేదీని పెంచుతూ యూనివర్సిటీ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ విద్యా సంవత్సరంలో డిగ్రీ, పీజీ, డిప్లొమా , ఇతర ఉన్నత చదువుల కోర్సుల్లో ప్రవేశాలు పొందాలనుకునే అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు. బీఏ, బీకాం, బీఎస్సీతో పాటు పలు పీజీ కోర్సులకు కూడా దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. అలాగే ఈ విద్యా సంవత్సరం నుంచి యూనివర్సిటీ కొత్తగా కొన్ని పీజీ కోర్సులను కూడా అందుబాటులోకి తెచ్చింది. విద్యారంగం, కంప్యూటర్ సైన్స్, స్టాటిస్టిక్స్, డేటా సైన్స్, సోషల్ వర్క్ వంటి పలు ఆధునిక కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నారు. వీటితో పాటు డిగ్రీ, పీజీ స్థాయిలలో ప్రత్యేకంగా ఆన్‌లైన్ కోర్సులను కూడా నిర్వహిస్తున్నారు. ఆసక్తి గల వారు ఆన్‌లైన్ ద్వారా అడ్మిషన్లు పొందవచ్చు. అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు యూనివర్సిటీ అధికారిక వెబ్‌సైట్ద్వారా తమ పేర్లను నమోదు చేసుకొని ఆన్‌లైన్‌లో దరఖాస్తు పూర్తి చేయాలి. ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ముగిసిన తర్వాత, సంబంధిత ధ్రువపత్రాలతో ఎంపిక చేసుకున్న స్టడీ సెంటర్‌ను సంప్రదించి ప్రవేశ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులు సూచించారు. కోర్సులు, దరఖాస్తు విధానానికి సంబంధించిన పూర్తి వివరాలను వర్సిటీ వెబ్‌సైట్‌లో https://www.braouonline.in/ పరిశీలించవచ్చు.

ఉక్కు వినియోగదారుల వేదిక ఉపాధ్యక్షుడిగా అర్ఫత్ యదుల్లాహి

హైదరాబాద్,వెలుతురు అక్టోబరు 2: ఉక్కు వినియోగదారుల వేదిక (ఎస్‌సీఎఫ్) ఉపాధ్యక్షుడిగా వీసీ అర్ఫత్ యదుల్లాహిని నియమించారు. ఈ మేరకు ఎస్‌సీఎఫ్ చైర్మన్ జయంతి సింగ్ అధికారికంగా ప్రకటించారు. సంస్థ అభివృద్ధి, బలోపేతానికి అర్ఫత్ యదుల్లాహి అనుభవం, వ్యూహాత్మక దృష్టి, నాయకత్వ లక్షణాలు దోహదపడతాయని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా జయంతి సింగ్ మాట్లాడుతూ.. అర్ఫత్ యదుల్లాహిని ఉపాధ్యక్షుడిగా స్వాగతించడం సంతోషంగా ఉందన్నారు. ఆయన అనుభవం, నిబద్ధత సంస్థ లక్ష్యాల సాధనలో కీలకంగా ఉంటాయని తెలిపారు. సమష్టి నాయకత్వంతో ఎస్‌సీఎఫ్‌ను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. అర్ఫత్ యదుల్లాహి నియామకంపై ఎస్‌సీఎఫ్ ప్రతినిధులు, సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. సంస్థ కార్యక్రమాల్లో ఆయన మార్గదర్శకత్వం, సహకారం కీలకంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

తెలంగాణ రిజిస్ట్రేషన్ స్టాంప్స్ డిపార్ట్మెంట్ గెజిడెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఎన్నికల అధికారిగా గండూరి వెంకటేశ్వర్లు

హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 02 : తెలంగాణ రిజిస్ట్రేషన్ స్టాంప్స్ డిపార్ట్మెంట్ గెజిడెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (టిజివోఫోరం) ఎన్నికలు ఈ ఆదివారం రోజున గెజిటెడ్ భవన్, నాంపల్లిలో జరగనుంది. టీజీవో సెంట్రల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ ఎన్నికలుకు ఎన్నికల అధికారులుగా గండూరి వెంకటేశ్వర్లు, టిజివో నగరశాఖ అధ్యక్షులు, సహాయ ఎన్నికల అధికారిగా సయ్యద్ షౌకత్ హుస్సేన్ డి. ఎ.వో ఫోరం ప్రెసిడెంట్ వ్యవరిస్తారు. కేంద్ర సంఘం అధ్యక్షులు ఏలూరి శ్రీనివాస రావు, ప్రధాన కార్యదర్శి శ్యామ్ పర్యవేక్షణలో జరిగే ఈ ప్రతిష్టాత్మక ఎన్నికలలో రిజిస్ట్రేషన్, స్టాంప్స్ విభాగపు అధికారులు పాల్గొననున్నారు.

బంజారాహిల్స్‌లో అర్ధరాత్రి కారు బీభత్సం

20 ఏళ్ల యువకుడికి స్వల్ప గాయాలు

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 02 : హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ రోడ్ నంబర్-1లో అర్ధరాత్రి కారు బీభత్సం సృష్టించింది. అతివేగంగా దూసుకొచ్చిన మహీంద్రా స్కార్పియో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది. ప్రమాదంలో కారు నడుపుతున్న 20 ఏళ్ల యువకుడు రూప్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. వేగంగా వచ్చిన స్కార్పియో ఒక్కసారిగా అదుపుతప్పి చెట్టును ఢీకొనడంతో భారీ శబ్దం వినిపించింది. దీంతో స్థానికులు అప్రమత్తమై పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పంజాగుట్ట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గురైన వాహనాన్ని పరిశీలించారు. వాహనాన్ని 20 ఏళ్ల రూప్ నడుపుతున్నట్లు పోలీసులు గుర్తించారు. అతను మద్యం మత్తులో వాహనం నడిపి ఉంటాడని అనుమానిస్తున్నారు. ప్రమాద సమయంలో కారులో మరెవరైనా ఉన్నారా? వాహనం ఏ వేగంతో ప్రయాణిస్తోంది? అనే వివరాలపై ఆరా తీస్తున్నారు. ప్రమాదంలో ఎవరికీ తీవ్ర గాయాలు కాకపోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. ఘటనకు దారితీసిన కారణాలపై పంజాగుట్ట పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

ఆర్‌ఎస్ బ్రదర్స్ నిలువెత్తు ప్రతిబింబం

విశ్వసనీయతకు, సంప్రదాయ విలువలకు, అధునాతన ఫ్యాషన్లకు

సైదాబాద్, సంతోష్‌నగర్ సర్కిల్‌లో ఘనంగా ప్రారంభమైన ఆర్.ఎస్.బ్రదర్స్ 20వ షోరూమ్

సంతోష్ నగర్ వెలుతురు అక్టోబర్ 02: వస్త్ర ప్రియుల్ని అలరిస్తున్న బ్రాండ్ ఆర్.ఎస్.బ్రదర్స్ తమ 20వ షోరూమ్ ను సైదాబాద్, సంతోష్‌నగర్ సర్కిల్‌లో అక్టోబర్ 2న ఘనంగా ప్రారంభించారు. ఈ సరికొత్త మెగా షాపింగ్‌మాల్ ఘనమైన ప్రారంభోత్సవం సుప్రసిద్ధ సినీతార నిధి అగర్వాల్ చేతుల మీదుగా జరగడం విశేషం. ఈ శుభారంభం సందర్భంగా పెద్ద ఎత్తున విచ్చేసిన సందర్శకులను ఉద్దేశిస్తూ, నిధి అగర్వాల్– "విశ్వసనీయతకు, సంప్రదాయ విలువలకు, అధునాతన ఫ్యాషన్లకు ఆర్.ఎస్.బ్రదర్స్ నిలువెత్తు ప్రతిబింబం"బి అన్నారు. ఈ వేడుకను తిలకించేందుకు విచ్చేసిన స్థానిక కుటుంబాల వారిని ఆర్.ఎస్.బ్రదర్స్ యాజమాన్యం హృదయపూర్వక స్వాగతం పలికింది. కుటుంబంలోని అన్ని తరాల వారి అభిరుచులను, అవసరాలను దృష్టిలో ఉంచుకుని, ఫ్యాషన్లలో వైవిధ్యాన్ని ప్రదర్శిస్తూ, అందుబాటు ధరలలో విశ్వసనీయ వస్త్రవిశేషాల్ని అందించడంలో తమ సంస్థ ఎప్పుడూ ప్రథమ శ్రేణిలోనే ఉంటుందని, ఎప్పటికప్పుడు సరికొత్త మైలురాళ్ళను అధిగమిస్తూ, ముందుకు సాగిపోతూ ఉంటుందని ఆర్.ఎస్. బ్రదర్స్ యాజమాన్యం వినమ్రంగా వెల్లడించింది. పి. వెంకటేశ్వర్లు, ఎస్. రాజమౌళి, టి. ప్రసాదరావు, మరియు స్వర్గీయ పి. సత్యనారాయణ నెలకొల్పిన ఈ సంస్థ తన సుదీర్ఘ ప్రయాణంలో కస్టమర్ల ఆదరాభిమానాలను చూరగొని, మున్ముందుకు సాగిపోతోంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని నిర్వాహకులు ఈ విధంగా ప్రసంగించారు.

పి. వెంకటేశ్వర్లు (ఫౌండర్ & ఛైర్‌పర్సన్):

"అనేక దశాబ్దాలుగా సేవలు అందిస్తున్న మా సంస్థ మీ ఆశీస్సులతో 20వ షోరూమ్‌ను ప్రారంభించడం మాకు ఎంతో సంతోషంగా ఉంది. సైదాబాద్ మరియు ఆ పరిసర ప్రాంతాల వారి అభిరుచులకు అనుగుణంగా నాణ్యమైన వైవిధ్యభరిత వస్త్రశ్రేణిని, ఫ్యాషన్లను, అందుబాటు ధరలలో ఒకేచోట అందజేయడం మాకు ఎంతో ఆనందంగా ఉంది."

ఎస్. రాజమౌళి (ఫౌండర్ & మేనేజింగ్ డైరెక్టర్):

"సైదాబాద్‌లోని ఈ సరికొత్త మెగా షోరూమ్ వినూత్న షాపింగ్ అనుభూతి ని మీకు అందిస్తుందని, షాపింగ్‌ప్రియుల్ని తప్పకుండా అలరిస్తుందని మా ప్రగాఢ విశ్వాసం. మీరు కోరుకునే వెరైటీ డిజైన్లు ఇక్కడ తప్పక లభిస్తాయి."

టి. ప్రసాదరావు (ఫౌండర్ & హోల్-టైం డైరెక్టర్):

"సైదాబాద్‌లోని మా కస్టమర్ల అభిరుచుల్ని దృష్టిలో ఉంచుకుని ఇక్కడి సంతోష్‌నగర్ సర్కిల్‌కు మా మెగా షోరూమ్‌ను విస్తరించాం. ఈ ప్రాంతంలోని కుటుంబాలవారు మా సేవలను తప్పకుండా వినియోగించుకోగలరని విశ్వసిస్తున్నాం." పవిత్ర దసరా నవరాత్రుల శుభసందర్భంగా పూర్తి కుటుంబ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆర్.ఎస్.బ్రదర్స్ అందిస్తున్న ప్రత్యేక కలెక్షన్లు:

మహిళల కోసం : అందమైన కంచి పట్టుచీరెలు, ఫ్యాన్సీ చీరెలు, భారతదేశ వ్యాప్తంగా మాస్టర్ వీవర్స్ రూపొందిస్తున్న కళాత్మక సమర్పణలు, పెళ్లి కుమార్తెకు వన్నె తెచ్చే వైవిధ్యభరిత సంప్రదాయ వస్త్రాలు

పురుషుల కోసం : అద్భుతమైన డిజైనర్ కుర్తాలు, సాంప్రదాయిక ఎత్నిక్ వస్త్రాలు, ఫార్మల్ సూట్స్, అధునాతన కాజువల్ స్టైల్స్

చిన్నారుల కోసం : ఆకర్షణీయమైన అందాల రంగుల్లో ఆకట్టుకునే ట్రెండీ ఫెస్టివల్ సూట్స్ ఆర్.ఎస్. బ్రదర్స్ అక్టోబర్ 2న సైదాబాద్, సంతోష్ నగర్ సర్కిల్ లో శుభారంభం చేసిన సరికొత్త 20వ మెగా షోరూమ్ కు

విచ్చేసి, దసరా నవరాత్రుల సందర్భంగా అమ్మవారి పూజలకు మీ కుటుంబసభ్యుల అవసరాలకు అనుగుణమైనవి, అదేవిధంగా ఆశ్వీయుజ మాసం వివాహ వేడుకలకు అచ్చంగా సరిపోయే వస్త్ర విశేషాలను కొనుగోలు చేయగలరని, ప్రారంభోత్సవ ఆఫర్లను వినియోగించుకో గలరని నిర్వాహకులు ఆశిస్తూ, అందరికీ ఆత్మీయ స్వాగతం పలుకుతున్నారు.

జనగణనలో ఓబీసీ కాలమ్ చేర్చాల్సిందే

40 ప్రశ్నలతో జారీ చేసిన కులగణన గెజిట్ నోటిఫికేషన్ రద్దు చేయాలి

బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్

జాజిరెడ్డిగూడెం వెలుతురు అక్టోబర్ 02 : నల్గొండ జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం జాజిరెడ్డిగూడెం మండలం జాతి జనగణలో ఎస్సీ,ఎస్టీ లతోపాటు ఓబీసీ కాలమును కూడా చేర్చాల్సిందేనని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గతంలో కేంద్ర ప్రభుత్వం ఓబిసి కులగణన చేపడతామని హామీ ఇచ్చి ఈరోజు ఆ యొక్క హామీని విస్మరించిందని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాల్సినటువంటి మిగతా పార్టీలు ప్రేక్షక పాత్ర వహిస్తున్నాయని అన్నారు.బీసీ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఉన్న బీసీల సమస్యలు తీరడం లేదన్నారు.బీసీల జనాభా ఎంతో తేలితేనే వారికి విద్యా ఉద్యోగ రాజకీయ రంగాల్లో నిష్పత్తి ప్రకారం వాటా దక్కుతుందని అన్నారు.జనగణన పై జాతీయ స్థాయిలో అఖిలపక్ష పార్టీల మేధావుల కుల సంఘాల సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.బీసీల పట్ల కేంద్ర ప్రభుత్వానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న వెంటనే 40 ప్రశ్నలతో కూడిన గెజిట్ నోటిఫికేషన్ రద్దు చేయాలని అన్నారు.బిజెపి ప్రభుత్వం పూర్తి బీసీ వ్యతిరేక చర్యలకు పాల్పడుతుందని అన్నారు. బిసి విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు బొల్లెపల్లి స్వామి గౌడ్, జక్కుల మధు, బైరు నాగరాజు గౌడ్, నకిరేకంటే సైదులు, బూడిద ప్రవీణ్,జోగు గణేష్, నోముల శేషు, సతీష్, శ్రీనివాస్ రెడ్డి,తీగల శ్యామ్మ,అంజి, శ్రవణ్ మరియు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ సోమనాథ క్షేత్రంలో శ్రీ దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

కరపత్రాలు ఆవిష్కరించిన చౌటుప్పల్ పురపాలిక చైర్ పర్సన్ మొగుదాల పావని

చౌటుప్పల్ వెలుతురు అక్టోబర్ 03: చౌటుప్పల్ లోని శ్రీ సోమనాథ క్షేత్రంలో శ్రీ దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఈనెల 11 నుంచి 21 తేది వరకు నిర్వహించనున్నారు. ఉత్సవాల కరపత్రాలను పురపాలిక చైర్ పర్సన్ మోగుదాల పావని శుక్రవారం రాత్రి ఆవిష్కరించారు. సోమనాథ మహర్షికి పూజలు నిర్వహించారు. వైభవపేతంగా నిర్వహించే ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో ప్రజలంతా పాల్గొనాలని ఆమె కోరారు. నవరాత్రులు నిర్వహించే పూజా కార్యక్రమాలను సోమనాథ క్షేత్రం స్థానిక కమిటీ అధ్యక్షుడు బడుగు నరసింహ వివరించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ ఊడుగు జ్యోతి రమేష్ గౌడ్, క్షేత్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

షేక్‌పేట్ ఫ్లైఓవర్‌పై కలకలం

స్కూటర్‌పై పడిన భారీ రైన్ వాటర్ పైపు

15 రోజుల క్రితమే కొన్న స్కూటీ ధ్వంసం

హెల్మెట్‌తో బైకర్‌కు తప్పిన ప్రాణాపాయం

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 02 : హైదరాబాద్ నగరంలోని షేక్‌పేట్ ఫ్లైఓవర్ వద్ద మరోసారి ఘోర ప్రమాదం త్రుటిలో తప్పింది. ఫ్లైఓవర్ పైభాగం నుంచి వర్షపు నీరు కిందకు వెళ్లేందుకు అమర్చిన ఒక భారీ 'రైన్ వాటర్ వెంట్ పైపు' అకస్మాత్తుగా ఊడిపోయి, కింద రోడ్డుపై వెళ్తున్న ఒక స్కూటర్‌పై నేరుగా పడింది. ఈ ప్రమాద ధాటికి స్కూటర్ ముందు భాగం పూర్తిగా నజ్జునుజ్జయింది. అయితే అదృష్టవశాత్తూ వాహనదారుడు హెల్మెట్ ధరించి ఉండటంతో ప్రాణాపాయం తప్పి సురక్షితంగా బయటపడ్డాడు. కేవలం 15 రోజుల క్రితమే కొనుగోలు చేసిన కొత్త స్కూటీ ఇలా కళ్లముందే ధ్వంసమైపోవడంతో బాధితుడు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు.

పునరావృతమవుతున్న ఘటనలు.. అధికారుల నిర్లక్ష్యం

షేక్‌పేట్ ఫ్లైఓవర్‌పై పైపులు ఊడిపడటం ఇదే మొదటిసారి కాదు. గతంలోనూ ఇదే ఫ్లైఓవర్ నుంచి డ్రైనేజీ, వర్షపు నీటి పైపులు కింద ప్రయాణిస్తున్న వాహనదారులపై పడిన ఘటనలు చోటుచేసుకున్నాయి. ఆ సమయాల్లోనూ ప్రయాణికులు అదృష్టవశాత్తూ ప్రమాదాల నుంచి బయటపడ్డారు. వరసగా ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ ఫ్లైఓవర్ నిర్వహణ బాధ్యతలు చూస్తున్న అధికారులు, సంబంధిత విభాగాల సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల నిర్లక్ష్య వైఖరి వల్లే పదేపదే ఇలాంటి ప్రమాదాలు పునరావృతమవుతున్నాయని వాహనదారులు మండిపడుతున్నారు.

వెంటనే తనిఖీలు చేపట్టాలని స్థానికుల డిమాండ్

నగరంలో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే ప్రధాన రహదారిపై ఈ తరహా ప్రమాదాలు జరగడం నగరవాసులను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తోంది. ఫ్లైఓవర్‌పై ఉన్న అన్ని పైపులు, రైన్ వాటర్ వెంట్లు ఎంతవరకు సురక్షితంగా ఉన్నాయో అధికారులు వెంటనే సమగ్రంగా తనిఖీ చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. నిర్లక్ష్యాన్ని వీడి తక్షణమే మరమ్మతులు చేపట్టకపోతే, భవిష్యత్తులో ఏదైనా పెద్ద ప్రమాదం జరిగి అమాయకుల ప్రాణాలు పోయే అవకాశముందని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఫ్లైఓవర్ మెయింటెనెన్స్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు.

రుషికొండ బీచ్‌లో విషాదం

ముగ్గురు చిన్నారులు గల్లంతు

విశాఖపట్నం, వెలుతురు అక్టోబర్ 2: గాంధీ జయంతి సెలవు రోజున విశాఖ పట్నంలోని రుషికొండ బీచ్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది. ఐటీ హిల్స్ సమీపంలోని సముద్ర తీరంలో సరదాగా గడిపేందుకు వెళ్లిన ముగ్గురు చిన్నారులు సముద్రంలో గల్లంతయ్యారు. మధురవాడ ప్రాంతానికి చెందిన విద్యార్థులు సెలవు సందర్భంగా రుషికొండ బీచ్‌కు వచ్చినట్లు సమాచారం. సముద్రంలో ఆడుకుంటుండగా ఒక్కసారిగా బలమైన అలలు రావడంతో ముగ్గురు చిన్నారులు నీటిలోకి కొట్టుకుపోయినట్లు తెలుస్తోంది. వీరంతా 14 ఏళ్ల వయసు వారేనని ప్రాథమిక సమాచారం. సహచరులు వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో పీఎం పాలెం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానిక ఈతగాళ్లు, మెరైన్ పోలీసులు, రక్షణ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. గల్లంతైన చిన్నారుల కోసం స్కూబా బృందాన్ని కూడా రంగంలోకి దించినట్లు సమాచారం. పోలీసు ఉన్నతాధికారులు ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలను పర్యవేక్షిస్తున్నారు. గల్లంతైన చిన్నారుల ఆచూకీ కోసం గాలింపు కొనసాగుతోంది. ఘటనతో వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు.

గాంధీని హత్యచేసిన గాడ్సే భావజాలాన్ని వ్యతిరేకించాలి

- స్వాతంత్ర్య పోరాటంలో గాంధీ ఆలోచనలతో సంబంధం లేనివారు చరిత్రను వక్రీకరిస్తున్నారు.
- గాంధీ సిద్ధాంతాల స్ఫూర్తితోనే ప్రజా ప్రభుత్వం.. ప్రజా పాలన
- అందులో భాగంగానే 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్ బ్యూరో (వెలుతురు) :
అహింస, సత్యాగ్రహం, సమానత్వం, సామాజిక న్యాయం వంటి మహాత్మా గాంధీ ఆలోచనలే ప్రపంచానికి మార్గదర్శకాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. గాంధీజీ చూపిన మార్గంలోనే అసమానతలు, వివక్ష, అవమానాలు లేని సమాజాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. గాంధీ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, టీపీసీసీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భట్టి విక్రమార్క ప్రసంగించారు. గాంధీజీని హత్య చేసిన నాథూరామ్ గాడ్సే భావజాలాన్ని సమర్థించే ధోరణులు దేశంలో కనిపించడం బాధాకరమని అన్నారు. గాంధీని విమర్శిస్తూ, గాడ్సే విధానాలే సరైనవని మాట్లాడే సంస్కృతిని దేశభక్తులెవరూ అంగీకరించరాదన్నారు. గాంధీ ఆలోచనలకు వ్యతిరేకంగా గాడ్సే భావజాలాన్ని ముందుకు తీసుకెళ్లే ప్రయత్నాలను ప్రజలు వ్యతిరేకించాలని ఆయన పిలుపునిచ్చారు.

గాంధీ ఉద్యమాన్ని మరచి చరిత్రను వక్రీకరిస్తున్నారు

భారత స్వాతంత్ర్య ఉద్యమంలో మహాత్మా గాంధీ నాయకత్వం, సత్యాగ్రహం, అహింసా సిద్ధాంతాల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. గాంధీతో కలిసి నడవని, ఆనాటి స్వాతంత్ర్య ఉద్యమంతో సంబంధం లేని కొందరు నేడు చరిత్రను వక్రీకరించే ప్రయత్నం భారతీయ జనతా పార్టీ నాయకులు చేస్తున్నారని ఆయన విమర్శించారు. దక్షిణాఫ్రికాలో ఎదురైన అవమానం గాంధీజీ జీవితంలో కీలక మలుపుగా మారిందని చెప్పారు. పీటర్‌మారిట్జ్‌బర్గ్ రైల్వే స్టేషన్‌లో ఫస్ట్‌క్లాస్ టికెట్ ఉన్నప్పటికీ జాతి వివక్ష కారణంగా రైలు నుంచి బయటకు నెట్టివేయడం ఆయనలో ప్రజల కోసం పోరాడాలనే సంకల్పాన్ని మరింత బలపరిచిందన్నారు. అనంతరం భారతదేశానికి తిరిగి వచ్చి రైతులు, పేదలు, అణగారిన వర్గాల సమస్యలను అర్థం చేసుకుని సత్యాగ్రహ ఉద్యమాలకు నాయకత్వం వహించారని వివరించారు. చంపారన్ సత్యాగ్రహం నుంచి దండి సత్యాగ్రహం వరకు గాంధీజీ సామాన్య ప్రజల సమస్యలను ఉద్యమాలకు కేంద్రంగా మార్చారని అన్నారు. గుప్పెడు ఉప్పుతోనూ, చిన్న నూలుపోగుతోనూ బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి సవాల్ విసిరిన మహాత్ముడు ప్రజల శక్తిని ప్రపంచానికి చాటారని పేర్కొన్నారు.

ప్రజా ప్రభుత్వం.. ప్రజా పాలన

గాంధీజీ ఆలోచనల స్ఫూర్తితోనే ప్రజల అవసరాలను గుర్తించి, వారికి అనుగుణంగా ప్రభుత్వ విధానాలను రూపొందిస్తున్నామని తెలిపారు. ప్రజలందరికీ సమాన అవకాశాలు, విద్య, సామాజిక గౌరవం కల్పించడమే ప్రజా పాలన లక్ష్యమన్నారు. ఈ ఆలోచనలకు అనుగుణంగానే రాష్ట్ర ప్రభుత్వం 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల' ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. కులం, మతం, వర్గం అనే భేదాలు లేకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీ వర్గాలకు చెందిన విద్యార్థులు కలిసి చదువుకునేలా ఈ పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో 100కు పైగా పాఠశాలలను నిర్మించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ఒక్కో పాఠశాలకు సుమారు 25 ఎకరాల విస్తీర్ణంలో అంతర్జాతీయ ప్రమాణాలతో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు దాదాపు రూ.200 కోట్ల చొప్పున ఖర్చు చేయాలనే ఆలోచనతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. వివిధ సామాజిక వర్గాల పిల్లలు కలిసి చదువుకోవడం ద్వారా సమానత్వం, సామాజిక ఐక్యతకు బలమైన పునాది ఏర్పడుతుందని పేర్కొన్నారు.

గాంధీ ఆలోచనలే సామాజిక సమానత్వానికి పునాది

స్వాతంత్ర్యం కోసం పోరాడుతూనే గాంధీజీ సామాజిక అసమానతలు, అంటరానితనానికి వ్యతిరేకంగా కూడా ఉద్యమించారని అన్నారు. సమాజంలో వెనుకబడిన వర్గాలను ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడానికి ఆయన కృషి చేశారని తెలిపారు.

హిందూ-ముస్లిం ఐక్యతను బలోపేతం చేసి స్వాతంత్ర్య ఉద్యమాన్ని విస్తృత ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దారని చెప్పారు. గాంధీ, నెహ్రూ తదితర జాతీయ నాయకులు వేసిన పునాదుల వల్లే స్వతంత్ర భారతదేశంలో సైన్స్ అండ్ టెక్నాలజీ, హరిత విప్లవం, శ్వేత విప్లవం, నీలి విప్లవం వంటి రంగాల్లో పురోగతి సాధ్యమైందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. కార్యక్రమానికి హాజరైన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు గాంధీ వేషధారణలో ఉన్న చిన్నారులు ప్రత్యేకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ రకాల స్టాల్స్ ను ఆయన ఆసక్తిగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్ గౌడ్, గడ్డం వివేక్ వెంకటస్వామి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

జపాన్‌లో రెండోరోజు పర్యటించిన తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధి బృందం

ఆసియా క్రీడలను వీక్షించిన మంత్రి వాకిటి శ్రీహరి నేతృత్వంలోని బృందం

వెలుతురు హైదరాబాద్ / జపాన్, అక్టోబర్ 2: జపాన్‌లోని ఐచి-నాగోయా వేదికగా జరుగుతున్న ఆసియా క్రీడలను తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధి బృందం వీక్షించింది. రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి నేతృత్వంలో జపాన్‌లో పర్యటిస్తున్న ఈ బృందం రెండో రోజు పర్యటనలో భాగంగా క్రీడా పోటీలను తిలకించింది. ఈ బృందంలో మంత్రి వాకిటి శ్రీహరితో పాటు ప్రభుత్వ ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ శివసేన రెడ్డి, వీసీ ఉ ఎండీ సోనీ బాలాదేవి ఉన్నారు. ఆసియా క్రీడల్లో పతకాలు సాధించి దేశానికి కీర్తి ప్రతిష్ఠలు తీసుకొస్తున్న భారత క్రీడాకారులతో పాటు తెలంగాణకు చెందిన క్రీడాకారులకు మంత్రి వాకిటి శ్రీహరి శుభాకాంక్షలు తెలిపారు. అంతర్జాతీయ క్రీడా వేదికలపై భారత క్రీడాకారులు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. తెలంగాణలో క్రీడారంగ అభివృద్ధి, క్రీడాకారులకు మెరుగైన శిక్షణ సదుపాయాలు కల్పించడం, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా యువతను ప్రోత్సహించడం వంటి అంశాలపై ఈ పర్యటన ద్వారా వివిధ క్రీడా వ్యవస్థల అనుభవాలను పరిశీలించే అవకాశం లభించనుంది.

కల్వకుర్తిలో మహాత్మా గాంధీ విగ్రహం

ఆవిష్కరించిన మంత్రులు జూపల్లి, అడ్లూరి

కల్వకుర్తి వెలుతురు అక్టోబర్ 02: జాతిపిత మహాత్మా గాంధీజీ జయంతిని పురస్కరించుకుని నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన గాంధీజీ విగ్రహాన్ని మంత్రులు జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆవిష్కరించారు. నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్‌తో కలిసి మంత్రులు విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్య సాధన కోసం గాంధీజీ చేసిన పోరాటాన్ని, ఆయన అనుసరించిన సత్యం, అహింస, శాంతి, సత్యాగ్రహ సిద్ధాంతాలను స్మరించుకున్నారు. గాంధీజీ ఆశయాలు, సిద్ధాంతాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని మంత్రులు పేర్కొన్నారు. ఆయన చూపిన సత్యం, అహింస మార్గంలో పయనిస్తూ శాంతి, సౌభ్రాతృత్వం, సామాజిక బాధ్యతలను పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఉట్టిపడిన గ్రామస్వరాజ్య స్ఫూర్తి

- గాంధీ జయంతి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక గ్రామసభలు సక్సెస్
- గ్రామ అవసరాలు, వనరులతో రంగురంగుల ముగ్గులతో గ్రామ పటాలు
- గ్రామాభివృద్ధి ప్రణాళికపై ప్రజలతో చర్చించి తీర్మానాలు
- గ్రామసభ తీర్మానాలను ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలి : మంత్రి సీతక్క

వెలుతురు విలేకరులు, అక్టోబర్ 02 ;
మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో శుక్రవారం ప్రత్యేక గ్రామసభలను నిర్వహించారు. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం, గ్రామాల అవసరాలు, అందుబాటులో ఉన్న వనరులను గుర్తించడం, రాబోయే కాలానికి సమగ్ర అభివృద్ధి ప్రణాళికను రూపొందించడం లక్ష్యంగా గ్రామసభలను నిర్వహించారు.

గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్ఫూర్తితో పల్లెల్లో ప్రత్యేక గ్రామసభలను పండగ వాతావరణంలో నిర్వహించారు. గ్రామాల్లో రంగురంగుల ముగ్గులు వేసి వాటిపై గ్రామ పటాలను రూపొందించారు. గ్రామంలోని రహదారులు, తాగునీటి వనరులు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పారిశుధ్య సదుపాయాలు, సాగునీటి వనరులు, ఇతర మౌలిక వసతులతో పాటు అవసరమైన అభివృద్ధి పనులను ఈ గ్రామ పటాల్లో పొందుపరిచారు. ప్రత్యేక గ్రామసభల్లో గ్రామ ప్రజల అవసరాలు, సమస్యలు, ప్రాధాన్యతలను గుర్తించి వాటిపై విస్తృతంగా చర్చించారు. రాబోయే ఆర్థిక సంవత్సరానికి గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ) రూపకల్పనలో ప్రజల సూచనలను పరిగణనలోకి తీసుకున్నారు. అందుబాటులో ఉన్న వనరులు, వివిధ శాఖల పథకాలను సమన్వయం చేసుకుని గ్రామానికి అవసరమైన పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు.

గ్రామసభల్లో తాగునీరు, పారిశుధ్యం, రోడ్లు, డ్రైనేజీ, వర్షపు నీటి సంరక్షణ, ఉపాధి, జీవనోపాధి, మహిళా స్వయం సహాయక సంఘాల బలోపేతం, వ్యవసాయం తదితర అంశాలపై చర్చించారు. గ్రామ అవసరాలకు అనుగుణంగా వివిధ శాఖల పథకాలను సమన్వయం చేసి అభివృద్ధి ప్రణాళికలో చేర్చేలా చర్యలు చేపట్టారు. ప్రత్యేక గ్రామసభలకు ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత శాఖల అధికారులు హాజరై ప్రజల నుంచి సూచనలు, అభిప్రాయాలను స్వీకరించారు. గ్రామాభివృద్ధిలో ప్రజలను భాగస్వాములను చేస్తూ పారదర్శకంగా ప్రణాళికలు రూపొందించాల్సిన అవసరాన్ని అధికారులు వివరించారు.

గ్రామసభ తీర్మానాలకు ప్రాధాన్యత ఇవ్వాలి

ప్రత్యేక గ్రామసభల్లో ప్రజలు చేసిన సూచనలు, తీసుకున్న తీర్మానాలను కేవలం కాగితాలకే పరిమితం చేయకుండా ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. గ్రామసభలో గుర్తించిన అవసరాలను జీపీడీపీలో ప్రతిబింబించాలని, అందుబాటులో ఉన్న నిధులు, ప్రభుత్వ పథకాలు, శాఖల సమన్వయంతో ప్రాధాన్యతా పనులను పూర్తి చేయాలని సూచించారు. గ్రామసభల్లో తీసుకున్న నిర్ణయాల అమలులో పారదర్శకత, జవాబుదారీతనం పాటించాలని, ప్రజలకు సమాచారం అందుబాటులో ఉండేలా చూడాలని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ప్రజల భాగస్వామ్యంతో గ్రామాల అవసరాలను గుర్తించి, స్థానిక వనరులను సద్వినియోగం చేసుకుంటూ రూపొందించే గ్రామాభివృద్ధి ప్రణాళికలు పల్లెల సమగ్ర అభివృద్ధికి దోహదపడేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి ఆదేశించారు.

తెలుగు రాష్ట్రాల్లో మళ్లీ వర్షాలు

అక్టోబర్ 4- 6 మధ్య భారీ వర్షాలకు అవకాశం

తెలంగాణ, ఏపీ, తమిళనాడు, కర్ణాటకలోనూ వానలు

భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తీపి కబురు

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 02 :
వర్షాకాలంలో కూడా సమ్మర్లా ఎండలు మండుతుండగా, భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తీపి కబురు అందించింది. నైరుతి రుతుపవనాల ఉపసంహరణ ఉత్తర భారతంలో కొనసాగుతున్నా, దక్షిణాది రాష్ట్రాల్లో మాత్రం వర్షాలు కురిసే పరిస్థితులు కనిపిస్తున్నాయని తెలిపింది. కేరళ నుంచి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక వరకు పలు ప్రాంతాల్లో అక్టోబర్ 7 వరకు వానలు పడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. ముఖ్యంగా కేరళ, మాహే ప్రాంతాల్లో అక్టోబర్ 2 నుంచి 7 వరకు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని, అక్టోబర్ 4 నుంచి 6 మధ్య కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు పడొచ్చని అంచనా వేసింది.

తెలుగు రాష్ట్రాల్లోనూ వర్షాలు

తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. కోస్తాంధ్ర, రాయలసీమలో అక్టోబర్ 2 నుంచి వర్షాలతో పాటు బలమైన గాలులు వీచే అవకాశం ఉంది. ఆ పరిస్థితి అక్టోబర్ 5 వరకు కొనసాగే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరించింది. తెలంగాణలోనూ అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశముందని చెప్పింది. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలపై ఏర్పడుతున్న వాతావరణ పరిస్థితుల ప్రభావంతో రాబోయే రోజుల్లో వర్షాల విషయంలో మార్పులు కనిపించొచ్చని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.

హెల్త్ కార్డుల కోసం పోస్టుకార్డ్ ఉద్యమం

- జర్నలిస్టులకు వెంటనే క్యాష్ లెస్ హెల్త్ కార్డ్ ఇవ్వాలి : అల్లం నారాయణ
- వారం రోజుల పోస్టు కార్డ్ ఉద్యమానికి శ్రీకారం
- ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమం మరింత ఉధృతం చేస్తాం : టీయూడబ్ల్యూజే

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 02
రాష్ట్రవ్యాప్తంగా వివిధ హోదాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులు అందరికీ ప్రభుత్వం వెంటనే క్యాష్ లెస్ హెల్త్ కార్డులను ఇవ్వాలని టీయూ డబ్ల్యూ జే రాష్ట్ర అధ్యక్షుడు, మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు చాలా హామీలు ఇచ్చిందని, అందులో ఇళ్ల స్థలాలు, వంద కోట్ల రూపాయల సంక్షేమ నిధి, హెల్త్ కార్డ్స్, అక్రిడిటేషన్ కార్డ్స్, పెన్షన్ వంటివి ఉన్నాయని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు పూర్తి అవుతున్నా... జర్నలిస్టుల సంక్షేమం కోసం ఇప్పటి వరకూ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని అల్లం నారాయణ గుర్తు చేశారు. ఇక గత ప్రభుత్వంలో అమలు అయిన హెల్త్ కార్డును ఈ ప్రభుత్వం రద్దు చేసిందని, ఇది అత్యంత బాధాకరం అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో జర్నలిస్టులకు ఉన్న సౌకర్యాన్ని తొలగించారని, దానిని తిరిగి పునరుద్ధరించడం కోసం అక్టోబర్ 2న గాంధీ జయంతి నాడు గాంధేయ మార్గంలో శాంతి యుతంగా జర్నలిస్టులం నిరసన తెలుపుతున్నామని చెప్పారు. హెల్త్‌కార్డుల కోసం టీయూ డబ్ల్యూ జే రాష్ట్రవ్యాప్త ఉద్యమంలో భాగంగా శుక్రవారం సికింద్రాబాద్ రాంగోపాల్ పేట గాంధీ చౌక్ నుంచి పోస్టు కార్డు ఉద్యమాన్ని అల్లం నారాయణ ప్రారంభించారు. కొత్తగా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వకపోగా, గతంలో జేఎన్ జే హౌసింగ్ సొసైటీకి ఇచ్చి పేట్ బషీరాబాద్ స్థలాన్ని తిరిగి తీసుకున్నారని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఉన్న హెల్త్ కార్డును కూడా రద్దు చేశారని, నిత్యం పని వత్తిడితో ఎన్నో రకాల ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న జర్నలిస్టులకు ప్రభుత్వ ఉచిత హెల్త్ కార్డు అవసరం ఉందని అల్లం అన్నారు. గాంధీ అనుసరించిన మార్గంలో మొదటగా శాంతియుత పోరాటాన్ని చేస్తున్నామని, ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనలను మరోరూపంలో ఉధృతం చేస్తామని హెచ్చరిం చారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అన్ని పార్టీలు, సంఘాలు, సంస్థలను ఏకంచేసి ఉద్యమాలు చేసిన జర్నలిస్టులం, ప్రభుత్వం హెల్త్ కార్డులు ఇవ్వకపోతే మరో సారి ఉద్యమిస్తామన్నారు. ఈ సందర్భంగా టీ యూ డబ్ల్యూ జే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతీ సాగర్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం జర్నలిస్టులకు కొత్తగా ఏమీ ఇవ్వకపోయినా, ఉన్న హెల్త్ కార్డులను తొలగించిందని అన్నరు. హెల్త్ కార్డుల కోసం పోస్టు కార్డ్ ఉద్యమం రాష్ట్ర వ్యాప్తంగా వారం రోజుల పాటు కొనసాగుతుందని, ప్రభుత్వం స్పందించక పోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని సాగర్ అన్నారు. ఈ కార్యక్రమంలో టీయూ డబ్ల్యూ జే ఉపాధ్యక్షులు రమేష్ హజారీ, టెంజు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.రమణ కుమార్,టీయూ డబ్ల్యూ జే కోశాధికారి పి.యోగనంద్, హైదరాబాద్ నగర ఇంచార్జ్ యార నవీన్ కుమార్, హైదరాబాద్ నగర అధ్యక్షుడు రాకేశ్ రెడ్డి, కోశాధికారి బాపు రావు, ఐజేయు నాయకుడు తిరుపతి నాయక్, కల్యారి రాజు మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఫోటో జర్నలిస్టు యూనియన్ అధ్యక్షుడు భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.



సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తప్పుకోవాల్సిందే..

కాక్రోచ్ జనతా పార్టీ డిమాండ్

ముంబయి శివాజీ పార్క్‌లో భారీ నిరసన

సీజేపీకి వ్యతిరేకంగా జెన్ నెక్స్ ముంబై బృందం కూడా ఆందోళనలు

ముంబై, వెలుతురు అక్టోబర్ 02
మహారాష్ట్ర రాజధాని ముంబయిలో శుక్రవారం కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన జరిగింది. సర్ ప్రక్రియలో అక్రమాలు, అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపిస్తున్న సీజేపీ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తోంది. ఈ క్రమంలోనే అభిజిత్ దీప్కే నేతృత్వంలోని సీజేపీ పిలుపు మేరకు ముంబయి శివాజీ పార్క్‌లో నిరసనకు వేలాది మంది యువకులు, విద్యార్థులు, పౌర సమాజ ప్రతినిధులు తరలివచ్చారు. ఈ ఆందోళనలో గాంధీ కుటుంబానికి చెందిన తుషార్ గాంధీ, ప్రముఖ బాలీవుడ్ నటులు షబానా అజ్మీ, నసీరుద్దీన్ షా, సంగీత దర్శకుడు విశాల్ దద్లానీ కూడా పాల్గొని మద్దతు తెలిపారు. రాజకీయ పార్టీలు శివసేన, మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన పార్టీలు కూడా నిరసనకు తమ మద్దతు ప్రకటించాయి. నిరసనకారుల్ని ఉద్దేశించి ప్రసంగించిన సీజేపీ నాయకుడు అభిజిత్ దీప్కే-నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అసమర్థంగా ఉందని విమర్శించారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై జంతర్ మంతర్ వద్ద ఆందోళనలు జరిగిన 2 నెలల వ్యవధిలోనే మరోసారి తాము నిరసన చేపట్టాల్సి వచ్చిందని అన్నారు. మరోవైపు సీఈసీ తప్పక రాజీనామా చేయాల్సిందేనని, నేర విచారణ ఎదుర్కోవాల్సిందేనని దాదర్‌లో జరిగిన నిరసనలో సీజేపీ నాయకుడు అజింక్యా శిందే డిమాండ్ చేశారు. అంతకుముందు అక్టోబర్ 2న శివాజీ పార్క్‌లో మధ్యాహ్నం 4 గంటలకు నిరసన చేపడతామని సీజేపీ ముందుగానే హెచ్చరించింది. పోలీసుల నుంచి అనుమతి లభించకపోయినప్పటికీ నిరసన కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో యువత తరలివచ్చింది. ప్రొటెస్ట్ నేపథ్యంలో శివాజీ పార్క్ పరిసరాల్లో భారీగా పోలీసులు, భద్రతా సిబ్బందిని మోహరించారు. సమీపంలోని దాదర్ రైల్వే స్టేషన్ నుంచి వచ్చే మార్గాల్లో బారికేడ్లను ఏర్పాటు చేశారు. అయినప్పటికీ పెద్ద సంఖ్యలోనే యువత శివాజీ పార్క్ వద్ద నిరసన ప్రాంతానికి చేరుకుంది. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని కోరుతూ త్రివర్ణ పతాకాలతో పాటు వివిధ ప్లకార్డులను ప్రదర్శించారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL/2019/78609. Cell: 91773 87328, Email: velthurunewspaper@gmail.com